www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 11-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 284 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య సా. 5.28 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.40 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా.12.53-2.19, దుర్ముహూర్తం: ఉ.10.33-11.17, మ.2.58-3.42, అమృతఘడియలు: మ.1.16-2.44, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 5.54 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కళ్లన్నీ రోహిత్‌పైనే!



మ్యాచ్‌కు కోహ్లీ దూరం

● అఫ్ఘాన్‌తో భారత్ తొలి టీ20 నేడు
● సిరీస్ నుంచి రషీద్ అవుట్

రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో


గిల్ తిలక్

మొహాలీ: స్టార్ ఆటగాళ్లు లేకుండా సాగుతున్న టీ20లకు మళ్లీ మునుపటి జోష్ వచ్చింది. 14 నెలల సుదీర్ఘ విరామం తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌లో ఆడుతుండడంతో మొహాలీ మరోసారి మోతెక్కిపోనుంది. ఇటీవలి కాలంలో వేగంగా ఎదుగుతున్న జట్లలో ప్రమాదకరమైన అఫ్ఘానిస్థాన్‌తో భారత్ తొలిసారి వైట్‌బాల్ సిరీస్ ఆడుతోంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగే తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. కోహ్లీ కూడా రీఎంట్రీ ఇచ్చినా వ్యక్తిగత కారణాలతో అతడు ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. తర్వాతి రెండు టీ20లకు విరాట్ అందుబాటులో ఉంటాడని కోచ్ రాహుల్ ద్రవిడ్ చెప్పాడు. 2022లో జరిగిన టీ20 వరల్డ్ కప్ సెమీస్‌లో ఓటమి తర్వాత రోహిత్, కోహ్లీ అంతర్జాతీయ టీ20లకు దూరంగా ఉంటున్నారు. అయితే, అమెరికాలో జరిగే పొట్టి వరల్డ్‌కప్ ముందు టీమిండియా ఆడే చివరి టీ20 సిరీస్ ఇదే కావడంతో.. హిట్‌మ్యాన్ ప్రదర్శనపైనే ఎక్కువగా అభిమానులు దృష్టిసారించే అవకాశం ఉంది. జైస్వాల్‌తో కలసి రోహిత్ ఓపెనింగ్ చేస్తాడని ద్రవిడ్ స్పష్టం చేశాడు. సౌతాఫ్రికా టూర్‌లో అంతగా రాణించలేక పోయిన గిల్‌కు ఈ సిరీస్ కీలకం. తిలక్ వర్మ దూకుడు పెంచాల్సి ఉండగా.. సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో ఫినిషర్‌గా రింకూ సింగ్ బాధ్యత మరింత పెరిగింది. వికెట్ కీపర్‌గా జితేష్ శర్మ, సంజూ శాంసన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. స్పిన్నర్‌గా బిష్ణోయ్‌తో పోల్చితే కుల్దీప్ యాదవ్‌వైపే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అర్ష్‌దీప్ సింగ్, ముకేష్ కుమార్, అవేశ్ ఖాన్‌లు పేస్ విభాగాన్ని నడిపించనున్నారు.


ఇబ్రహిం జద్రాన్

అఫ్ఘాన్‌తో జాగ్రత్త: మరోవైపు ప్రధాన స్పిన్నర్ రషీద్ ఖాన్ లేకుండా అఫ్ఘానిస్థాన్ బరిలోకి దిగుతోంది. వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకొన్న రషీద్.. పూర్తి ఫిట్‌నెస్‌ను సాధించలేక పోవడంతో ఏకంగా సిరీస్‌కే దూరమయ్యాడు. కానీ, గుర్బాజ్, కెప్టెన్ ఇబ్రహిం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ లాంటి ఆటగాళ్లతో అఫ్ఘాన్ గట్టిపోటీ ఇచ్చే విధంగానే ఉంది. వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్, పాకిస్థాన్ లాంటి జట్లకు షాకిచ్చిన అఫ్ఘాన్ మరోసారి అంచనాలకు మించి రాణించాలనుకొంటోంది. పైగా ఇక్కడి పిచ్‌లపై ప్రత్యర్థి ఆడిన అనుభవం లాభించనుంది.

147 టీ20ల్లో 4వేల పరుగులు పూర్తి చేసేందుకు రోహిత్ శర్మకు కావాల్సిన పరుగులు.

5 టీ20ల్లో 50 వికెట్ల ఘనత సాధించేందుకు అక్షర్ పటేల్‌కు కావాల్సిన వికెట్లు

పిచ్/వాతావరణం

పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. శీతాకాలం కావడంతో రాత్రి వేళ మంచు ప్రభావం ఎక్కువగా ఉండనుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్, తిలక్, రింకూ సింగ్, జితేష్/శాంసన్ (వికెట్ కీపర్), అక్షర్, కుల్దీప్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, అవేశ్ ఖాన్, ముకేష్ కుమార్.

అఫ్ఘానిస్థాన్: హజ్రతుల్లా జజాయ్, రహ్మనుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహిం జద్రాన్ (కెప్టెన్), నజిబుల్లా జద్రాన్, మహ్మద్ నబి, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, ముజిబుర్ రహ్మాన్, షరాఫుద్దీన్ అష్రఫ్, కైయస్ అహ్మద్, నూర్ అహ్మద్/నవీనుల్, ఫజల్‌హక్ ఫారూఖీ.

ఆ ఇద్దరిని అందుకే తీసుకోలేదు



కోచ్ ద్రవిడ్

మొహాలీ: అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు క్రమశిక్షణా చర్యల్లో భాగంగానే ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేయలేదన్న ఊహాగానాలను కోచ్ ద్రవిడ్ కొట్టిపడేశాడు. సౌతాఫ్రికా టూర్ మధ్యలో బ్రేక్ కావాలని ఇషాన్ కోరడంతో అంగీకరించామని తొలి టీ20 మ్యాచ్‌కు ముందు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ద్రవిడ్ చెప్పాడు. అయితే, స్వదేశంలో అఫ్ఘాన్‌తో సిరీస్‌కు తాను అందుబాటులో ఉంటానని ఇషాన్ సమాచారం అందించలేదన్నాడు. అతడు మళ్లీ భారత జట్టులోకి రావాలంటే.. దేశవాళీ టోర్నీలో ఆడి నిరూపించుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. మరోవైపు టీ20ల్లో జితేష్‌కు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కాగా, అయ్యర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకొన్నారంటూ వస్తున్న వార్తలను కూడా ద్రవిడ్ ఖండించాడు. అయితే, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని ముంబై తరఫున శ్రేయాస్ రంజీ మ్యాచ్‌లు ఆడనున్నాడు.

ట్రోఫీని పంచుకున్నారు

సంయుక్త విజేతలు భారత్, దక్షిణాఫ్రికా

వర్షంతో ముక్కోణపు సిరీస్ ఫైనల్ రద్దు

జొహాన్నెస్‌బర్గ్: మూడుదేశాల అండర్-19 వన్డే టోర్నమెంట్‌లో భారత్-దక్షిణాఫ్రికా జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. బుధవారం ఈ జట్ల మధ్య జరగాల్సిన ఫైనల్, వర్షం కారణంగా రద్దయింది. కనీసం 20 ఓవర్ల మ్యాచ్ అయినా నిర్వహిద్దామని రెఫరీలు వేచి చూసినా, చివరికి ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్ రద్దయింది. లీగ్ మ్యాచ్‌ల్లో భారత్ ఆడిన నాలుగింట్లోనూ నెగ్గి, నాకౌట్‌కు చేరడం తెలిసిందే. ఇక, టీమిండియా ఇప్పుడు తన దృష్టి ఈనెల 19 నుంచి జరగనున్న అండర్-19 వరల్డ్‌కప్‌పైకి మరల్చింది.

నేపాల్ క్రికెటర్ లామిచానెకు 8 ఏళ్ల జైలు



ఖాట్మాండు: అత్యాచారం కేసులో నేపాల్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్పిన్నర్ సందీప్ లామిచానె (23)కు ఎనిమిదేళ్ల జైలుశిక్ష విధించారు. 18 ఏళ్ల యువతిపై రేప్ కేసులో లామిచానెను స్థానిక జిల్లా కోర్టు దోషిగా తేల్చింది. జైలుశిక్షతోపాటు రూ. 3 లక్షల జరిమానా విధించిన న్యాయస్థానం.. బాధితురాలికి మరో రూ. 2 లక్షలను నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పునిచ్చింది. అయితే, జడ్జిమెంట్‌పై హైకోర్టుకు వెళ్తామని లామిచానె లాయర్ చెప్పారు. నేపాల్ తరఫున 51 వన్డేలు ఆడి 112 వికెట్లు తీసిన సందీప్.. 52 టీ20ల్లో 98 వికెట్లు పడగొట్టాడు. 2018-20 మధ్య ఢిల్లీ కేపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సందీప్.. ఐపీఎల్‌లో ఆడిన తొలి నేపాలీ క్రికెటర్‌గా నిలిచాడు.

ప్రణయ్, లక్ష్యసేన్‌కు షాక్

» సాత్విక్ జోడీ శుభారంభం
» మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌కు మలేసియా ఓపెన్ తొలి రౌండ్లోనే షాక్ తగలగా, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 14-21, 11-21తో అండర్స్ అంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం పాలయ్యాడు. మరో భారత క్రీడాకారుడు లక్ష్యసేన్ 15-21, 16-21తో వెంగ్ హంగ్ యాంగ్ (చైనా)తో పోరాడి ఓడాడు. డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-18, 21-19తో షోహిబల్ ఫిక్రీ-మౌలానా బాగాస్ (ఇండోనేసియా) జోడీపై నెగ్గి ముందంజ వేసింది.

ఉమా మళ్లీ కొట్టాడు

ఆసియా షూటింగ్ టీమ్ ఈవెంట్‌లో రజతం



జకర్తా: తెలుగు షూటర్ మద్దినేని ఉమామహేష్ ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో పతకం సాధించాడు. బుధవారం జరిగిన జూనియర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఉమా త్రయం రజతంతో మెరిసింది. ఉమా (630.5 పాయింట్లు), అభినవ్ షా (627.9), పార్థ్ రాకేష్ (626.8) బృందం 1885.2 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలవగా, చైనా బృందం ఒక పాయింట్ తేడాతో స్వర్ణం ఎగరేసుకుపోయింది. సీనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో యువ షూటర్ నాన్సీ 252.8 స్కోరుతో స్వర్ణం, ఒలింపియన్ ఎలవెనిల్ వలరివన్ 252.7 స్కోరుతో రజతం కొల్లగొట్టారు. 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో నాన్సీ, వలరివన్, మెహులీ ఘోష్ త్రయం పసిడి పతకం సొంతం చేసుకుంది. పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్ కాంస్యం నెగ్గాడు. 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ కేటగిరీలో రుద్రాంక్ష్, అర్జున్, శ్రీకార్తిక్ జోడీ కాంస్యం దక్కించుకుంది. జూనియర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో అభినవ్ రజతం, పార్థ్ కాంస్య పతకాలతో మెరిశారు.

నాలుగు దేశాల హాకీకి జంబో జట్టు

న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ ఉండడంతో వీలైనంత మంది ఎక్కువ ఆటగాళ్లను పరీక్షించాలన్న ఉద్దేశంతో దక్షిణాఫ్రికాలో జరిగే నాలుగు దేశాల హాకీ టోర్నమెంట్‌కు భారత్ నుంచి జంబో జట్టును ఎంపిక చేశారు. ఏకంగా 26 మంది సభ్యులతో జట్టును ప్రకటించారు. ఈనెల 22 నుంచి కేప్‌టౌన్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఆతిథ్య దక్షిణాఫ్రికాతో పాటు భారత్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్ కాగా, హార్దిక్ సింగ్ వైస్ కెప్టెన్. ఇక, మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చాడు. వెటరన్ స్టార్ శ్రీజేశ్, కృషన్ బహదూర్ పాఠక్ గోల్‌కీపర్లుగా వ్యవహరిస్తారు.

ఏడు ఓటముల తర్వాత తలైవాస్..

ముంబై: ప్రో కబడ్డీలో తమిళ్ తలైవాస్ వరుస పరాజయాలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 46-27తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. తలైవాస్‌కు ఏడు వరుస ఓటముల తర్వాత ఇదే తొలి విజయం. తలైవాస్ స్టార్ రైడర్ నరేందర్ 14 పాయింట్లతో, కార్నర్ డిఫెండర్ సాహిల్ గులియా 5 ట్యాకిల్ పాయింట్లతో ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. హరియాణా స్టీలర్స్-యూ ముంబా మధ్య జరిగిన మ్యాచ్ 44-44తో టైగా ముగిసింది.






టాప్‌సీడ్లు జొకో, స్వియటెక్

» 14 నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. ఈనెల 14 నుంచి జరిగే ఈ హార్డ్‌కోర్టు గ్రాండ్‌స్లామ్‌లో పోటీపడే క్రీడాకారులకు సంబంధించిన సీడింగ్స్ వివరాలను నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు టాప్ సీడింగ్ దక్కింది. స్పెయిన్ సంచలనం అల్కరాజ్ 2, మెద్వెదెవ్ 3, జానిక్ సిన్నర్ 4, రుబ్లేవ్ ఐదో సీడ్‌లుగా బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ఇగా స్వియటెక్‌కు టాప్ సీడ్ లభించింది. డిఫెండింగ్ చాంప్ సబలెంకా రెండో సీడ్‌గా పోటీపడనుండగా, నిరుటి రన్నరప్ రిబకినాకు 3, గాఫ్‌కు 4, పెగులాకు 5వ సీడింగ్స్ దక్కాయి.

బిజినెస్

నాలుగేళ్లలో భారత్ @ నం.3

2027-28 నాటికి జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లు.. 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్లు

వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో సీతారామన్



గాంధీనగర్: వచ్చే నాలుగేళ్లలో (2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి) భారత్ 5 లక్షల కోట్ల డాలర్లకు పైగా జీడీపీతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుందని, తద్వారా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారనుందన్నారు. బుధవారం ప్రారంభమైన 'వైబ్రెంట్ గుజరాత్ సదస్సు 2024'లో ప్రసంగిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ 3.4 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. అమెరికా, చైనా, జపాన్, జర్మనీ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి కానున్న ఈ అమృత కాలంలో ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ వంటి నవతరం పరిశ్రమల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించనుందన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించి మోదీ ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన మార్పులతో గడిచిన 9 ఏళ్లలో దేశంలోకి 59,500 కోట్ల డాలర్ల విలువైన విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు.

నెలాఖరుకు వికసిత్ భారత్ విజన్ పత్రం

అభివృద్ధి చెందిన (వికసిత్) భారత్ కేవలం కల కాదని, సుసాధ్యమేనని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితే, దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ శరవేగంగా జరుగుతున్నదని, మిగతా వర్ధమాన దేశాల కంటే భారత్ మెరుగైన పనితీరు కనబరుస్తున్నదని అన్నారు. 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈనెలాఖరు కల్లా ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆ డాక్యుమెంట్‌ను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రపంచంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్: లక్ష్మీ మిట్టల్

హజీరాలో ఆర్సెలార్‌మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా భారీ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నదని కంపెనీ అధిపతి లక్ష్మీ మిట్టల్ సదస్సులో తెలిపారు. ప్రపంచంలో ఇదే అతిపెద్ద సింగిల్ లొకేషన్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కానుందన్నారు. 2029 నాటికి సిద్ధం కానున్న ఈ స్టీల్ ప్లాంట్ 2.4 కోట్ల టన్నుల ముడి ఉక్కు తయారీ సామర్థ్యం కలిగి ఉండనుంది. అయితే దీనిపై ఎంత పెట్టుబడి పెడుతున్నది వెల్లడించలేదు.

అదానీ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

వచ్చే ఐదేళ్లలో గుజరాత్‌లో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సదస్సులో ప్రకటించారు. తద్వారా లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పెట్టుబడుల్లో భాగంగా అంతరిక్షం నుంచి సైతం కన్పించేలా 725 చదరపు కి.మీ విస్తీర్ణంలో ప్రపంచంలోనే అతిపెద్ద శుద్ధ ఇంధన ప్రాజెక్టును రాష్ట్రంలోని కచ్ ఎడారిలో నిర్మించనున్నట్లు వెల్లడించారు.

ధోలేరాలో చిప్ యూనిట్: టాటా

ధోలేరాలో భారీ సెమీకండక్టర్ (చిప్) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు టాటా గ్రూప్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి బేరసారాలు తుది దశలో ఉన్నాయని, ఈ ఏడాదిలో యూనిట్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సదస్సులో చెప్పారు. అలాగే, టాటా గ్రూప్ రాష్ట్రంలోని సనంద్‌లో 20 గిగావాట్ల లిథియం అయాన్ స్టోరేజ్ బ్యాటరీ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని సైతం రెండు నెలల్లో ప్రారంభించనుందన్నారు.

హజీరాలో కార్బన్ ఫైబర్ ప్లాంట్: అంబానీ

న్యూ మెటీరియల్స్, సర్క్యులర్ ఎకానమీలో గుజరాత్‌ను అగ్రగామిగా మార్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ హజీరాలో దేశంలో తొలి కార్బన్ ఫైబర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుందని కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ సదస్సులో ప్రకటించారు. అయితే, ఎప్పటిలోగా ఏర్పాటు చేయనున్నది, పెట్టుబడులు వంటి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

రూ.35,000 కోట్లతో రెండో ప్లాంట్: మారుతి సుజుకీ

గుజరాత్‌లో రెండో కార్ల తయారీ ప్లాంట్ కోసం రూ.35,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు మారుతి సుజుకీ ప్రకటించింది. 2030-31 నాటికి కంపెనీ కార్ల ఉత్పత్తి వార్షిక సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మార్కెట్‌లో 'డ్రీమ్' రిస్ట్ ఫోన్ ధర రూ.5,999



న్యూఢిల్లీ: స్మార్ట్‌వాచ్, స్మార్ట్‌ఫోన్ల మధ్య తేడా చెరిగిపోనుంది. ఈ రెండు పనులు 'రిస్ట్ ఫోన్' అనే ఒకే వస్తువు చేయనుంది. ఫైర్ బోల్ట్ కంపెనీ భారత మార్కెట్‌లో తొలిసారిగా 'డ్రీమ్' పేరుతో ఈ వినూత్న పరికరాన్ని విడుదల చేసింది. అత్యాధునిక ఫీచర్లతో కూడిన ఈ ఆండ్రాయిడ్ రిస్ట్‌ఫోన్ ధర రూ.5,999. ఈ రిస్ట్‌ఫోన్‌ని స్మార్ట్‌ఫోన్‌గా, స్మార్ట్ రిస్ట్‌వాచ్‌గా ఉపయోగించవచ్చు. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ ఈ రిస్ట్‌ఫోన్ లభించనుంది.

'డ్రీమ్' రిస్ట్‌ఫోన్ ఫీచర్లు : 4జీ ఎల్‌టీఈ నానో సిమ్; కాలింగ్, మెసేజింగ్‌తో పాటు యూట్యూబ్, వాట్సప్ వంటి సోషల్ మీడియా యాప్స్, 2.02 అంగుళాల స్క్రీన్, ఆండ్రాయిడ్ 8.1 ఆపరేటింగ్ సిస్టమ్, 2 జీబీ రామ్‌తో కూడిన కార్టెక్స్ క్వాడ్ కోర్ సీపీయూ, 16 జీబీ స్టోరేజి, వైఫై, జీపీఎస్ వంటి సదుపాయాలు.

ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు

» లైఫ్ టైమ్ హైలో రిలయన్స్ షేర్లు

ముంబై: స్టాక్‌మార్కెట్ బుధవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైనా చివరి గంట కొనుగోళ్లతో లాభాల్లో ముగిసింది. సెన్సెక్స్ 71,110.98 పాయింట్లు, 71,733.84 పాయింట్ల మధ్యన కదలాడి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 271.50 పాయింట్ల లాభంతో 71,657.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.85 పాయింట్ల లాభంతో 21,618.70 వద్ద ముగిసింది. ట్రేడింగ్ చివర్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వంటి హెవీ కౌంటర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాల నుంచి బయటపడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు బుధవారం బీఎస్‌ఈలో 2.7 శాతం వృద్ధితో జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.2,658.95ని నమోదు చేశాయి. చివరికి 2.69 శాతం లాభంతో రూ.2,649.95 వద్ద ముగిశాయి.

పబ్లిక్ ఇష్యూకి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్: జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ రూ.6,000 కోట్ల మెగా ఐపీఓ కోసం కంపెనీ ఇప్పటికే ప్రముఖ దేశ, విదేశీ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. ఈ ఐపీఓ మార్కెట్‌కు వస్తే సిమెంట్ రంగంలో ఇదే అతి పెద్ద ఐపీవో అవుతుంది. జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌కు ఏపీలోని నంద్యాల, కర్ణాటకలోని విజయనగర్, పశ్చిమ బెంగాల్‌లోని సల్బోని, ఒడిసాలోని జాజ్‌పూర్, మహారాష్ట్రలోని డొల్వి వద్ద సిమెంట్ ప్లాంట్లున్నాయి.

యూజియా ఫార్మా ఐపీఓ సన్నాహాలు!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా అనుబంధ కంపెనీ యూజియా ఫార్మా స్పెషాలిటీస్ పబ్లిక్ ఇష్యూ జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. యూజియాను విక్రయించాలని 2022లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థలతో అరబిందో చర్చలు జరిపింది. కంపెనీ విలువపై భేదాభిప్రాయాలు తలెత్తడంతో అరబిందో ఫార్మా ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. తాజాగా పబ్లిక్ ఇష్యూకు వచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు మార్కెట్ సమాచారం. ఈ ఏడాదిలో రూ.4,500 కోట్ల వరకూ సమీకరణకు పబ్లిక్ ఇష్యూకు రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కల్యాణి గ్రూప్ చేతికి కామినేని స్టీల్

హైదరాబాద్: కామినేని స్టీల్ అండ్ పవర్ ఇండియా కంపెనీ యాజమాన్యం చేతులు మారనుంది. దివాలా ప్రక్రియలో ఉన్న ఈ కంపెనీ కొనుగోలు కోసం కల్యాణి స్టీల్స్ లిమిటెడ్ అత్యధిక ధర రూ.450 కోట్లకు బిడ్ ఫైల్ చేసింది. ఈ మొత్తాన్ని కంపెనీ 2024 ఏప్రిల్ 7లోగా చెల్లించాలి. ఈ నెల 5న జరిగిన ఇ-వేలంలో కల్యాణి స్టీల్స్ ఇందుకోసం ఇప్పటికే రూ.23 కోట్లు బయానాగా చెల్లించింది. ఏటా 3.5 లక్షల టన్నుల స్టీల్ బిల్లెట్స్ ఉత్పత్తి సామర్థ్యంతో 2008లో కామినేని గ్రూప్ ఉమ్మడి నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డి గుడా, చెరువుగట్టు గ్రామాల్లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసింది. కార్మికుల సమ్మెలతో పాటు ఇతర సమస్యలతో కామినేని స్టీల్ అండ్ పవర్ కంపెనీ ఎన్‌సీఎల్‌టీకి చేరింది. తన వ్యాపారానికి అనుగుణంగా ఉండడంతో కల్యాణి స్టీల్స్ ఈ ప్లాంట్‌ను కొనుగోలు చేస్తోంది.

బిగ్ సీ సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్ రిటైలింగ్ చెయిన్ బిగ్ సీ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కస్టమర్లకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. తమ షోరూమ్‌లో మొబైల్ కొనుగోలు చేసిన వారికి రూ.3,000 వరకు తక్షణ డిస్కౌంట్‌తో పాటు రూ.4,999 విలువ గల స్మార్ట్ వాచ్ ఉచితంగా అందిస్తున్నట్టు సీఎండీ బాలు చౌదరి తెలిపారు. అలాగే రూ.1,10,000 విలువ గల హెల్త్‌కేర్ బెనిఫిట్, రూ.75,000 విలువ గల పేమెంట్ బెనిఫిట్ అందిస్తున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా వివో ఎక్స్ 100 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు ప్రవేశపెట్టామని, ఈ ఫోన్ కొనుగోలు చేసిన వారికి 10 శాతం తక్షణ క్యాష్‌బాక్‌తో పాటు రూ.10,999 విలువ గల ఫైర్‌బోల్ట్ స్మార్ట్ వాచ్, టీడబ్ల్యూఎస్ బడ్స్ ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. దీనితో పాటు రెడ్‌మీ నోట్ 13 సిరీస్ మొబైల్స్ కూడా విడుదల చేశామంటూ ఈ మొబైల్ కొనుగోలు చేసిన వారికి రూ.2,000 క్యాష్‌బాక్‌తో పాటు డిన్నర్ సెట్ ఉచితంగా అందిస్తున్నట్టు వెల్లడించారు. వీటితో పాటుగా ఎన్నో ఆకర్షణీయమైన ఇతర ఆఫర్లు కూడా ఉన్నట్టు చెప్పారు.

సంగీతాలో రెడ్‌మీ నోట్ 13 ఆవిష్కారం

హైదరాబాద్: సంగీతా మొబైల్స్ యెలహంకా స్టోర్‌లో ఎంతో కాలంగా ఆతృతగా ఎదురు చూస్తున్న, అత్యంత అధునాతన ఫీచర్లు గల రెడ్‌మీ నోట్ 13 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. ఇది స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని తెలిపింది. షామి ఇండియా ఓటీ హెడ్ సాజు రత్నం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌మీ నోట్ 13లో మిడ్‌రేంజ్ విభాగంలో మరింత ఆకర్షణీయమైన నోట్ 13, నోట్ 13 ప్రో, నోట్ 13 ప్రో ప్లస్ వేరియెంట్లుంటాయి. నోట్ 13 ప్రోప్లస్ అయితే ఫింగర్‌ప్రింట్ సెన్సర్‌తో కూడిన 120 హెచ్‌జడ్ కర్వ్‌డ్ స్క్రీన్, 200 ఎంపీ మెయిన్ లెన్స్ కెమెరా ఉన్నాయి. దీనికి గల 120డబ్ల్యూ సూపర్ ఫాస్ట్ చార్జర్ సహాయంతో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ కేవలం 20 నిముషాల వ్యవధిలోనే నూరు శాతం చార్జి అవుతుంది. ఐపీ 68 సర్టిఫికేషన్ గల ఈ ఫోన్ డస్ట్, వాటర్ రెసిస్టెంట్‌గా ఉంటుంది.


త్వరలో విమానాశ్రయాల వ్యాపారం లిస్టింగ్

» అదానీ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ జీత్ అదానీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమానాశ్రయాల వ్యాపారాన్ని లిస్టింగ్ చేయాలని అదానీ గ్రూప్ యోచిస్తోంది. స్థిరంగా ఏడాదిపాటు నవీ ముంబై విమానాశ్రయం కార్యకలాపాలు పూర్తి చేసిన తర్వాత విమానాశ్రయాల వ్యాపారాన్ని సమీప భవిష్యత్తులో లిస్టింగ్ చేసే వీలుందని గౌతమ్ అదానీ కుమారుడు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ ప్రెసిడెంట్ జీత్ అదానీ తెలిపారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు 100 శాతం అనుబంధ కంపెనీ అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఏఏహెచ్‌ఎల్) మొత్తం ఏడు విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటిలో ముంబై, మంగళూరు, అహ్మదాబాద్, జయపుర, తిరువనంతపురం ఉన్నాయి. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో ఏఏహెచ్‌ఎల్‌కు 74 శాతం వాటా ఉంది. ప్రస్తుతం అన్ని విమానాశ్రయాలు సామర్థ్య విస్తరణలో ఉన్నాయని, గత ఏడాదిలో ఈ విమానాశ్రయాల నుంచి 8 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించారని జీత్ అదానీ తెలిపారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతుంది.


సన్‌షైన్‌లో కిమ్స్‌కు మరింత వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సర్వేజన హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్) వాటాను కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్) మరింత పెంచుకుంది. అనుబంధ కంపెనీ సర్వేజన హెల్త్‌కేర్‌లో మరో 5.04 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు కిమ్స్ వెల్లడించింది. దీంతో సర్వేజనలో కిమ్స్ వాటా 59.10 శాతం నుంచి 64.14 శాతానికి చేరుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ టర్నోవర్ రూ.279.97 కోట్లు ఉంది. దీన్ని 2009లో ఏపీ గురవారెడ్డి ప్రారంభించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,960 ▲	57,710 ▲	77,500 ▼
ముంబై	62,350 ▼	57,110 ▼	71,450 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ		విజయవాడ	565
హైదరాబాద్	540	విశాఖపట్నం	599
11 జనవరి		వరంగల్	542
చిత్తూరు	573	దజను గుడ్లు రూ.72	
గోదావరి	565		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	గోదావరి	84
వరంగల్	85	విజయవాడ	84
కరీంనగర్	85	గుంటూరు	85
మహబూబ్‌నగర్	85	ఒంగోలు	85
కర్నూలు	85	చిత్తూరు	90
విశాఖపట్నం	79		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 11-1-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume): 21 | సంచిక (Issue): 284

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

చలానాలపై సబ్సిడీ 31 వరకు పొడిగింపు



హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ట్రాఫిక్ పెండింగ్ చలానాల సబ్సిడీ ఆఫర్‌ను ఈ నెల 31 వరకు పొడిగించారు. రాష్ట్రవ్యాప్తంగా వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ కోరారు. సబ్సిడీ ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు 1.29 కోట్ల పెండింగ్ చలానాలు క్లియర్ అయ్యాయని, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.113 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.


టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాల ఆమోదం

- ఈ వ్యవహారంలో జాప్యం లేదన్న గవర్నర్
- కొత్త చైర్మన్ నియామకానికి తొలగిన అడ్డంకి
- ఐఏఎస్ లేదా ఐపీఎస్‌కు టీఎస్‌పీఎస్సీ పగ్గాలు
- సభ్యులుగా వివిధ రంగాల నిపుణులకు చాన్స్



హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్, సభ్యుల రాజీనామాలను రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆమోదించారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనకు మార్గం సులువైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డిసెంబరులో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సభ్యులు సత్యనారాయణ, బండి లింగారెడ్డి, కారం రవీందర్ రెడ్డి తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వీరి రాజీనామాలు ఆమోదం పొందిన తర్వాత టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, కొత్త వారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ రాజీనామాల ఆమోదంలో కొంత జాప్యం చోటుచేసుకుంది. దీనిపై గవర్నర్ కార్యాలయం స్పష్టత ఇచ్చింది. వీరి రాజీనామాలపై ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరామని, ప్రభుత్వం నుంచి అభిప్రాయం వచ్చిన ఒక్క రోజులోనే ఆమోదించినట్లు పేర్కొంది. బిజినెస్ రూల్స్ ప్రకారం చైర్మన్, సభ్యుల రాజీనామాలను క్షుణ్ణంగా పరిశీలించి అడ్వకేట్

మిగతా 11వ పేజీలో...



కుతుబ్‌షాహి టూంబ్స్ వద్ద వివిధ దేశాల ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు, రాజనర్సింహ

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

11

- 13 దేశాల ప్రతినిధులకు సీఎం ఆతిథ్యం
- కుతుబ్ షాహీ టూంబ్స్ వద్ద విందు
- పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలని సూచన

కొత్త విద్యుత్తు విధానం

నిపుణుల సలహాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరించి, రూపొందిస్తాం

- ఇతర రాష్ట్రాల్లోని విద్యుత్తు విధానాలను అధ్యయనం చేసి మెరుగైన పాలసీ తీసుకొస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- కరెంట్ కొనుగోళ్ల ఒప్పందాలన్నీ వెలికితీయండి
- రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చి తీరాల్సిందే
- గృహావసరాలకూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోండి
- తక్కువ ధరకు దొరికే చోటనే విద్యుత్తు కొనండి
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి ఆదేశం

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటిదాకా సరైన విద్యుత్తు పాలసీని రూపొందించకపోవడంతో పలురకాల ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. వీటిని నివారించేందుకు సరికొత్త విద్యుత్తు పాలసీని తీసుకొస్తామని ప్రకటించారు. విద్యుత్తు రంగ నిపుణుల సలహాలు తీసుకోవడంతోపాటు వివిధ రాష్ట్రాల విద్యుత్తు విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాసనసభలో అన్ని రాజకీయ పక్షాలతో చర్చించి కొత్త విద్యుత్తు విధానాన్ని రూపొందిస్తామన్నారు. ఈ మేరకు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్తు విధానాలను అధ్యయనం చేయాలని, మెరుగైన విధానం ఏ రాష్ట్రంలో ఉందో తెలుసుకొని నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి విద్యుత్తు శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ప్రభుత్వపరంగా విద్యుత్తు ఉత్పత్తిని

మిగతా 11వ పేజీలో...

నేవీ రాడార్ నిర్మాణానికి పచ్చజెండా

11

- పూడూరులో ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం
- రిజర్వ్ ఫారెస్ట్‌లో 2,934 ఎకరాలు ఇస్తామన్న సీఎం
- అంతకుముందు రేవంత్‌తో భేటీ అయిన నేవీ ఆఫీసర్లు
- 2,500 కోట్లతో రాడార్‌ను నిర్మించనున్న నౌకాదళం
- త్వరలోనే రాడార్ నిర్మాణ పనులు ప్రారంభం: సీఎంఓ

అక్రమబద్ధీకరణపై విచారణ

- కలెక్టర్ ఆదేశం.. నానక్‌రామ్‌గూడలో అధికారుల భూపరిశీలన
- 'ఆంధ్రజ్యోతి'లో 'భూంఫట్ స్వాహా' కథనంతో సంచలనం
- రాజకీయ, ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన భూదందా
- కన్వేయన్స్ డీడ్‌ల సీజ్.. గోపన్‌పల్లిలో నిర్మాణాల తొలగింపు



హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో.. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న అత్యంత ఖరీదైన ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని అక్రమబద్ధీకరించడంపై ఉన్నతాధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. రూ.750 కోట్ల విలువ చేసే ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం 15 మందికి జీవో 59 కింద అక్రమంగా క్రమబద్ధీకరిస్తూ గత ప్రభుత్వం హయాంలో జరిగిన దందాపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'భూంఫట్ స్వాహా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. రాజకీయ, ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కథనంపై స్పందించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక్.. అధికారులను ఆరా తీశారు. సర్వే నెంబర్ 149కి సంబంధించిన వివరాలన్నీ అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో రాజేంద్రనగర్ ఆర్డీవో ఈ.మల్లయ్య.. సిబ్బందితోసహా వెళ్లి నానక్‌రాంగూడలోని సర్వే నంబర్ 149లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలమంతా పూర్తి ఖాళీగా కనిపిస్తుండడంతో.. ఈ స్థలాన్ని జీవో 59కింద ఏవిధంగా క్రమబద్ధీకరణ చేశారో అంటూ ఆశ్చర్యపోయారు. శేరిలింగంపల్లిలో కన్వేయన్స్ డీడ్‌లను పూర్తిగా సీజ్ చేశామని తెలిపారు. గోపన్‌పల్లిలో జర్నలిస్టు కాలనీని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 74లో కూడా కన్వేయన్స్ డీడ్‌లను సీజ్ చేశామని, ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన బ్లూ షీట్‌లను కూడా తొలగిస్తున్నామని తెలిపారు. కాగా.. బుధవారం గండిపేట తహసీల్దార్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు పిలిపించినట్లు తెలిసింది. అలాగే.. శేరిలింగంపల్లి తహసీల్దార్‌పై ఇప్పటికే వేటు వేసి కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. హైదరాబాద్ మహా నగరాన్ని ఆనుకొని ఉన్న రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి, గండిపేట,

మిగతా 12వ పేజీలో...



త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీ

- పారిశ్రామిక రంగానికి నూతనోత్తేజం తెస్తాం
- ప్రజలు కోరుకున్న మార్పు చూపిస్తాం
- సీఐఐ, ఫిక్కీ, ఎఫ్టీసీసీఐ ప్రతినిధులతో పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందని ధ్వజం

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు, పారిశ్రామిక రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీని తీసుకొస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. దీనికోసం అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని ప్రకటించారు. ఈ పాలసీ మరింత మెరుగ్గా, పరిశ్రమకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఎఫ్టీసీసీఐ, ఫిక్కీ, సీఐఐ, ఎఫ్టీఏపీసీ, డిక్కీ సంస్థల ప్రతినిధులతో మంత్రి బుధవారం సచివాలయంలో మాట్లాడారు. 'ప్రజలు మార్పు కోరుకున్నారు. బీఆర్ఎస్ పాలనను వ్యతిరేకించి

మిగతా 11వ పేజీలో...

దేశంలో ఎవరూ కేసీఆర్‌లా కష్టపడలే

- రాష్ట్రాభివృద్ధి కోసం రక్తాన్ని రంగరించారు
- 99% సమయాన్ని పాలనకే కేటాయించారు
- అందుకే పార్టీపై అంతగా దృష్టి పెట్టలేదు
- జనం బీఆర్ఎస్ వెంటే ఉన్నారనుకున్నాం
- కాంగ్రెస్‌కు అసలు సినిమా ముందుంది
- ఆ పార్టీవి 420 హామీలని ప్రజలకు చెప్పాలి
- బీఆర్ఎస్ శ్రేణులతో మాజీ మంత్రి కేటీఆర్



వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో నిర్వహించిన భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి కేసీఆర్ కష్టపడినంతగా దేశంలో ఎవరూ కష్టపడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ తన రక్తాన్ని రంగరించి, చెమటను ధార పోశారని చెప్పారు. రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 99% సమయాన్ని పాలనకే కేటాయించారని తెలిపారు. అధికారంలో ఉన్నపుడు పాలనపై పూర్తిగా

మిగతా 12వ పేజీలో...

'అవినీతి'పై చర్యలకు సిద్ధం!

- ఏసీబీ, విజిలెన్స్ విభాగాల బలోపేతం
- సివిల్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి బాధ్యతలు
- గతంలో సమర్థత ఆధారంగా పోస్టింగ్‌లు నిర్ణయించిన ప్రభుత్వ వర్గాలు
- గొర్రెల పంపిణీ గోల్‌మాల్‌పై మొదలైన దర్యాప్తు
- మేడిగడ్డ అక్రమాలపైనా రంగంలోకి బృందాలు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో భారీగా అవినీతి జరిగిందంటూ ముందు నుంచి ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు అధికారంలోకి రాగానే, చర్యలకు సిద్ధమైంది. ఈ క్రతువులో అత్యంత కీలకమైన అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను బలోపేతం చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఈ రెండు విభాగాలు సిబ్బంది లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. విజిలెన్స్ విభాగం ఇంతకాలం ఇన్‌చార్జుల పాలనలోనే కొనసాగింది. ఏసీబీ చీఫ్‌గా ఉన్న అధికారే విజిలెన్స్ ఇన్‌చార్జిగా వ్యవహరించేవారు. రేవంత్ సర్కారు మాత్రం వచ్చీరాగానే విజిలెన్స్ విభాగానికి పూర్తిస్థాయి అధికారిని నియమించింది. ఇప్పుడు ఏసీబీ, విజిలెన్స్ విభాగాల్లో సిబ్బంది కొరతపై దృష్టి సారించింది. ముఖ్యంగా డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు సరిపడా లేరు. ఇంటెలిజెన్స్‌తో పని చేసే కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ స్థాయి అధికారులు, కోర్టుల్లో కేసులు వీగిపోని విధంగా బలమైన చార్జిషీట్లు, నిందితులకు

మిగతా 10వ పేజీలో...



కాళేశ్వరం ఈఎన్‌సీ క్యాంప్ ఆఫీసులో సీజ్ చేసిన ఫైళ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్న సిబ్బంది

కాళేశ్వరంపై కొనసాగుతున్న దర్యాప్తు

- రెండో రోజూ ముమ్మరంగా తనిఖీలు
- ఫైళ్లు, హార్డ్‌డిస్కుల పరిశీలన
- మళ్లీ మేడిగడ్డ బ్యారేజీ సందర్శన
- కుంగుబాటుపై ఎఫ్ఐఆర్ ప్రతి సేకరణ
- అవినీతిపై సమాచారం ఉంటే అధికారులకు అందించాలి
- ప్రజలకు మంత్రి పొన్నం పిలుపు
- కేసీఆర్ బినామీ కిషన్‌రెడ్డి అని వ్యాఖ్య

10



ఏక్‌నాథ్ షిండేదే అసలైన శివసేన

- అసమ్మతిపై ఫిరాయింపుల చట్టం వర్తించదు
- ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం లేదు
- శివసేన నియమావళి ప్రకారం పార్టీ నుంచి షిండేను ఉద్ధవ్ తొలగించలేరు
- మెజారిటీ ఎమ్మెల్యేలు షిండేతోనే
- నిర్ణయాన్ని వెలువరించిన మహారాష్ట్ర స్పీకర్
- స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కేసు వేస్తాం: ఉద్ధవ్

10

ఆలయ ప్రారంభానికి మేం.. రాం!

- ఆహ్వానాన్ని తిరస్కరించిన సోనియా, ఖర్గే, అధీర్
- అది ఆరెస్సెస్-బీజేపీ కార్యక్రమమని వ్యాఖ్య
- రామ మందిరాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయని కాంగ్రెస్ నేతల విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవానికి తాము రాలేమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ఆ పార్టీ నేత అధీర్ రంజన్ స్పష్టం చేశారు. రామ మందిర ప్రారంభానికి రావల్సిందిగా సోనియా, ఖర్గే, అధీర్ రంజన్‌లకు గత నెలలో ఆహ్వానాలు అందాయని, అయితే ఈ ఆహ్వానాలను వారు గౌరవపూర్వకంగా తిరస్కరించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. శ్రీరాముడిని దేశంలో లక్షలాది మంది పూజిస్తారని, మతం అనేది వ్యక్తిగత వ్యవహారమని

మిగతా 10వ పేజీలో...



చంద్రబాబుకు భారీ ఊరట!

- ఐఆర్ఆర్, మద్యం, ఇసుక కేసుల్లో ముందస్తు బెయిల్
- మద్యం కేసులో కొల్లు రవీంద్ర, శ్రీనరేశ్‌కు కూడా..
- కేసులపై బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దు
- చంద్రబాబుకు న్యాయస్థానం ఆదేశం
- 48 గంటల ముందు ఆయనకు నోటీసివ్వాలి
- దర్యాప్తు అధికారికి కోర్టు నిర్దేశం

12

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'మిత్ర' విజయాలు

పొరుగుదేశాలతో చారిత్రక, సాంస్కృతిక బంధం ఎంతబలంగా ఉన్నప్పటికీ, అక్కడ అధికారంలోకి వచ్చిన రాజకీయపక్షాల వైఖరి దౌత్య సంబంధాలను ప్రభావితం చేస్తూనే ఉంటుంది. మనతో సరిహద్దులు పంచుకొనే దేశాల్లో అధికారపక్షాలు మారినప్పుడల్లా వియ్యం, కయ్యం సహజం. నేపాల్‌లో కేపీశర్మ ఓలీ అధికారంలో ఉన్నంతకాలం ఏదో రచ్చ తప్పలేదు. కాస్త దూరంలో ఉన్న మాల్దీవుల్లో ఇప్పటికే మనమంటే గిట్టని పాలకుడు అధికారంలోకి వచ్చి గిల్లికజ్జాలు మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో, భూటాన్, బంగ్లాదేశ్‌లలో భారత్ అనుకూల నాయకులు ఇటీవల అధికారంలోకి రావడం మనకు పెద్ద ఊరట.

భూటాన్‌లో మంగళవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పీడీపీ) నాయకుడు షేరింగ్ తోగ్బే మూడింట రెండువంతుల స్థానాలు గెలుచుకున్నారు. 2013–18 మధ్యకాలంలో ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశానికి అనుకూలంగా వ్యవహరించారు. ఇప్పుడు చైనా–భూటాన్ సరిహద్దు ఒప్పందం చివరి అంకంలో ఉండగా, తోగ్బే మళ్ళీ ఆ పదవిలోకి వచ్చారు. ఇరుదేశాల మధ్యా ఉన్న వివాదాస్పద భూభాగాలను ఇచ్చిపుచ్చుకొనేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందంలో భాగంగా, పశ్చిమ భూటాన్‌లోని ప్రాంతాలను చైనాకు ఇస్తే, ఉత్తరంలో ఉన్నవాటిని భూటాన్‌కు చైనా అప్పగిస్తుంది. ఈ పశ్చిమప్రాంతంలోనే డోక్లామ్ ఉన్నందున, అక్కడ చైనా చొరబాట్లమీద భారత్ మండిపడుతున్న తరుణంలో, వివాదం పరిష్కారంలో భాగం కావడానికి చైనాకు కూడా హక్కు ఉన్నదని అప్పటి భూటాన్ ప్రధాని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో కొత్త ప్రధాని భారతదేశంతో సత్సంబంధాలని, ప్రత్యేక ఆర్థిక అనుబంధాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. అభివృద్ధి పేరిట సాగే విధ్వంసం కంటే, సంతోషంగా జీవించడం ప్రధానమని నమ్ముతూ, తన 'హ్యాపీనెస్ ఇండెక్స్'తో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన భూటాన్ ఇప్పుడు పలు కష్టాల్లో ఉంది. గత ఐదేళ్ళుగా ఆర్థికవృద్ధి రెండుశాతం లోపు ఉంటూ, నిరుద్యోగం 29శాతానికి చేరి, యువకులు వలస పోతున్న స్థితిని ఎదుర్కొంటోంది. హార్వర్డ్ యూనివర్సిటీలో ఉన్నతచదువులు చదివిన కొత్త ప్రధానిమీద ప్రజలు ఇప్పుడు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు.

బంగ్లాదేశ్ ఎన్నికల ఫలితాలు ఊహించినట్టుగానే ఉన్నాయి. బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజిబూర్ రహ్మాన్ కుమార్తె హసీనా వరుసగా నాలుగోసారి ప్రధాని అయ్యారు. ఎన్నికల బరిలో విపక్షం అంటూ లేకపోవడంతో 299 స్థానాల్లో 223 ఆమె పార్టీయే స్వాధీనం చేసుకుంది. ఆ తరువాత అత్యధిక స్థానాలు గెలుచుకుంది ఇండిపెండెంట్లే. వీరిని, పార్టీ తరఫున టికెట్లు ఇవ్వకుండా, తన అభ్యర్థులమీద గెలిచేట్టుగా అవామీ లీగ్ చూసుకుందని ఓ వాదన. ఎన్నికలు అప్రజాస్వామికంగా జరుగుతున్నాయని అమెరికా సహా దాని మిత్రదేశాలన్నీ గోలపెడుతున్న నేపథ్యంలో, అన్ని స్థానాలూ తానే నెగ్గితే బాగుండదని హసీనా అనుకున్నారేమో! ఆపద్ధర్మ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నికలు జరగాలంటూ మాజీ ప్రధాని బేగం ఖలీదాజియా నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, దాని మిత్రపక్షాలూ పట్టుబడితే, రాజ్యాంగపరంగా అటువంటి నియమం లేదంటూ హసీనా ప్రభుత్వం కాదు పొమ్మంది. ఖలీదా జియా గృహనిర్బంధంలోనూ, ఆమె కుమారుడు విదేశాల్లోనూ ఉంటూ, మిగతా పెద్ద నాయకులంతా జైళ్ళలోనూ ఉన్నందున ఆమె పార్టీ విజయావకాశాలు నిజానికి బాగా తక్కువే. అయితే, ఎన్నికలను ఇలా వరుసగా బాయ్‌కాట్ చేయడం కాక, ఇప్పుడు కనీసం పోటీలో నిలబడినా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తన ఉనికిని కాపాడుకోగలిగేది. మళ్ళీ హసీనాకు ఇలా అధికారం పళ్ళెంలో పెట్టి అప్పగించడంతో పాటు, ఖలీదాజియా పార్టీ తన రాజకీయ భవిష్యత్తును మరింత కోల్పోయింది. బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో ఇప్పుడు ప్రతిపక్షమే లేకుండా పోవడం హసీనా మరింత నిరంకుశంగా వ్యవహరించడానికి ఉపకరిస్తుంది. భారతదేశానికి సంబంధించినంతవరకూ హసీనా పునరాగమనం మంచిదే. ఖలీదా పెంచిపోషించిన ఉల్ఫా తీవ్రవాదం, మత తీవ్రవాదం మనకు తీవ్ర నష్టం చేశాయి. హసీనా వచ్చీరాగానే, బంగ్లాదేశ్‌నుంచి మన ఈశాన్యంలో చిచ్చుబెడుతున్న తిరుగుబాటుదారులను ఏరిపారేయడం, అప్పగించడం పెద్ద ఎత్తున జరిగాయి. తనదేశంలోని మతతత్వ శక్తులను ఉక్కుపాదంతో అణచివేశారు. ఉభయదేశాల ఆర్థిక, వాణిజ్య, రవాణా సంబంధాలు మెరుగుపడ్డాయి. దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న బంగ్లాదేశ్ ఆమె పాలనలో ఎంతో బాగుపడింది. సంపూర్ణాధికారం ఎలాగూ సిద్ధించింది కనుక, కాస్తంత ప్రజాస్వామికంగా నడుచుకుంటే అగ్రరాజ్యాల ఆగ్రహాన్ని కాస్తంత ఉపశమింపచేయవచ్చు.

విద్యార్థుల స్థాయికి తగ్గ పుస్తకాలు ఉండాలి

భాష, సాహిత్యం, సంస్కృతి ఈ మూడు అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. కవి తన భావాన్ని వ్యక్తం చేయడానికి భాష అవసరం. అలాగే అతని చుట్టూ ఉండే సమాజం కూడా సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. సమాజ ఆచరణనే సంస్కృతి. కాబట్టి సాహిత్యంలో సంస్కృతి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ప్రథమ భాష తెలుగు పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులు అందిపుచ్చుకుంటున్న భాషా సాహిత్యాంశాలను పరిశీలించాలి.

విద్యావిధానంలో పాఠ్యపుస్తకం ఒక ఆయుధం లాంటిది. దీనిని సమర్థవంతంగా రూపొందించి ఉపయోగించినప్పుడే దేశ భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది. ఎందుకంటే తరగతి గదిలో దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది కనుక. పాఠ్యపుస్తకాల ప్రణాళికా సూత్రాలు విద్యార్థులకు అందాలంటే పాఠ్యపుస్తకం రచన చాలా జాగరూకతతో సాగాలి. ముఖ్యంగా పాఠ్యపుస్తకాలను విద్యార్థి స్థాయినిబట్టి రచించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ పాఠ్యపుస్తకాలు అమలులో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన పాఠ్యపుస్తకాలే కాకుండా ఆర్క్ బర్డ్, శ్రీరామ మొదలైన పబ్లిషర్స్ తెలుగు వాచకాలను చాలా ప్రైవేటు పాఠశాలలు అనుసరిస్తున్నాయి. రాష్ట్రప్రభుత్వ విద్యావిధానంలో నియత (ఫార్మల్) అనియత (నాన్–ఫార్మల్) అని రెండు పద్ధతులున్నాయి. సార్వత్రిక పాఠశాలలు (ఓపెన్ స్కూల్స్) మరో కోవకు చెందుతాయి.

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఆయా పాఠ్యపుస్తకాల రచయితలు రాసిన పాఠాలు ఎక్కువగా ఉన్నాయి. ఆరు, ఏడు తరగతులలో కొన్ని ఆయా రచయితలు రాసినవి, మరికొన్ని ఇతర రచయితల రచనల నుంచి తీసుకున్నవి ఉన్నాయి. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు ఇతర రచయితల రచనల నుంచి తీసుకుని వాటికి అభ్యాసాలు మాత్రం పాఠ్యపుస్తక రచయితలు



రాశారు. ఇవి విద్యార్థుల స్థాయినిబట్టి ఉన్నాయా? అన్నది వివాదాంశం.

తెలుగు భాష చాలా ప్రాచీనమైంది, విస్తృతమైంది. అక్షరాల సంఖ్య కూడా ఎక్కువే. నన్నయకు పూర్వం శాసనాలకే పరిమితమైన తెలుగుభాషను నన్నయ తన కాలానికి కావ్యరచనకు అనుగుణంగా ఉద్ధరించాడు. కాలానుగుణంగా భాష మారితేనే సజీవంగా ఉంటుంది. అంటే భాషకు సంకుచిత స్వభావం ఉండకూడదు. భాష తనను తాను విస్తృత పరచుకోవడానికి ఎన్నో ఇతర భాషా పదాలను తనలో చేర్చుకుంటుంది. రాజ్యం ప్రభావం కూడా భాష మీద ఉంటుంది. తొలినాళ్ళలో సంస్కృతం, బ్రిటీషర్స్ కాలంలో ఇంగ్లీషు, నిజాం రాజుల ప్రభావంతో ఉర్దూ పదాలు విడదీయరానంతగా తెలుగు భాషలో ఇమిడిపోయాయి. నన్నయ కాలం నుంచి ఆధునిక కాలం వరకు విస్తృతమైన సాహిత్యం తెలుగు భాషకు ఉన్నది. భాషాధ్యయనంలో భాగంగా సాహిత్యం కూడా విద్యార్థులకు పరిచయం అవుతుంది. సమాజంలోని వ్యక్తుల అవసరాల మేరకు వారి ఆచార వ్యవహారాలలో మార్పు అనివార్యం. ప్రాచీన కాలానికి, ఆధునిక కాలానికి సమాజంలో సంస్కృతిలో చాలా మార్పులు వచ్చాయి. భాషాశాస్త్రవేత్తల సూచనల మేరకు తెలుగు వర్ణమాలలోని కొన్ని అక్షరాలను తొలగించారు. వీటిని విద్యార్థులకు కేవలం పరిచయం చేస్తే చాలు. దీనివలన విద్యార్థుల మీద ఒత్తిడి తగ్గుతుంది. ప్రాచీన భాషాధ్యయనంలో మాత్రమే ఆ అక్షరాల అవసరం ఉంటుంది. వ్యవహారంలో వాటి అవసరం అంతగా ఉండదు.

ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు పద్యభాగం, గద్యభాగం విడివిడిగా ఉండేవి. ప్రస్తుతం ఉన్న పాఠ్యపుస్తకాలలో పద్య, గద్య భాగాలు రెండూ కలిసే ఉన్నాయి. పద్యభాగంలో ప్రాచీన, ఆధునిక కవిత్వానికి సంబంధించిన పాఠ్యాంశాలున్నాయి. నన్నయ, తిక్కన, పాల్కురికి సోమన, శ్రీనాథుడు, పోతన మొదలైన ప్రాచీన కవులను పరిచయం చేశారు. ఆధునిక కవులలో దాశరథి, డా. సి.నారాయణ రెడ్డి, అలిశెట్టి ప్రభాకర్ మొదలైన కవుల పాఠ్యాంశాలున్నాయి. పద్యం, వ్యాసం, కథానిక, శతకం, గేయం, గజల్, జీవితచరిత్ర మొదలైన సాహిత్య ప్రక్రియలను పరిచయం చేశారు. ప్రాచీన సాహిత్యంలో అతి ముఖ్యమైన ప్రబంధ ప్రక్రియను, ఆధునిక సాహిత్యంలోని పేరడీ, గల్పికలను మర్చిపోయారు.

ప్రస్తుతమున్న పాఠ్యపుస్తకాలలోని అభ్యాసాలు విద్యార్థి స్థాయికి మించి ఉండడం గమనార్హం. ఇంతకు మునుపు ఎనిమిదో తరగతిలో ఉన్న ఛందస్సు, సంస్కృత సంధులను ప్రస్తుతం ఆరవ తరగతిలోనే పరిచయం చేశారు. అన్నప్రాశన నాడే ఆవకాయ అన్నం తినిపించినట్టుంది ఇది. పాఠ్యపుస్తకాల రచయితలకు తరగతి గది అనుభవం కంటే ఎస్‌సిఇఆర్‌టి ఆఫీసు అనుభవమే ఎక్కువగా ఉండడం దీనికి కారణం కావచ్చు. విద్యార్థులతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారు ఎవరైనా ఆరవ తరగతి విద్యార్థి మీద తమ పాండిత్యప్రకర్షను రుద్దాలని అనుకోరు. ఇకపోతే అన్ని తరగతుల పాఠ్యాంశాలకు సంబంధించి ఇచ్చిన దాదాపు అన్ని ప్రాజెక్టులు వారి వారి స్థాయిని మించి ఉన్నాయి. ఇది కూడా విద్యార్థులతో వారికి ప్రత్యక్ష సంబంధం లేదనడానికి సాక్ష్యం. తరగతిగది బోధన, విద్యార్థులతో నిరంతరం ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్న ఉపాధ్యాయులు పాఠ్యపుస్తక రచయితలుగా ఉంటే ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయి.

వందేళ్ల కార్చిచ్చు చల్లారేదెలా?

గత రెండు దశాబ్దాలుగా పెద్ద హింసాత్మక ఘటనలేవీ జరగకపోవటంతో పాలస్తీనీయుల నుంచి ఎదురయ్యే హింసను అరికట్టడంలో సఫలమయ్యామని ఇజ్రాయెల్ భావించింది. ముప్పేదీ లేనప్పుడు పాలస్తీనా సమస్య పరిష్కారానికి శాంతి చర్చలు, ఒప్పందాలు ఇక అవసరం లేదని ఆ దేశం వారు భావిస్తూ వచ్చారు. గత అక్టోబరు 7న జరిగిన దాడి ఆ భ్రమలకు తెర దించింది. అప్పటి నుంచి కొనసాగుతున్న హింసలో ఇరువైపుల సాధారణ పౌరులు ఎందరో మరణించారు. తాత్కాలిక యుద్ధ విరమణలతో తీవ్రత కొంత తగ్గింది గానీ ఘర్షణలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో, ముఖ్యంగా పౌరులపై హింస పునరావృతం కాకుండా ఉండడానికి, పాలస్తీనా సమస్య పరిష్కారం దిశగా దృఢమైన చర్యలు అవసరం. ఇది ఇజ్రాయెల్ గ్రహిస్తే తప్ప ఈ ఘర్షణలకు అంతం ఉండదు.



ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య చర్చలు కష్టం, కానీ అత్యవసరం. శాంతి కోసం 1993 ఓస్లో ప్రక్రియలో స్థూలంగా అంగీకరించిన అంశాలు కీలకమైనవి. వీటికి ఇజ్రాయెల్ ఒప్పుకోవటమేగాక, ఆ దేశం వెంట ఉండి దాన్ని అన్ని రకాలుగా సమర్థిస్తున్న అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల వైఖరులలో మార్పు లేనిదే పరిష్కారం సాధ్యం కాదు.

పాలస్తీనియన్లకు, ఇజ్రాయెలీలుగా మారిన యూదు వలసదారులకు మధ్య హింసా చక్రం ఒక శతాబ్దం నాటిది. బ్రిటీషువారు 1920లో నానాజాతి సమితి ఆదేశంగా పాలస్తీనాపై నియంత్రణ సాధించిన తరువాత, ఈ భూభాగాన్ని యూదుల జాతీయ నివాసంగా ప్రచారం చేస్తూ, యూదు వలసలను అపరిమితంగా ప్రోత్సహించారు. దీనితో ఇరు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణలు మొదలయ్యాయి. పాలస్తీనాలో యూదుల స్థిరనివాసాన్ని నిరసిస్తూ అక్కడి అరబ్బుల అల్లర్లు మొదట 1920లలో చెలరేగాయి. అవి 1930లలో పూర్తి స్థాయి ఘర్షణలుగా మారాయి. మొదట యూదు ఉగ్రవాద సంస్థలు పాలస్తీనీయులకు వ్యతిరేకంగా పలు దాడులు చేసినాయి. 1948లో ఇజ్రాయెల్ రాజ్యం ఏర్పడిన తరువాత రాజ్యపరంగానే ఈ దాడులు కొనసాగాయి. ఇజ్రాయెల్ రాజ్య స్థాపనకు వ్యతిరేకంగా పాలస్తీనీయులు కూడా పలు ఉగ్రవాద దాడులు నిర్వహించారు. కొన్ని దశాబ్దాలపాటు జియోనిస్ట్ వ్యతిరేక పాలస్తీనా ఉద్యమాలు ప్రధానంగా లౌకిక సమూహాలచే నిర్వహించబడ్డాయి.

1948–1949 సంవత్సరాల మధ్య జరిగిన అరబ్–ఇజ్రాయెల్ యుద్ధం నుండి ఉద్భవించిన పాలస్తీనా భూభాగాలైన వెస్ట్ బ్యాంక్, గాజా పట్టీలపై 1967లో ఇజ్రాయెల్ ఆక్రమణ; పాలస్తీనా రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపైనా ప్రజల జీవితాలపైనా ఇజ్రాయెల్ ఆధిపత్యం; తూర్పు జెరూసలెంతో సహా వెస్ట్ బ్యాంక్‌లలో వరుసగా 67లక్షలు, 22 లక్షల యూదు జనాభా కలిగి ఉండే స్థావరాలను ఇజ్రాయెల్ నిర్మించింది. 1987లో మొదలైన మొదటి 'ఇంతిఫాద (తిరుగుబాటు) సందర్భంలో హమాస్ ఆవిర్భావంతో పాలస్తీనా ఉద్యమం ఇస్లామిక్ తీవ్రవాద స్వభావాన్ని సంతరించుకున్నది. యాసర్ అరాఫత్ నాయకత్వంలోని ప్రధాన ఉద్యమ సంస్థ, పాలస్తీనా విమోచన సంస్థ (పిఎల్‌ఓ)ను నీరుగార్చడానికి, హమాస్‌ను ఇజ్రాయెల్ గూఢచార సంస్థ 'మొస్సాద్' మొదట్లో ప్రోత్సహించిందని వార్తలు వచ్చాయి. 2000 సంవత్సరంలో మొదలైన రెండవ ఇంతిఫాద లేదా అల్–అక్సా ఇంతిఫాదలో మరొక హింసాత్మక ధోరణులు కలిగిన పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ (పిజెఐ) ఆవిర్భవించింది. ఈ రెండూ సంస్థలు ఇజ్రాయెల్ పౌరులపై పలు ఉగ్రవాద దాడులు నిర్వహిస్తూ వచ్చాయి. 2007లో గాజాలో హమాస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గాజా నుంచి రాకపోకలను కట్టడి చేస్తూ ఈజిప్టు సహకారంతో ఇజ్రాయెల్ భూ, వాయు, సముద్ర దిగ్బంధాన్ని కొనసాగిస్తూ వస్తున్నది. దీనికి తోడు, గాజాలోని పలు పాలస్తీనా సంస్థల మధ్య అంతర్గత పోరు తోడవడంతో, గాజాలో సాధారణ జన జీవన పరిస్థితులు క్షీణిస్తూ వచ్చాయి.

హమాస్ నాయకులకు, పిజెఐ నాయకులను, ఇతర మిలిటెంట్లను వెంబడించడం, వారి ఆయుధాగారాలను ధ్వంసం చేసే నెపంతో పాఠశాలలు, ఆసుపత్రులు, మసీదులు, చర్చిలపై తరచూ దాడులు నిర్వహించడం ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలకు, సైన్యానికి పరిపాటిగా మారింది. పేదరికంలో బతుకుతున్న గాజా వాసులు ఈ దాడులలో పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. అదేవిధంగా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో పెరిగిన ఇజ్రాయెలీ సెటిలర్ల హింస, పాలస్తీనా భూభాగాలను స్వాధీనపరుచుకోవడం లాంటి చర్యల వల్ల అక్కడి ప్రజలలో నిరాశ నిస్పృహలు పెరిగినాయి. వెస్ట్ బ్యాంక్, గాజాలలో మానవ హక్కుల పరిస్థితిపై మార్చ్ 2022లో విడుదలైన ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయెల్ వర్ణ వివక్ష పాలన పాతుకుపోయి ఉన్నది. ఎందుకంటే ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాలలో నివసిస్తున్న ఇజ్రాయెలీలు, పాలస్తీనియన్లకు వేర్వేరు చట్టాలు అమలులో ఉన్నాయి. యూదు సెటిలర్లకు సమగ్ర హక్కులు అందిస్తూ, పాలస్తీనీయులకు మాత్రం కనీస రక్షణలు, హక్కుల ప్రస్తావన లేకుండా నియంత్రణలు విధిస్తూ ఇజ్రాయెల్ సైనిక పాలన కొనసాగిస్తున్నది. పాలస్తీనీయులను విచారణ లేకుండా నిర్బంధించడం, హింసించడం, సామూహికంగా శిక్షించడం, చట్ట వ్యతిరేక హత్యలకు పాల్పడటం చేస్తున్నది. ఇజ్రాయెల్ నిరంతర ఆక్రమణలవల్లే ఈ ప్రాంతాలలో అస్థిరత్వం, దీర్ఘకాలిక ఘర్షణలు కొనసాగుతున్నాయని ఈ నివేదిక అభిప్రాయపడ్డది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం 1967 నుంచి వెస్ట్ బ్యాంక్ ఆక్రమిత భూభాగాల జనాభాను శాశ్వతంగా మార్చే లక్ష్యంతో ఉన్నది. లక్షలాది మంది యూదు సెటిలర్లతో పాటు 50ఏళ్ళకు పైగా ఆక్రమణలో సుమారు 25 వేల ఎకరాల భూమిని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది, ఉగ్రవాదుల కుటుంబాలను శిక్షించడానికి 50 వేలకు పైగా పాలస్తీనీయుల గృహాలను కూల్చి వేసింది. పాలస్తీనీయులలో నిరుద్యోగ రేటు 40శాతానికి పైగా ఉన్నది, 65శాతానికి పైగా దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు, 63శాతం ఆహార అభద్రతకు లోనై ఉన్నారని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. హమాస్ గత అక్టోబర్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ చేపట్టిన విస్తారమైన విధ్వంసానికి, ఇప్పటికే పలు అవస్థలతో సతమతమౌతున్న గాజా వాసుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారయింది. పందల సంఖ్యలో మరణించారు, దాదాపు 20 లక్షల జనాభా గాజాలో నిర్వాసితులయ్యారు. ఇవన్నీ కూడా హమాస్‌ను అరికట్ట లేదు సరికదా, పేదరికం, బలహీనత, నిస్సహాయత, కోపం వల్ల హమాస్ రిక్రూట్మెంట్లకు మరింత అనుకూల పరిస్థితులను సృష్టించాయి. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ఇజ్రాయెల్‌కు అత్యధిక ప్రాణ, ఆస్తుల నష్టం లేనప్పటికీ, ఆర్థిక వ్యవస్థలోని పలురంగాలపై విపరీత ప్రభావం చూపుతున్నదని, గత అక్టోబరు నుంచి డిసెంబర్ మధ్య కాలంలో సుమారుగా రోజుకు 2,600 లక్షల డాలర్ల వ్యయం జరిగిందని ఇజ్రాయెల్ ఆర్థిక విశ్లేషకుల అంచనా వేశారు. యుద్ధం ఇంకా కొనసాగితే ఆర్థిక వ్యవస్థ మరింత సమస్యాత్మకం అవుతుందని వారి సూచన.

పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనకుండానే, ఆ ప్రాంతంలోని అరబ్ దేశాలతో శాంతి సాధ్యమని, ఇది సరిపోతుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సహా పలువురు వాదిస్తున్నారు. ఒకవైపు ఇజ్రాయెల్, మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రైన్, మొరాకో, సూడాన్ మధ్య 2020–21లో కుదిరిన నాలుగు అబ్రహం ఒప్పందాలు ఈ ఆలోచనకు పునాది. కానీ గత మూడు నెలల్లో జరిగిన సంఘటనల పర్యవసానంగా, అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేసిన దేశాలతో సహా, గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలు, ఖతార్, ఒమన్‌లు కాల్పుల విరమణకు పిలుపునిచ్చాయి. లెబనాన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఈజిప్ట్, ట్యూనీషియా తదితర దేశాలలో వేలాది మంది నిరసన కారులు ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలని, సమస్యకు తుది పరిష్కార దిశగా చర్చలు జరపాలని అరబ్ ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగింది. పాలస్తీనా స్వయం నిర్ణయాధికారాన్ని సాధించడానికి చర్చలు లేనంతకాలం, విస్తృత నిరాశకు ఆజ్యం పోసి, హింసను పాలస్తీనియన్లు అంగీకరించడాన్ని బలపరుస్తుంది.

ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య చర్చలు కష్టం, కానీ అత్యవసరం. శాంతి కోసం 1993 ఓస్లో ప్రక్రియలో స్థూలంగా అంగీకరించిన అంశాలు (వీటిని ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు) కీలకమైనవి: పాలస్తీనా భూభాగాలకు శాశ్వత సరిహద్దులు నిర్ణయించడం; వెస్ట్ బ్యాంక్‌లోని కొన్ని ఇజ్రాయెల్ స్థావరాలకు వసతి కల్పించడం, వాటి పరిహారంగా భూ మార్పిడి; పాలస్తీనా శరణార్థులకు పునరావాసం; పాలస్తీనాకు రాజధాని స్థానం; ముస్లింల, క్రైస్తవుల పవిత్ర స్థలాల స్థితితో సహా జెరూసలెం స్థితిపై అంతర్జాతీయ ఒప్పందం, అజమాయిషీ; ప్రాంతీయ దేశాల మధ్య భద్రతా సహకారం; పాలస్తీనా ఆర్థిక కార్యకలాపాలు, గగన తలం, రెండు పాలస్తీనా భూభాగాల మధ్య, వాటి నుండి బయటి ప్రపంచానికి ప్రజల, వస్తువుల స్వేచ్ఛాయుత కదలికలకు వెసులుబాటుతో సహా ఇతర వివరాలతో కూడిన సుస్థిర మార్గాలు అన్వేషించనంతకాలం ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదు. వీటికి ఇజ్రాయెల్ ఒప్పుకోవటమేగాక, ఆ దేశం వెంట ఉండి దాన్ని అన్ని రకాలుగా సమర్థిస్తున్న అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల వైఖరులలో మార్పు లేనిదే పరిష్కారం సాధ్యం కాదు.

• చెన్న బసవయ్య మఠపతి
విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

అర్ధసత్యాలంటూ అసంబద్ధ ఆరోపణలు!

ఆంధ్రజ్యోతి దినపత్రిక డిసెంబరు 29, 2023లో సి. మేఘనాధ రెడ్డి 'పౌర హక్కుల సంఘం ప్రకటనలో అర్ధసత్యాలు' అంటూ ఒక లేఖను రాశారు (ఆ ప్రకటన డిసెంబరు 23, 2023న 'యాభై ఏళ్ళుగా ప్రజల పక్షాన' పేరిట ప్రచురితమైంది). తన లేఖలో మేఘనాధ రెడ్డి శ్రీశ్రీ గారిని పౌర హక్కుల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అంతవరకు అది సరైనదే. కానీ గుంటూరు, ప్రకాశం జిల్లాలలో మాత్రమే పౌర హక్కుల సంఘం ఏర్పడింది అన్న మాట సరికాదు. రాష్ట్రస్థాయి పౌర హక్కుల సంఘం సభ 1973 డిసెంబర్ 23న ఏర్పాటు చేయక మునుపే తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో తూర్పుగోదావరి జిల్లా పౌర హక్కుల సభ జరిగింది. ఆనాడు ప్రభుత్వం పెట్టిన కుట్ర కేసులో ముద్దాయిగా ఉన్న నేను రాజమండ్రిలో బెయిల్‌పై ఉన్నాను. ఆనాటి సీపీఐ (ఎం.ఎల్) పార్టీ డైరెక్షన్‌లో నేను పౌర హక్కుల సంఘం నిర్మాణ ఏర్పాటులో భాగస్వామిని అయ్యాను. ఆనాడు ఆ సభ తదనంతరం గొప్ప బహిరంగ సభ జరిగింది. ఆ బహిరంగ సభకు, మహాకవి శ్రీశ్రీ కూడా హాజరైనారు. ప్రముఖ న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు కూడా హాజరైనారు. ఆ సభకు ముందు నాగిరెడ్డి రాజకీయాలకు ప్రతినిధిగా ఉన్న సింహాద్రి సుబ్బారెడ్డి నన్ను కలిశారు. ఆరోజు రాజమండ్రిలో వైద్యవృత్తిలో ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్ కాటా నారాయణరావు కూడా ఆ సభ ఏర్పాటులో పాల్గొన్నారు.

అంతేకాకుండా జిల్లా మహాసభల తదనంతరం గుంటూరులో రాష్ట్ర స్థాయి మహాసభ ఏర్పాటు జరిగింది. ఆహ్వాన సంఘ అధ్యక్షుడుగా ప్రముఖ న్యాయవాది స్వాతంత్ర సమరయోధుడు ఎస్.వి.ఎల్. నరసింహారావు, కార్యదర్శిగా నేను ఆ సభ నిర్వహణలో ప్రధాన భాగస్వామిగా ఉన్నాము. డిసెంబర్ 23న జరిగిన సభలో ప్రముఖ మార్క్సిస్ట్ లెనినిస్ట్ నాయకులు, స్వాతంత్ర సమరయోధుడు పార్లమెంటు మాజీ సభ్యుడు కొల్లా వెంకయ్య, మరో పార్లమెంటు మాజీ సభ్యుడు స్వాతంత్ర సమరయోధుడు మాదాల నారాయణ స్వామి, ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి మొదలగు ప్రముఖులు పాల్గొన్నారు. తరిమెల నాగిరెడ్డి ప్రతిపాదనను కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి తిరస్కరించారన్న ఆరోపణ సరైనది కాదు. ఆనాడు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్.ఎల్ పార్టీల మధ్య రెండు రాజకీయ భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఆ అభిప్రాయ భేదాలు పౌర హక్కుల సంఘంలో కూడా పొరచూపాయి. ప్రముఖ న్యాయవాది, పౌర హక్కుల సంఘ ప్రజాతంత్ర వాది పత్తిపాటి వెంకటేశ్వర్లని తరిమెల నాగిరెడ్డి తిరస్కరిస్తూ, ప్రత్యామ్నాయంగా తరిమెల రామదాసు రెడ్డి పేరుని ప్రతిపాదించారని కూడా అనవచ్చు కదా!

ఆ మహాసభలో అనేక రచ్చలు చర్చలు జరిగాయి. నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పౌర హక్కుల సంఘానికి శ్రీశ్రీని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తరువాత కార్యదర్శిగా ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు, తరిమెల రామదాసు రెడ్డి పేర్లు ప్రతిపాదించబడ్డాయి. కార్యదర్శిగా ఎవరు ఉండాలనే విషయం తేలకుండానే సాయంత్రం దాకా చర్చలు జరిగాయి. ఎవరి వాదన వారు చేసుకుంటూ పోయారు. బహిరంగ సభ టైము దగ్గరకొస్తుంది. ఆ విధంగా సభ వాయిదా పడింది. ఆ తరువాత గాంధీ పార్కులో బహిరంగ సభ జరిగింది. సభ అనంతరం సీపీఐ (ఎం.ఎల్) రాజకీయాలను సమర్థించే వారంతా ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఏపీసీఎల్సీగా ఏర్పడ్డారు. దానికి మహాకవి శ్రీశ్రీ అధ్యక్షుడిగా ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు కార్యదర్శిగా కమిటీ ఎన్నుకోబడింది. ఆ తరువాత కొంత కాలానికి తరిమెల నాగిరెడ్డి వర్గం ప్రత్యేకంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) ఏర్పాటు చేసుకున్నది. ఆ తదనంతరం రాష్ట్రస్థాయి పౌర హక్కుల సంఘం ఏర్పాటులోనే కాకుండా దీర్ఘకాలం పౌర హక్కుల సంఘంలో పని చేసిన కార్యకర్తను నేను. ఆనాటి సభలో పాల్గొన్నవారు చాలామంది నేటికీ బతికి ఉన్నారు. అటువంటి వారిలో గుర్రం విజయ్ కుమార్, సింహాద్రి సుబ్బారెడ్డి, సిపిసఆర్ ప్రసాదు, నల్లూరు రుక్మిణి, పీవీ రమణారెడ్డి, డాక్టర్ గంటా వెంకటరావు, డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, డాక్టర్ శివరామిరెడ్డి లాంటివారు చాలామంది నేటికీ సజీవంగానే ఉన్నారు.

– కొల్లిపర వెంకటేశ్వరరావు

పిల్లి శాపాలకు ఉట్టి తెగిపడదు..!

పుట్టి ముంచేవారిని ఏమంటారు? మన రాష్ట్రంలో మాత్రం వారిని బీఆర్ఎస్ నాయకులంటారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు నిండకుండానే దానిపై నిందలేస్తున్నారు. అన్నప్రాశన నాడే ఆవకాయ తినమన్నట్టు బీఆర్ఎస్ నాయకులు, వారి అనుయాయుల తీరు ఉంది. ఇంగితం ఉన్నవారెవరూ ప్రభుత్వాన్ని ఇంత తక్కువ వ్యవధిలో ఇలాంటి ప్రశ్నలు వేయరు. తొమ్మిదిన్నరేళ్ల సారు, కారు పాలన రాష్ట్రానికి అంతులేని నష్టాన్ని కలిగించింది. అప్పుల్లో ముంచింది. దొంగలు దోచుకున్న ఇల్లులా ఆర్థిక వ్యవస్థ చిందరవందరయింది. ఎక్కడ ఎంత అప్పో, ఎన్ని ప్రాజెక్టులకు ఎన్ని నెర్రెలిచ్చాయో తెలుసుకుని, ప్రజలకు అర్థం చేయించడానికి కనీసం ఆరు నెలల వ్యవధి అవసరం ఉంటుంది.



అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 7న సీఎం, మంత్రివర్గ ప్రమాణ స్వీకారం అయిన వెనువెంటనే తొలి మంత్రివర్గ సమావేశం అయింది. ఆరు హామీల్లో రెండు అమలుకు పునాది పడింది. సీఎం ఆరు హామీల ఫైలుపైనే తొలి సంతకం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకొచ్చింది. గడీ ముందున్న ఉక్కు కంచె బద్దలైంది. వేలాది మంది ప్రజలు తమ సొమ్ముతో నిర్మితమైన ప్రజాభవన్‌కు వస్తున్నారు. ఇది విస్పష్టంగా కనిపిస్తున్న మార్పు. ఇలాంటి మార్పు, తెలంగాణ వచ్చాక ప్రజలు ఆత్మగౌరవంతో మెలగడం, బీఆర్ఎస్ పార్టీ వారు అసలు సహించలేకపోతున్నారు. ఎటూ తోచక, ఏదో మాట అనాలని కడుపుబ్బరంతో అల్లాడుతున్నారు. అధికారం కోల్పోయారు. అహంకారం అణగిపోవడంతో ఆగం అవుతున్నారు.

ప్రజా ప్రభుత్వం శ్వేతపత్రాలతో ప్రజలను అప్రమత్తం చేయడాన్ని సహించలేకపోతున్నారు. కౌంటర్‌గా స్వేదపత్రాలని అంటున్నారు. కాంగ్రెస్ హామీలను 420 అంటున్నారు. బుక్కులు రిలీజ్ చేస్తున్నారు. ప్రజల పక్షాన పోరాటం అంటూ నటిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన 30 రోజుల్లోనే హామీల అమలు సాధ్యం అవుతుందా? అప్పట్లో 30 రోజుల్లో ఇంగ్లీష్, తమిళం, మలయాళం సులభంగా నేర్చుకోండి అని పుస్తకాలమ్మేవారు. పాలన అంటే రెపిడెక్స్ కోర్స్ కాదు. ఈ విషయాల గురించి అవగాహన సగటు మనుషులెవరికైనా ఉంటుంది.. ఒక్క గత పాలకులు, వారి భజనపరులకు తప్ప.

ఇప్పుడు బోనులో నిలబడాల్సిన అనివార్యత వచ్చింది. జనం దృష్టి మరల్చాలి, అందుకే ఈ గగ్గోలు, గందరగోళాలు. నిజం నిప్పులాంటిది బయటపడక తప్పదు. చేసిన అప్పులు, తప్పులు అన్నీ బయటకు వస్తున్నాయి. గద్దె పోయి, గడి దూరమై, దొరల గుండెలు మండుతున్నాయి. నెల రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజల మేలు కోసం పడుతున్న తపన కళ్లముందు కనిపిస్తున్నది. ఆరు నెలల్లో చేయాల్సిన పనులు, సమీక్షలు కేవలం ఒక్క నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ముఖ్యమంత్రి సచివాలయంలో అందుబాటులో ఉంటున్నారు. ఎవరైనా మంత్రులను, సీఎంను సులభంగా కలవవచ్చు. మంత్రులు స్వతంత్రంగా తమ శాఖల సమీక్షలు చేసుకుంటున్నారు, నిర్భయంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎటు చూసినా ప్రభుత్వం ప్రజలలోనే ఉండేందుకు ప్రజాపాలన నిదర్శనంగా నిలుస్తుంది. ఏ మాటకామాట చెప్పుకోవాలి గత ప్రభుత్వం అంటే కేవలం ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే. ఇప్పుడు ప్రభుత్వం అంటే అందరం, మనం అనే భావన ప్రజల్లో వచ్చింది. ఒక గుణాత్మకమైన మార్పు కనిపిస్తున్నది.

సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులను వెంటపెట్టుకొని కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తున్నారు. పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు 60 శాతం నిధుల హామీని కేంద్రం నుంచి పొందారు. ప్రధాని, ఆర్థిక, రక్షణ, హోంమంత్రిని ఇట్లా అందరినీ కలిశారు. పంతాలకు పోవడం లేదు వారెంతా అనే గత పాలకుల అహంకార ధోరణి అసలే లేదు. అన్నిటి కంటే ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు పడ్డాయి. మన రాష్ట్రానికి సరిపడే నమూనా ఆవిష్కృతం అవుతున్నది. ఇదంతా స్ఫటిక సదృశంగా కానవస్తున్న మార్పు. ఇవేవీ అప్పుడే కాంగ్రెస్ పాలనపై 420 బుక్కు రిలీజ్ చేసిన నాయకులకు కనబడటం లేదు, వినిపించడం లేదు. అందుకే ఈ 420 అంటూ సెల్ఫ్ గోల్ చేసుకుంటున్నారు.

నెహ్రూ ప్రజాస్వామ్య వారసత్వాన్ని మన రాష్ట్రంలో రేవంత్ కొనసాగిస్తున్నారు. నెహ్రూ విపక్ష సభ్యులు సభలో ఉండాలని కోరుకునేవారు, ఆచరించేవారు. ఇక్కడ రేవంత్ కూడా అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు ఉండాలని, చర్చ చేయాలని చెప్పారు, ఆచరించారు. నాటి బీఆర్ఎస్ పాలకులు సభ నుంచి విపక్ష సభ్యులను నిర్దయగా బయటకు పంపారు. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించే వారికి, నియంతృత్వపు ధోరణి గలవారికి పొంతన కుదరదు. ఇప్పుడు మన రాష్ట్రంలో జరుగుతున్నదిదే.

సంకుచిత మనస్తత్వంతో ప్రభుత్వం ఏర్పడుతుండగానే ఆ ప్రభుత్వం కూలిపోతుందని ప్రకటనలు ఇచ్చారు. ఆరు నెలల్లో ప్రభుత్వం కూలుతుందని జోస్యాలు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు ఇలా తమ వక్రబుద్ధిని బయట పెట్టుకుంటున్నారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగిపడవు. ప్రజాస్వామ్యం నియంతలకు తలవంచదు. ఈ విషయం గత పాలకులు, వారి భజనపరులు గుర్తుంచుకోవాలి.

ఏడాది, రెండేళ్ల తర్వాత ప్రభుత్వ పనితీరు బాగా లేకుంటే నిలదీయాలి, హామీలు విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో ప్రశ్నించాలి. అంతేగానీ సంకుచితభావాన్ని వ్యక్తీకరిస్తే జనంలో బీఆర్ఎస్‌కు ఉన్న ఆ కాస్త ఇమేజ్ కూడా పోతుంది జాగ్రత్త. చివరి మాట వాస్తవంలో జీవించండి, వాస్తవాలు మాట్లాడండి, ప్రజలలో కలవండి. ప్రభుత్వ పనితీరుపై సద్విమర్శ చేయండి.

■ బోదనపల్లి వేణుగోపాలరెడ్డి

'ఫార్మా' కాలుష్యం నుంచి కాపాడతారనుకుంటే..!

గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, మా ప్రాంత ప్రజల తరఫున రాస్తున్న బహిరంగ లేఖ. నిన్న మీరు ఇచ్చిన పత్రికా ప్రకటనలో తెలంగాణని మూడు జోనులు: ఓఆర్ఆర్ లోపల అర్బన్, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ మధ్యలో సెమీ అర్బన్, ఆర్ఆర్ఆర్ వెలుపల రూరల్ జోనులుగా విభజించి పారిశ్రామికీకరణ చేపడతామని, అందులో ప్రజాప్రయోజనం దృష్ట్యా కాలుష్యం లేకుండా ఫార్మా విలేజ్‌లు స్థాపిస్తాం అని సెలవిచ్చారు. అట్లాగే మా రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో ఫార్మా సిటీ కోసం ఇప్పటికే తీసుకున్న భూమిలో ఇతర పరిశ్రమలు స్థాపిస్తారని తెలిసింది. అసలు ఫార్మా కంపెనీలే వద్దని ప్రజలు అన్ని ప్రాంతాల్లో మొత్తుకుంటుంటే, మళ్లీ గత ప్రభుత్వం చెప్పిన విషయాలే చెప్పి కాలుష్యం లేకుండా ఫార్మా విలేజీలు స్థాపిస్తామంటున్నారు. ఎంతవరకు సమంజసం? తెలంగాణా ఇప్పటికే కాలుష్య భూతంతో పోరాటం చేస్తోంది. మన జీవ నది మూసీ నదే ఇందుకు ఒక గొప్ప ఉదాహరణ. ఈ నది నాశనం అయ్యింది ప్రధానంగా కెమికల్ కాలుష్యం వల్లనే, దానికి ముఖ్య కారణం ఫార్మా కంపెనీలే. పోనీ పటాన్‌చెరు, జీడిమెట్ల పాతవి అక్కడ కాలుష్యం కంట్రోల్ చెయ్యటానికి వీలైన టెక్నాలజీ లేదు అనుకున్నా, నిన్న మొన్న ఇలాగే కాలుష్య రహితంగా చేస్తాం అని పెట్టించిన పోలేపల్లి సెజ్ పరిస్థితి కూడా ఇంతే. పోలేపల్లి, కాజిపల్లి వంటి చోట్ల, అట్లాగే పటాన్‌చెరు, బొల్లారంలలో కూడా స్థానిక ప్రజలు కంపెనీల కాలుష్యం గురించి లీగల్‌గా కంప్లైంట్ ఇచ్చి, పోరాటం చేసినా, వారిని బెదిరింపులకి గురిచేసి, నోరు మూయిస్తున్నారు. కంపనీలలో పనిచేసే కార్మికులు ఎప్పుడు ఏ కెమికల్ రియాక్షన్‌కి ప్రాణాలు పోగొట్టుకుంటారో చెప్పలేని పరిస్థితి. ఈ కంపెనీలు పెట్టిన చోట్ల చుట్టూ వ్యవసాయం సర్వనాశనం అయింది. తాగేందుకు నీరు లేదు, పీల్చేందుకు గాలి లేదు. ఈ కంపెనీలు ఎక్కడ పెట్టినా చుట్టూ ఉన్న వారికీ అనేక జబ్బులు, కిడ్నీ వ్యాధులు, చర్మ వ్యాధులు, గర్భిణీ స్త్రీలకి గర్భస్రావాలు, పుట్టిన పిల్లలకి అంగవైకల్యాలు. మరి ఇటువంటి కంపెనీలని పెట్టించడం ప్రజాప్రయోజనం ఎట్లా అవుతుంది?

మీకు సలహాలు ఇచ్చే వారు చెప్పొచ్చు, మనకి చౌకగా మందులు కావాలంటే ఖచ్చితంగా ఇక్కడ ఫార్మా కంపెనీలని పెట్టించాలి అని. నిజంగా ఇప్పటివరకు పెట్టిన కంపెనీలలో తయారు చేస్తున్న మందులన్నీ మన ప్రజల కోసమేనా? లేక పాశ్చాత్య దేశాల్లో చవక మందులు సరఫరా చేసేందుకా? మన దగ్గర తయారయ్యే మందులు బయట దేశాలకి ఎగుమతి చేసేందుకే అని తెలుస్తోంది. మనకి సరిపడా కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇంకా ఇంకా ఫార్మా కంపెనీలు పెట్టి మన గాలి, నీరు, ఆహారం కాలుష్యం చేసి, ప్రజలని కేన్సర్ బాధితుల్ని చేస్తే అది ఏ విధంగా ప్రజాప్రయోజనమో తమరు ఆలోచించాలి. ఈ విషయాలపైన దృష్టి పెట్టి మీరు పూర్తి సమీక్ష చేసి, సరైన నిర్ణయం తీసుకొని, ప్రజలను ఈ ఫార్మా కంపెనీల బెడద నుంచి కాపాడతారని ఆశిస్తున్నాం.


– కవుల సరస్వతి, రైతు, సామాజిక కార్యకర్త

ఒక్కసారి ఆలోచించండి!

ఉచిత పథకాలు ఎన్ని ప్రకటించినా, అవి ప్రజలకు మేలు చేయడం అటుంచి, వారి బతుకులు మరింత భారమవుతున్నాయి. ఈ పథకాలు వికలాంగులకు, వృద్ధులకు, పేద రైతులకు ఉపయోగకరంగా ఉంటాయి. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, పెట్రోలు ధరలు, స్కూలు, కాలేజీ ఫీజులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిని అదుపు చేయడానికి ఏ రాజకీయ పార్టీ నాయకులూ ప్రయత్నించడం లేదు. వారు ఎంతసేపూ తమ ఓటు బ్యాంకు పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు గానీ ప్రజల గురించి ఆలోచించడం లేదు. దేశంలో ఎక్కడ చూసినా ఏదో ఒక సమస్య, ఆందోళన, అలజడి ఉంటున్నాయి. వీటి గురించి ఆలోచించని నాయకులు, తమ అధికారం కోసం మాత్రం ఉపన్యాసాలు ఇస్తుంటారు. ప్రజలకు కావలసింది ఉపన్యాసాలు కాదు, తమ సమస్యల పరిష్కారం. మనిషికి అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సాధ్యమైనంతవరకు నిత్యావసరాల ధరలు పెరగకుండా చూడాలి. ఇది అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– కాయల నాగేంద్ర

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



నిధులు రాక.. నిలువలేక!

మూతపడుతున్న ప్రైవేటు కళాశాలలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం
- ఉమ్మడి జిల్లాలో రూ.21.60 కోట్ల బకాయిలు
- మూడేళ్లుగా ఆగిపోయిన చెల్లింపులు
- పేద విద్యార్థులకు దూరమవుతున్న ఉన్నత విద్య
- ప్రభుత్వం స్పందించాలంటున్న యాజమాన్యాలు

హనుమకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రమంగా వారు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దీనికి సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థుల బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రూ.21.60 కోట్ల మేరకు బకాయిలు పేరుక పోయాయి. వీటిని కొత్త ప్రభుత్వమైనా చెల్లిస్తుందా అన్న ఆశతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

రూ. 21.60 కోట్ల బకాయిలు

హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, ఇతరత్రా బీసీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి మొత్తం సుమారు రూ. 21.60 కోట్ల వరకు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో రూ. 3 కోట్లు, వరంగల్ జిల్లాలో 4.40 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో 4.60 కోట్లు, జనగామ జిల్లాలో 3.60 కోట్లు, ములుగు జిల్లాలో 2.40 కోట్లు, జయశంకర్ జిల్లాలో 3.60 కోట్లు ఉన్నాయి. ఇవేకాకుండా నెలవారి ట్యూషన్ ఫీజులు, పాఠశాలలకు సంబంధించి రూ 6.42 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయి. కాగా, కళాశాలలకు రూ.9.35 కోట్ల బకాయిలు ఉన్నాయి. గత ఏడాది బకాయిలు ఉండడంతో కొత్తగా 2023-24 సంవత్సరానికి సంబంధించిన బకాయిల పరిస్థితి ఏమిటన్న సందిగ్ధంలో విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది 2021-22 సంవత్సరం నాటి బకాయిలను గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టులో విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. వాటికి సంబంధించిన బిల్లులను ట్రెజరీలో సమర్పించిన విడుదల కాలేదు. 2022-23 బకాయిలు అసలు ఎస్టీలకే చేరలేదు.

2023-24వి కూడా...

తాజాగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ కోసం గత సంవత్సరం డిసెంబర్ నెలాఖరులోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కనీసం ఇప్పుడైనా బకాయిలు విడుదలవుతాయన్న ఆశతో ఉన్నారు. కానీ ఇప్పటి వరకు బకాయిల చెల్లింపునకు సంబంధించిన సంకేతాలే వెలువడడం లేదు. ఇంకో రెండు నెలలైతే ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా పూర్తవుతుంది. ఆ తర్వాత సెలవులు. పాఠశాలలు, కళాశాలలు తిరిగి తెరుచుకునే సమయానికి పార్లమెంట్ ఎన్నికల హడావుడి ఉంటుంది. అప్పుడు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై దృష్టిపెట్టే అవకాశం ప్రభుత్వానికి ఉండదు. బకాయిల వివరాలను కొత్త ప్రభుత్వానికి అందచేశామనీ, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేస్తుందని ఆశిస్తున్నామనీ, నిధులు రాగానే చెల్లిస్తామని బీసీ సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఉపకారవేతనాలే దిక్కు

పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉపకార వేతనాలపై ఆధారపడి విద్యాభ్యాసం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు స్కాలర్‌షిపులు రాకపోతాయా, ఫీజు రీయింబర్స్‌మెంట్ జరక్కపోతుందా అన్న నమ్మకంతో పట్టణాలకు వచ్చి ప్రభుత్వ, ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా ఇదే భరోసాతో వారిని ఉన్నత చదువులకు పట్టణాలకు పంపుతున్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సబంధించి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. కేవలం రీయింబర్స్‌మెంట్ మీదే ఆధారపడి చదువు చెబుతున్న ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ఉమ్మడి జిల్లాలో 258 ఉన్నాయి. వీటిలో సుమారు 82 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో ఎక్కువ ఎస్సీ, ఎస్టీ, బీసీలే. విద్యార్థులను కళాశాలలో చేర్చుకునే సమయంలో రీయింబర్స్‌మెంట్ రాకపోతే విద్యార్థులే చెల్లించాలన్న నిబంధనలు కళాశాల యాజమాన్యాలు పెడుతున్నాయి.

సర్టిఫికెట్లకు బ్రేక్

ప్రభుత్వం సకాలంలో రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు టీసీలు, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. పై చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు వాటిని సంబంధిత కంపెనీల్లో సమర్పించే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సకాలంలో సమర్పించకపోతే ఉద్యోగం పోయే పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు. పై చదువుల కోసం ఆయా ఉన్నత కళాశాలల్లో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులకు సైతం ఈ తిప్పలు తప్పడం లేదు. ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందిగా కాలేజీకి వెళ్లి విద్యార్థులు అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదని, ఆ నిధులు వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీలు కొర్రీ పెడుతున్నాయి. లేదంటే ఫీజు సొమ్ము చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుపోవాలని సలహా ఇస్తున్నాయి. దీంతో పేద విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో బయట అప్పులు చేసి డబ్బులు కట్టి సరిఫికెట్లు తీసుకోకతప్పడం లేదు. చేసిన అప్పులకు నెలనెలా వడ్డీ కట్టాల్సి వస్తోంది. ప్రభుత్వం నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందో అని ఎదురుచూస్తున్నారు.

బీసీ, ఈబీసీ విద్యార్థులవే పెండింగ్

పోస్టు మెట్రిక్ కళాశాలల విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ఎక్కువగా బీసీ కేటగిరీకి చెందిన నిధులే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి ఆయా సంక్షేమ శాఖల నిధులను రీయింబర్స్‌మెంట్ పథకానికి ఖర్చు చేస్తుండగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించిన నిధులు మాత్రం విడుదల కాని పరిస్థితి ఉంది.

ఇక్కట్లలో ప్రైవేటు కాలేజీలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల్లో జాప్యం వల్ల వాటినే నమ్ముకొని నడుస్తున్న ప్రైవేటు కాలేజీలు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. పలు ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు క్రమంగా మూతపడుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20కిపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు, 7 డిగ్రీ కాలేజీలు, 28 ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి. మరొకొన్ని మూతపడే స్థితిలో ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తే ప్రైవేటు కాలేజీలకు కాస్త ఊరట లభించేది. కానీ మూడేళ్ల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించి చాలా జీఆర్‌వోలు (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్లు) జారీ అయ్యాయి. కానీ నిధుల విడుదల కాగితాలకే పరిమితమైపోయింది.



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

మనోళ్లే ఓడించిన్రు..

- పక్కనే ఉండి సహకరించలే...
- అధిష్ఠానం ఎదుట ఓటమి నేతల గోడు
- తెలంగాణ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం
- పాల్గొన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నేతలు, కార్యకర్తలు
- దిశానిర్దేశం చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపు

హనుమకొండ టౌన్, జనవరి 10 : పక్కనే ఉంటూ సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారని, తమ వెంటే ఉంటూ వ్యతిరేకంగా పని చేశారని, తమ ఓటమికి పొరుగు పార్టీ వారికంటే సొంత పార్టీ వారే కారణమని ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇటీవల ఓటమి చెందిన నేతలు, కార్యకర్తలు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. ఓటమికి గల కారణాలపై పలువురు నేతలు సొంతపార్టీ వారిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యేలు సైతం కింది స్థాయి క్యాడర్‌ను పట్టించుకోలేదని పలువురు అధిష్ఠానం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేలు కొంత మందిని కోటరీగా ఏర్పాటు చేసుకుని కార్యకర్తలను విస్మరించారని ఆరోపించారు. భూపాలపల్లి, వరంగల్ తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓటమి చెందిన గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్‌లు సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేశారు. తన వెంటే ఉంటూ అపోజిషన్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపారని గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు వారు కోరుకున్న దానికంటే ఎక్కువ చేసినప్పటికీ బీఆర్ఎస్‌ను వ్యతిరేకించారని ఆరోపించారు. తమ నియోజకవర్గంలో కార్పొరేషన్ చైర్మన్‌లు, ముఖ్య నేతలు, పటిష్టమైన క్యాడర్ ఉన్నప్పటికీ ఓటమి చెందడం విడ్డూరంగా ఉందని నన్నపునేని నరేందర్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యులు ఎవరు కూడా తన కోసం పని చేయలేదని ఆరోపించారు. తన ఓటమికి సొంత పార్టీ ముఖ్య నేతలే కారణమని నన్నపునేని నరేందర్ సమావేశంలో పేర్కొన్నారు.

తన నియోజకవర్గంలో ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత కనిపించిందని దయాకర్‌రావు తెలిపారు. వర్ధన్నపేట, పరకాలలో బీఆర్ఎస్ ఓటమి చెందుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నుంచి ఓటమి చెందిన దాస్యం వినయభాస్కర్, అరూరి రమేశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గాల్లో ఉన్న ఉద్యోగులు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపలేదన్నారు. తమ ఓటమికి ఉద్యోగుల ఓట్లు ప్రధాన కారణమన్నారు. నేతల మధ్య సమన్వయం లోపించిందని, క్యాడర్ అసంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశంలో పేర్కొన్నారు. పార్టీ నిర్మాణం చేపట్టి క్యాడర్‌కు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కడియం పేర్కొన్నారు. లేదంటే పార్టీ మనుగడ ప్రమాదంగా మారే అవకాశం ఉంటుందని అన్నారు. ఇలా ప్రతీ ఒక్కరు వారి అభిప్రాయాలను సభలో వెల్లడించడం గమనార్హం.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం : కేటీఆర్

త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థి గెలుపుకోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని ఆయన వరంగల్ నేతలకు సూచించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జరిగిన తప్పులను సరిదిద్దుకుని ముందుకు పోదామన్నారు. పార్టీ నిర్మాణం చేపట్టి క్యాడర్‌ను కాపాడుకుంటామని ఆయన తెలిపారు. అధికార పార్టీ తప్పులను ఎండగడుతూ ప్రజల పక్షాన నిలువాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కాగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మూడు బస్సుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశానికి తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ పార్టీ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.



వీరన్న పెళ్లికొడుకాయెనే..

- కన్నుల పండువగా కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం

6

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

- భారత్ మూడో అగ్ర దేశంగా ఎదుగుతోంది
- మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్




సదస్సులో ప్రసంగిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్ర మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

దామెర, జనవరి 10 : అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ.. ప్రపంచంలో భారత దేశం నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడో అగ్ర దేశంగా ఎదుగుతోందని మధ్యప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. దామెర మండల కేంద్రంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సదస్సు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సదస్సులో ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచంలోనే భారత దేశాన్ని ఒక సంపన్న దేశంగా చూడాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే దేశంలో పేదలకు, నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సుమారు 80కోట్ల మందికి గోదుమలు, బియ్యం ఉచితంగా అందించడం జరిగిందన్నారు. తెలంగాణలో 2లక్షల 33 వేల ఇళ్ల నిర్మాణం చేసి, లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం, ఉజ్వల పథకాలను పేదలకోసం తీసుకురావడం జరిగిందన్నారు. ఈనెల 22న అయోధ్యలోని రామ మందిరంలో బాల రాముడి ప్రతిష్ఠాపన నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరుగబోతోందని తెలిపారు. రైతులకు నగదు సాయం, చిరు వ్యాపారుల అభివృద్ధికి ముద్ర పథకం ద్వారా రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యేలు మొలుగూరి భిక్షపతి, గుండె విజయరామారావు, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాగా, అంతకుముందు శివరాజ్‌సింగ్ చౌహాన్ వరంగల్‌లోని భద్రకాళిదేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

అగ్రంపహాడ్ జాతరకు ఏర్పాట్లు చేయండి

- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 10 : అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతర సమయంలో పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, స్నానాల కోసం నీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల పార్కింగ్, విద్యుత్ ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ఆర్టీసీ బస్ సర్వీసులను పెంచి, తగినన్ని సీసీ కెమెరాలు సిద్ధం చేయాలని తెలిపారు. జాతరలో ప్లాస్టిక్ వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. అగ్రంపహాడ్ జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 18వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. జాతరకు మహిళలు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, డీసీపీ రవీందర్, పరకాల ఆర్‌డీవో శ్రీనివాస్, ఏసీపీ కిశోర్ కుమార్, దేవాదాయ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిజ్వాన్‌బాషా, రాధికగుప్తా, అధికారులు

భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి


- బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా
- ఐనవోలు జాతరలో ఏర్పాట్ల పరిశీలన

6

హైదరాబాద్‌లో పట్టాలు తప్పిన ‘చార్మినార్’

- మానుకోట జిల్లాకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు

6





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ	మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ	మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

కేయూ పరీక్ష కేంద్రాలను సందర్శించిన వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో కేయూ క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ విభాగంలో నిర్వహిస్తున్న పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నగరంలోని గీతాంజలి, మాస్టర్‌జీ, సిటీ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్

కేయూ క్యాంపస్, జనవరి 10: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో ఏడాది మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అధనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు బుధవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యూలర్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు..

కేయూ పరిధిలో బీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు జనవరి 18, 20, 22, 24 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు బుధవారం తెలిపారు. రెగ్యూలర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ హాజరుకావాలన్నారు.

కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను పరిశీలిస్తాం

- రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్ రెడ్డి


కేసముద్రం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే పీసీసీఎం రవీన్‌కుమార్‌రెడ్డి

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మణుగూర్, ఇంటర్‌సిటీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్‌ను పరిశీలించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) కె.రవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణీకులు ఆయనకు రైళ్ల హాల్టింగ్‌పై విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామని, త్వరలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటే మూడో లైను నిర్మాణంతోపాటే ప్లాట్‌ఫాంలపై ఫుల్‌కవర్‌షెడ్లు, డిస్‌ప్లే బోర్డులు, రెండో ప్లాట్‌ఫై ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. వరంగల్‌కు అప్‌అండ్‌డౌన్ చేసే వారు మహబూబాబాద్ నుంచి కాకుండా కేసముద్రం నుంచి సీజన్ టికెట్లు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ పీసీసీఎం భాస్కర్, సీనియర్ డీసీఎం బస్వరాజ్, స్థానికులు వోలం శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తౌను పునూరి భాస్కర్, బచ్చు లక్ష్మీనారాయణ, బోనగిరి ఉపెందర్ ఉన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 10 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్నిధిలో సందడి నెలకొంది. మహాజాతరకు ముందుగానే భక్తులు భారీ సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం సుమారు 30 వేల మంది తల్లుల దర్శనాలు చేసుకున్నారు. తెలంగాణలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించారు. చల్లగా చూడాలని వేడుకున్నారు.




ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు




అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఐనవోలు జాతరలో వాకిటాకీ సేవలు

ఐనవోలు, జనవరి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి జా తరలో దేవ స్థానం అధికారు లు వాకిటాకీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మాత్రమే వాకిటాకీల ద్వారా బందోబస్తు విధులు నిర్వర్తించేవారు. గత జాతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ఆ సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం పరిశీలన, బోనం, పట్నాల టిక్కెట్ల విక్రయాలు, లడ్డుప్రసాదం అమ్మకాల వద్ద భక్తుల రద్దీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవిధంగా ఆయా విభాగాలు చూసే సిబ్బందికి 6 వాకిటాకీలను అందజేసి ఈవోకు అనుసంధానం చేస్తూ వాటి పనితీరుపై తర్ఫీదు ఇచ్చారు.

నేడు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల బంద్

వడ్డెపల్లి, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్లచట్టానికి నిరసనగా గురువారం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓరుగల్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపాటి సారయ్య, ప్రధాన కార్యదర్శి బండి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 చట్టంలో భాగంగా డ్రైవర్లపై మోపిన చట్టం వలన డ్రైవర్లకు 10 సంవత్సరాలు జైలు శిక్షా, రూ. 7 లక్షల జరిమానాను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్, జనవరి 10: ఈనెల 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు కేయూ జాతీయ సేవ పథకం(ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన వారిలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సీహెచ్. అక్షయశ్రీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎ.ఇక్షితా, కోఎడ్యుకేషన్ మహిళ ఇంజరింగ్ కళాశాల నుంచి ఎల్.అనిల్ కుమార్, వర్సిటీ ఫార్మసీ కళాశాల నుంచి పి.సందీప్‌లు ఉన్నారని ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు.

నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీ భూములు ఇవ్వొద్దు

కేయూ క్యాంపస్, జనవరి 10: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టుకు అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన భూములను కేటాయించడాన్ని విరమించుకోవాలని కేయూ ఏబీవీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ మాట్లాడారు. వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మూగ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

▸▸ రూ. 5 లక్షల 50 వేల జరిమానా

వరంగల్ లీగల్, జనవరి 10 : మూగ, మానసిక వికలాంగురాలైన బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 లక్షల 50వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వై.సత్యేంద్ర బుధవారం తీర్పు వెలువరించారు. అదే విధంగా బాధుతురాలికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి రూ. 5 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మంగమ్మతోట మార్కండేయ నగర్‌కు చెందిన 14 సంవత్సరాల బాలిక పుట్టుకతోనే మూగ, మానసిక వికలాంగురాలు. ఎప్పటిలాగే బాధితురాలిని ఇంటి వద్ద ఉంచి 2019 నవంబరు 7న పనికి వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే ఏడుస్తున్న కూతురుని అడుగగా తనకు కడుపునొప్పిగా ఉందని వారికి సైగలతో చెప్పడంతో ఏమి జరిగిందని అడుగగా 6వ తేదీన మధ్యాహ్నం 3.15 గంటలకు ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన తేజావత్ హచ్చు అలియాస్ రమేశ్ ఇంటిలోకి వచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. గతంలో కూడా రెండు సార్లు అత్యాచారానికి పాల్పడినట్లు సైగల ద్వారా తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడి తేజావత్ రమేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5 లక్షల 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

నిబంధనలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

హనుమకొండ రూరల్, జనవరి 10: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, స్వీట్‌హౌస్‌లపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవైఎఫ్ఐ నోముల కిశోర్, డి.తిరుపతి బుధవారం కలెక్టరేట్‌లో ఫుడ్ సేఫ్టీ అండ్ కంట్రోల్ జోనల్ ఆఫీసర్ అమృతశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తినే ఆహార పదార్థాల తయారీ సందర్భంగా ఎలాంటి పరిశుభ్రత పాటించడం లేదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

కేయూ నూతన ఆడిట్ ఆఫీసర్ బాధ్యతలు స్వీకరణ

కేయూ క్యాంపస్, జనవరి 10: కేయూ నూతన ఆడిట్ ఆఫీసర్‌గా లింగంపల్లి రాము బుధవారం కేయూ ఆడిట్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పాల కాంట్రాక్టరు నుంచి ఏఆర్ కిష్టయ్య లంచం తీసుకుని ఏసీబీకి చిక్కడంతో ఆడిట్ ఆఫీసర్ పోస్టు ఖాళీ ఏర్పడింది. దీంతో పరీక్షల విభాగంలోని యూజీ విభాగంలో పనిచేస్తున్న రామును ఆడిట్ విభాగానికి వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసరావు బదిలీ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ల సంఘం నేతలు డాక్టర్ ఎస్.సుజాత నేతృత్వంలో ఇతర ఏఆర్‌లు కె.శ్రీలత, ఇసాక్ ప్రభాకర్, తేజావత్ జవీర్, ప్రణయ్‌కుమార్, హబీబుద్దీన్‌లతో పాటు ఇతర సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన బల్దియా



నక్కలగుట్టలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న బల్దియా, పోలీస్ అధికారులు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 10 : నగరంలోని ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపునకు బల్దియా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. దీనిలో భాగంగా బుధవారం హనుమకొండ కాళోజీ జంక్షన్ నుంచి నక్కలగుట్ట దిశగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. చిరు వ్యాపారుల సముదాయాలను తీసేశారు. షాపుల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. సెల్లార్లలోనే వాహనాల పార్కింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు బల్దియా అధికారుల తీరుపై చిరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకోవాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 10: అభివృద్ధి ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణాల ప్రణాళికలు, పనుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంకేతికతను వినియోగించుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికా రులకు సూచించారు. బుధవారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో ఎన్ఐటీ ప్రొఫెసర్లు, కుడా అధికారులతో సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగరాభివృద్ధి ప్రాజెక్టులు, ట్రాఫిక్, కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర అంశాలను చర్చించారు. ఎన్ఐటీ ప్రొఫెసర్లతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు రిజ్వాన్ బాషా సూచించారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



అదనపు కలెక్టర్ రాధికగుప్తకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి

సుబేదారి, జనవరి 10: జిల్లా అదనపు కలెక్టర్‌గా(స్థానిక సంస్థలు) నియమితులైన రాధికగుప్తను బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. శశిజాదేవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ కరుణ కుమారి, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్ కుమార్, కుమరస్వామి ఉన్నారు.

సమాజ సేవకుడా సెలవిక..

అశ్రునయనాల నడుమ రామా శ్రీనివాస్ అంత్యక్రియలు



రామా శ్రీనివాస్ భౌతిక కాయం వద్ద కెప్టెన్ లక్ష్మీకాంతరావు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 10: స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో సమాజానికి, ప్రజలకు నిరంతరం సేవలందించిన రామా శ్రీనివాస్ కానరాని లోకాలకు వెళ్లిపోయారు. హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం గుండెపోటుతో రామా శ్రీనివాస్ మృతి చెందగా, భౌతికకాయాన్ని రాత్రి వరంగల్‌కు తరలించారు. తిమ్మాపూర్ క్రాస్ రోడ్డులోని సిల్వర్ క్రౌన్ హైస్కూల్‌లో భద్రపర్చారు. బుధవారం ఉదయం ప్రముఖులు, ప్రజలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు. అక్కడి నుంచి సాయంత్రం రామన్నపేటలోని మోక్షారామం వరకు అంతిమ యాత్ర కొనసాగింది. అమ్మ ఒడి వద్ద ఆయన పార్థివ దేహాన్ని మోక్షారామం ఫౌండేషన్ సభ్యులు, అమ్మ ఒడి కుటుంబ సభ్యులు కడసారి దర్శించుకున్నారు. శ్మశానవాటికలో అమ్మ ఒడి కుటుంబ సభ్యులు, అభిమానులు, స్నేహితుల అశ్రునివాళుల నడుమ అంత్యక్రియలు జరిగాయి. ఆయన కుమారుడు రామా శైలేష్ తండ్రి చితికి నిప్పంటించారు.

ప్రముఖుల నివాళులు..

హఠాన్మరణం చెందిన రామా శ్రీనివాస్ భౌతికకాయాన్ని బుధవారం పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. మాజీ మంత్రులు చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బీజేపీ నాయకు లు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు చి లుకమారి సంజీవ, చాం బర్ సభ్యులు, వివిధ వ్యా పార సం ఘాల అసోసియేషన్ల సభ్యులు, పలువురు వైద్యులు, హనుమకొండ కలెక్టరేట్ ఏవో కుసు మ సత్యనారాయణ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పద్మశాలీ సంఘం నాయకులు ఆడెపు రవీందర్, వద్నాల నరేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పోపా అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరప్రసాద్, ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, వేముల సదానందం, వరంగల్ తూర్పు జర్నలిస్టుల సంఘం నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు నాయకులు, ప్రజలు శ్రీనివాస్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

రామ రాజ్య స్థాపనే ధ్యేయం

మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

హసన్‌పర్తిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



హసన్‌పర్తిలో మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

హసన్‌పర్తి, జనవరి 10 : భారతదేశంలో ఆకలిలేకుండా, పేదరికాన్ని నిర్మూలించి రామ రాజ్యాన్ని స్థాపించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అణగారిన వర్గాల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చివరి వ్యక్తి వరకూ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు, అందుకోసమే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టినట్లు తెలిపారు. దేశంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గించి, ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అణగారిన వర్గాల ప్రయోజనం కోసం పీఎం జన ఆరోగ్యయోజన, పీఎం భారతీయ జన ఔషధి పరియోజన, సామాజిక భద్రత, మహిళల కోసం పీఎం ఉజ్వల యోజన, ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలు, పేదల కోసం మౌలిక సదుపాయాల కల్పన, రైతుల కోసం పీఎం కిసాన్ యోజన, ఆహార భద్రతకు భరోసా, ఇంకా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, మాజీ శాసన సభ్యులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మార్తినేని ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయచందర్ రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, డాక్టర్ కాళీ ప్రసాద్, గురుమూర్తి శివకుమార్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మురళీధర్ గౌడ్, మహిళా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు సభ్యులు, వివిధ బ్యాంక్ శాఖల అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరన్న పెళ్లి కొడుకాయెనే..

కన్నుల పండువగా కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం



తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

భీమదేవరపల్లి, జనవరి 10: కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం వేద పండితుల వేదమంత్రోచ్ఛరణాల మధ్య కన్నుల పండువగా బుధవారం రాత్రి జరిగింది. స్వామివారి కల్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. శ్రీవీరభద్రస్వామి ఆలయంలో అంకురార్పణం, ధ్వజారోహణ, స్వామివారికి రుద్రాభిషేకం, గవ్యాంతం, నిత్యోపాసన, నిత్యహోమం, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, ఉపనిషత్ పారాయణం, ప్రదోశకాల పూజ, గణపతి పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా పల్లకిలో తీసుకువచ్చారు. స్వామివారి పుష్కరిణి పక్కన గల కల్యాణ మండపంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్ర స్వామి పక్షాన ప్రధాన అర్చకులు రాజయ్య, మొగిళిపాలెం రాంబాబు, తాటికొండ వీరభద్రయ్య, సదయ్య, వినయ్‌శర్మ, శివకుమార్, రమేష్, శ్రీకాంత్, శరత్‌చంద్రలు, భద్రకాళి సమేతులైన వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లకు జీలకరబెల్లం పెట్టి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, అక్షతరోపాణం, దివ్యనీరాజనం, మంత్రపుష్పాలు, మహాదాశీర్వచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా నిర్వహించారు.

స్వామి వారి కల్యాణానికి కొత్తకొండ, ముస్తాఫాపూర్, ధర్మారం, చంటయ్యపల్లి, గొల్లపల్లి, గట్లనర్సింగాపూర్, తదితర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. ఆలయ ఈవో కిషన్‌రావు కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్ఐలు సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్వామివారి కల్యాణానికి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాలన్ని కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మంజులారెడ్డి, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీలు వంగ రవి, మాజీ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, ఆర్ వెంకట్‌రెడ్డి, పిడిశెట్టి కనుకయ్య, కాసం రమేష్‌గుప్తా, సర్పంచ్‌లు దూడల ప్రమీల-సంపత్, రొంటాల ప్రభాకర్, గుంటి ఓదెలు, ఎంపీటీసీ యాటపోలు రాజమణి-శ్రీనివాస్ పాల్గొన్నారు.

డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి

వడ్డెపల్లి, జనవరి 10: డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ. 5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్రంలోని పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడ స్వామి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మంత్రి వర్గంలో మాదిగ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని, దళిత బంధు కొనసాగించాలని, ట్యాంక్ బండ్‌పై సదాలక్ష్మి విగ్రహం నెలకొల్పాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. డప్పు, చెప్పు వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే పోరు గర్జనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు బొచ్చు మొగిలి, జన్ను సంజీవ్, తీగల సదన్, రాకేశ్, గంగారపు యశ్వంత్, కొడవటి తిరుపతి, వడ్డెమానుకోట నాగరాజు, కొయ్యడ యాదగిరి, గిన్నారపు అనిల్, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌ఫ్లాగ్ జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్ నియామకం



హనుమకొండ క్రైం, జనవరి 10: సీపీఐ ఎం.ఎల్ (రెడ్‌ఫ్లాగ్) జిల్లా కార్య దర్శిగా హనుమకొండ గుండ్లసింగారంకు చెందిన సూదమల్ల భాస్కర్‌ను నియమించారు. బుధవారం గుండ్లసింగారంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో భాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి లింగంపెల్లి సత్యవర్ధన్, రాష్ట్రకమిటీ సభ్యులు మాన్యపు భుజేందర్ హాజరై భాస్కర్‌కు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర నాయకులకు భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మడికొండ, జనవరి 10: మడికొండ అంబేద్కర్ కాలనీలో గల అంబేద్కర్ భవనం వద్ద గోపాలపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం, ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్, ఆయుష్ వరంగల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, డాక్టర్లు శోభారాణి, హరిత, రాము, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, నాయకులు సారయ్య, తేరాల యుగంధర్, గోకవరం రాజేందర్, నర్సయ్య, సాంబయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేసి నేరాలను కట్టడి చేద్దాం

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా



పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందిస్తున్న సీపీ

హనుమకొండ క్రైం, జనవరి 10 : పోలీసు సిబ్బంది సమన్వయంతో పని చేసి నేరాలను కట్టడి చేయాలని వరంగల్ పోలీసు కమిషనరేట్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకు పోలీసు శాఖతో పాటు రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు చేసిన కృషికి బుధవారం రైల్వేతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కమిషనరేట్ కార్యాలయానికి పిలిచి అభినందించారు. పోలీసు సిబ్బందికి సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రైల్వే, పోలీసు శాఖలు సమన్వయంతో సమాచారాన్ని సేకరించి నేరాలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ దేవేందర్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, టీఎస్ ఆర్. కృష్ణలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సుబేదారి, జనవరి 10 : ఎల్ఐసీ ఉద్యోగుల రెండు సంవత్సరాల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్(ఐసీఈయూ) వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మర్రి ప్రభాకర్ అన్నారు. ఎల్ఐసీలోని అన్ని తరగతుల ఉద్యోగులు జాయింట్ ఫ్రంట్‌గా ఏర్పడి వేతన సవరణకై బాలసముద్రంలోని ఎల్ఐసీ డివిజన్ ఆఫీసులో బుధవారం ఒక గంట పాటు వాకౌట్ సమ్మె చేశారు. ఈ సందర్భంగా మర్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. చట్టబద్ధంగా ఎల్ఐసీ ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణను కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ యాజమాన్యం తాత్సారం చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లాస్ వన్ అధికారుల సంఘం అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి మంజుల, ఐసీఈయూ వరంగల్ డివిజన్ అధ్యక్షులు బి. శ్రీహరి, సంయుక్త కార్యదర్శి నాగభూషణం, నాయకులు ఎ. చంద్రశేఖర్, రేష్మ, కళ్యాణి, స్వరూప, సంధ్య పాల్గొన్నారు.

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

మడికొండ, జనవరి 10: తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ మడికొండ శాఖ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపనబోయిన రాజు, సలహాదారులుగా బరిగెల కృష్ణమూర్తి, దార సూరి, మాచర్ల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎమ్డీ సలీం, భోగి రాజు, వస్కుల కుమార్, చల్ల సతీష్, బుర్ర ఎల్లగౌడ్‌లు ఎన్నియ్యారు. ప్రధాన కార్యదర్శిగా జిట్ట సదానందం, కార్యదర్శులుగా లింగాల సురేష్, నర్ర భాను, మోడెం ముకుందం, బిల్ల సంతోష్, కోశాధికారిగా మద్దెల కుమారస్వామి, సహాయ కోశాధికారులుగా వల్లపు చిన్నరమేష్, ఎమ్డీ సాదిక్, గడ్డం కిరణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 10 : అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తయినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 66 డివిజన్ల నుంచి 2,82,820 దరఖాస్తుల స్వీకరణ జరిగినట్లు తెలిపారు. వీటి నమోదును కేవలం ఐదు రోజుల్లోనే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో పట్టాలు తప్పిన 'చార్మినార్'

మహబూబాబాద్ జిల్లా వాసులకు గాయాలు

లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న మాజీ కోఆప్షన్ మెంబర్ ఇబ్రహీం

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 10 : హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రైలు పట్టాలు తప్పిన ఘటనలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం. మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాకూబ్‌పాష, బీఆర్ఎస్ మాజీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ ఇబ్రహీం ఆలీలు సంక్రాంతి పండుగకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో తమ పిల్లలను తీసుకువచ్చేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలానికి చెందిన టి.లక్ష్మి-శ్రీనివాస్ దంపతులు కొంతకాలంగా పెయింటింగ్ పనిచేసుకుంటూ మహబూబాబాద్‌లో నివాసముంటున్నారు. కాగా, సెలవులకు ఇంటికి తీసుకువచ్చేందుకు వీరు కూడా ఇదే రైలు లో వెళ్లారు. మరికొద్ది క్షణాల్లో స్టేషన్‌లో దిగుతామని అనుకున్నలోపే నాంపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలు తప్పడంతో సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో యాకూబ్‌పాష కాలు విరిగింది. ఇబ్రహీం ఆలీకి చేయి విరిగింది. లక్ష్మి చేయికి స్వల్పగాయాలయ్యాయి. ఆ ముగ్గురిని దక్షిణమధ్య రైల్వే అధికారులులాలాగూడ రైల్వేఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం తక్షణ సాయంగా ఇబ్రహీంఆలీ, యాకూబ్ పాషాకు ఒక్కొక్కరికి రూ.50 వేల నగదును అందించినట్లు తెలిపారు. కాగా, లక్ష్మికి స్వల్పగాయాలు కావడంతో చికిత్సనందించారు. ఈ రైలు ప్రమాదఘటనలో బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అందులో మానుకోట జిల్లాకు చెందిన మరో కొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 10 : మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డ్రగ్స్ నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు అవగాహన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్, టీఎస్ న్యాబ్, ఎక్సైజ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ అరికట్టాలన్నారు. మత్తు పదార్థాల అమ్మకాలపై పటిష్టమైన నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారి, డీఈవో అబ్దుల్ హై, డీఐఈవో ఎ.గోపాల్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి

బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

ఐనవోలు జాతరలో ఏర్పాట్ల పరిశీలన

ఐనవోలు, జనవరి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లను గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాలు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూలైన్ల ఏర్పాటు, టిక్కెట్ కౌంటర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, టాయిలెట్స్, వాహనాల పార్కింగ్, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాట్లు, సులభ్ కాంప్లెక్స్, కమాండ్ కంట్రోల్‌రూం తదితర ఏర్పాట్లను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుతోపాటు ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్, అదనపు కలెక్టర్‌లు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను త్వరతగతిన పూర్తిచేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకు ముందు స్వామి వారిని దర్శించుకున్న వారికి అర్చకులుపట్టువస్త్రాలతో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్‌కుమార్, డీఈ సంజయ్‌కుమార్, కుడా సీపీ అజిత్‌రెడ్డి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎస్సై అనిల్‌కుమార్, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు రంగారావు

వడ్డెపల్లి, జనవరి 10: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండ్ -19 క్రికెట్ పోటీలకు గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని ఎస్‌వీ క్రికెట్ అకాడమీక్‌కు చెందిన పింగిళి రంగారావు ఎంపికయ్యారు. ఇటీవల కాలంలో గద్వాల జోగులాంబ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో రంగారావు వరంగల్ ఉమ్మడి జిల్లా తరపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం గోపాల్‌పూర్‌లోని ఎస్‌వీ క్రికెట్ అకాడమీలో హనుమకొండ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కోదండపాణి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయభానురావుతోపాటు ఎస్‌వీ క్రికెట్ అకాడమీ కోచ్ శశాంక్, విశ్వంభర్‌రావు, మహ్మద్ అఫ్జల్, ఓసిటీ కోచ్ సుమన్, బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్, పవన్ రాజ్ తదితరులు పింగిళి రంగారావును ఘనంగా సత్కరించారు.

ఉల్లెంగల యాదగిరికి సముచిత స్థానం కల్పించాలి

వడ్డెపల్లి, జనవరి 10: ఆల్ ఇండియా నేషనల్ ఓబీసీ కో ఆర్డినేటర్ ఉల్లెంగల యాదగిరికి ప్రభుత్వంలో పదవిని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు చిన్నాల సరళాదేవి అన్నారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్న యాదగిరికి వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కరీంనగర్ లేదా ఖమ్మం ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధిష్ఠాన వర్గానికి ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంకం కోమల, సయ్యద్ రఫీ ఉద్దీన్, మామిండ్ల నారాయణ, పుల్ల రమేష్, ఏకు సుధాకర్, దురిశెట్టి సంతోష్‌కుమార్, కండెరాజుల వెంకట సోమన్న, సరోజనదేవి పాల్గొన్నారు.

నవ్య

కుటుంబ కదంబం

గురువారం • 11 జనవరి 2024
features@andhrajyothy.com



ఒత్తిడి తగ్గించే పైనాపిల్

పైనాపిల్‌లో సి- విటమిన్ పుష్కలం. ఇందు వల్ల కొల్లాజిన్ ఉత్పత్తి చక్కగా ఉంటుంది. తద్వారా జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. చర్మం మిలమిలా మెరుస్తుంది. యాంటీ రిచ్ ఆక్సిడెంట్స్ ఉండటం వల్ల చర్మం బిగుతుగా ఉంటుంది కాబట్టి యవ్వనంగా కనిపిస్తారు.

- ఈ పండు తింటే జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది.
- వీటిలో ఇమ్యూనిటీని పెంచే శక్తి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు, దగ్గు-జలుబు లాంటివి దరిచేరవు.
- కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం ఉంది. అందు వల్ల బరువు తగ్గాలనుకునేవాళ్లు ఈ పండుతో దోస్తీ మంచిది.
- ఇందులో మెగ్నీషియం, కాపర్ ఉండటం వల్ల ఎముకల గట్టితనానికి ఉపయోగపడతాయి.
- పైనాపిల్‌లో న్యూట్రిన్లు అధికం. ముఖ్యంగా ఒత్తిడి, ఆందోళన తగ్గించే లక్షణాలు ఈ పండులో ఉంటాయి.
- ఫైబర్ కంటెంట్ ఎక్కువ ఉండటం వల్ల సులువగా జీర్ణం అవుతుంది. రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తుంది.
- పైనాపిల్‌ను తినటమే కాదు జ్యూస్‌లు, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. దీంతో పాటు ఈ గుజ్జును చర్మానికి పట్టించుకుంటే ఫేస్‌లో కాంతి వస్తుంది.



"వ్యవసాయ శాస్త్రవేత్తలు అద్భుతమైన ఆవిష్కరణలు ఎన్నో చేస్తున్నారు. రైతులకు చేరినప్పుడు, క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే వాటికి సార్థకత" అంటారు **స్వాతి నాయక్**. ఆ దిశగా ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన 'నార్మన్ ఇ.బోర్లాగ్' పురస్కారాన్ని అందుకున్నారు. 'ఐఆర్ఆర్ఐ' దక్షిణాసియా విభాగం అధిపతిగా దేశ, విదేశాల్లో వ్యవసాయ రంగంపై తనదైన ముద్ర వేస్తున్న స్వాతి అంతరంగమిది.

సాగు రైతు

బాగు కోసం...

"నా స్వస్థలం ఒడిశాలోని పూరీ. ఆ రాష్ట్రంలోని మయూర్‌భంజ్ ప్రాంతంలో ఉన్న గిరిజనులు నన్ను 'బిహనా దీదీ' (విత్తనాల సహోదరి) అని పిలుస్తారు. కారణమేమిటంటే... దాదాపు పదేళ్ల క్రితం... దుర్భిక్షాన్ని తట్టుకోగలిగే 'సహ్‌భంగీ' అనే వరి రకాన్ని అక్కడ పరిచయం చేశాం. ఇప్పుడు ఆ రకాన్ని ఎక్కువమంది సాగు చేస్తూ, మంచి దిగుబడులు పొందుతున్నారు. వారి పిలుపు, అంతకన్నా వాళ్లకు కలుగుతున్న ప్రయోజనాలు ఎంతో సంతోషం కలిగిస్తాయి. చిత్రమేమిటంటే... వ్యవసాయ శాస్త్రవేత్త కావాలనేది నా చిన్ననాటి లక్ష్యం ఏమాత్రం కాదు. ఇంజనీర్, డాక్టర్ లేదా సివిల్స్... విజయానికి నిర్వచనంగా భావించే వృత్తులివి. చదువులో నేను బాగా చురుగ్గా ఉండడంతో... వాటిలో ఏదో ఒక దారి ఎంచుకోవాలనే ఒత్తిడి నా మీద ఎక్కువగానే ఉండేది. అయితే ఇలాంటి లక్ష్యాలు నాకు ఇబ్బందిగా అనిపించేవి. 'అవి చదివితేనే సక్సెస్ అయినట్టా?' అనుకొనేదాన్ని. అందుకే వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. క్రమంగా బయాలజీ అంటే ఇష్టం పెరిగింది. ఆ తరువాత వ్యవసాయమంటే మక్కువ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో... అగ్రికల్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ, గుజరాత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజిమెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో... పద్దెనిమిది నెలలపాటు ఐటీడీఏకి చెందిన ఒక ప్రాజెక్ట్‌లో, రెండేళ్లపాటు ఢిల్లీలోని 'నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్' (ఎన్ఆర్ఎల్ఎం)లో పని చేశాను. ఈ సందర్భంలోనే మహిళా రైతుల సాధికారత కోసం కొన్ని కార్యక్రమాలను రూపొందించాను. వారి పొలాలను మరింత లాభదాయకంగా వినియోగించుకోవడం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ లాంటివాటికి అవి సాయపడ్డాయి. దీని ద్వారా లక్షలాది మహిళలు లబ్ధి పొందారు. వృత్తిరీత్యా అనేక గ్రామీణ ప్రాంతాలను సందర్శించినప్పుడు... కఠోరమైన పరిస్థితులు కనిపించాయి. అతివృష్టి, అనావృష్టి, పెరిగిపోతున్న సాగు ఖర్చులతో వ్యవసాయ రంగం అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సంక్షోభాన్ని తట్టుకొని నిలబడాలంటే మెరుగైన, సరికొత్త వంగడాలే శరణ్యం. అదే సమయంలో... వాతావరణ మార్పులు అనేది ఒక కఠోరమైన వాస్తవం. మనం చేయగలిగేదల్లా వాటిని తట్టుకోగలిగే సామర్థ్యాలను పెంచుకోవడమే. వివిధ వాతావరణాల్ని తట్టుకోగలిగే విత్తనాలను రైతులకు మనం అందించగలిగితే... వరదలు, కరువుల వల్ల ఎదురయ్యే సమస్యల నుంచి వారికి రక్షణ ఏర్పడుతుంది. వ్యవసాయం ఒక శాస్త్రం మాత్రమే కాదు, అది కోట్లాది మందికి జీవనోపాధి కూడా. ఈ రంగాన్ని ఎలా పటిష్టం చెయ్యాలో, దీన్ని మరింత లాభసాటిగా ఎలా మార్చాలి అనే అంశాల మీద మనమందరం పని చెయ్యాలి. ఈ ఆలోచనలే నా వృత్తిలో నాకు దిశానిర్దేశం చేశాయి.

నైపుణ్యం, ప్రోత్సాహం అందించాలి...

ప్రస్తుతం 'ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ)లో... విత్తనాల విధానం- ఉత్పత్తుల యాజమాన్య విభాగానికి దక్షిణాసియా అధిపతిగా ఉన్నాను. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని, అత్యధిక ఫలసాయాన్నిచ్చే, జీవపరంగా బలోపేతం చేసిన 500 కొత్త వరి రకాలపై క్షేత్రస్థాయిలో పరీక్షలు జరపడం నా బాధ్యతల్లో ఒకటి. ఇలాంటి వాటిలో ఇరవైకి పైగా రకాలను మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనే కాదు, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లోనూ ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాం. మరోవైపు 'సీడ్ వితవుట్ బోర్డర్స్' పాలసీ రూపకల్పనలోనూ నేను ప్రధానపాత్ర వహించాను. భౌగోళికంగా ఒకేరకమైన పరిస్థితులు ఉన్న ఏ దేశంలోనైనా పంటలను సాగు చేయడానికి అది వీలు కల్పిస్తుంది. దీని వల్ల పంట వైవిధ్యంతో పాటుగా ఆహార కొరతను కూడా తీర్చవచ్చు. కొత్త వంగడాల సృష్టికి కూడా ఆస్కారం ఏర్పడుతుంది. దీనిలో భాగంగా వాతావరణ ప్రభావాల్ని తట్టుకొనే వరి రకాలను ఇతర దేశాలకూ పరిచయం చేశాను. ఒక ఎకరం కన్నా తక్కువ భూమి ఉన్న రైతు కరువులు, వరదల్లాంటి సవాళ్లను ఎలా ఎదుర్కోగలడనేది అన్నిటికన్నా నాకు ఆందోళన కలిగించే విషయం. కొత్త వ్యవసాయ సాంకేతికతలు రైతులకు అందుబాటులోకి తేవాలి. కొత్త తరం విత్తనాల గురించి వారిలో మరింత అవగాహన కల్పించాలి. ప్రయోగశాలకు, పంట పొలానికి, మార్కెట్‌కు మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలి. అందుకే వ్యవసాయ పరిశోధనలకి, క్షేత్రస్థాయిలో వాటిని అమలు చెయ్యడానికీ మధ్య ఉన్న అవరోధాలను తగ్గించడానికి పని చేస్తున్నాను. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తేనే వారికి సాధికారత లభిస్తుంది. అలాగే.. మన దేశ వ్యవసాయ కార్మికుల్లో సగానికి పైగా మహిళలే. కానీ వాళ్లకు తగిన ప్రతిఫలం కానీ, భూమి హక్కులు కానీ లేవు. రికార్డుల ప్రకారం వారు రైతులు కారు. దీనివల్ల సాగు విషయాల్లో తగినంత పరిజ్ఞానం, శిక్షణ, వాళ్ల శ్రమకి తగిన గుర్తింపు లేవు. తగిన నైపుణ్యాలను, ప్రోత్సాహాన్నీ అందిస్తే మహిళలు ఏదైనా సాధించగలరు. అంతేకాదు, నేను పనిచేసే రంగంలోనూ మహిళల సంఖ్య తక్కువ. దీనివల్ల అనేక సవాళ్లు ఎదుర్కొన్నాను. కానీ ఈ రంగంపై అభిరుచి, అంకితభావం కారణంగా రాణిస్తున్నాను.



అది గర్వకారణంగా భావిస్తున్నా...

నేను శాస్త్రవేత్తను మాత్రమే కాదు, ఒక మహిళను. తల్లిని. ఏదైనా చేయాలని నేను అనుకున్నప్పుడు... నా కుటుంబ జీవితాన్నీ, వృత్తి జీవితాన్నీ బ్యాలెన్స్ చేసుకోవాలి. మాది వ్యవసాయ కుటుంబం కాదు. నాకు సాగు గురించి ఏమీ తెలీదు. కానీ అనుకోకుండా ఈ రంగమే నా జీవితమైపోయింది. గిరిజనులు, చిన్న కమతాల రైతులు, కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న వ్యవసాయ పనులు చేసుకొనే మహిళలు... ఇలా అన్ని రకాల ప్రజలతో పని చేసే అవకాశం వచ్చింది. అదే సమయంలో కొన్ని ఇబ్బందులూ పడ్డాను. ఐఆర్ఆర్ఐలో పని చేస్తూనే పిహెచ్‌డీ కూడా చేసేదాన్ని. అప్పుడు నేను ఏడు నెలల బిడ్డకు తల్లిని. నా బిడ్డ కోసం పని భారాన్ని తగ్గించుకోవాలి. కానీ వారమంతా బిజీగా ఉండేదాన్ని. ఆ సమయంలో నా భర్త, స్టాక్ మార్కెట్ నిపుణుడు ప్రియదర్శి బాల్ అండగా నిలిచారు. మా బిడ్డ పనులు, ఇంటి పనుల్లో సాయం చేసేవారు. ఇప్పుడు మా అమ్మాయికి ఏడేళ్లు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక మహిళ ఏదైనా రంగంలో నిలదొక్కుకొని, విజయం సాధించాలంటే.. కుటుంబంతో పాటు సహోద్యోగుల సాయం కూడా అవసరం. అదృష్టవశాత్తూ నాకు అందరినుంచీ మంచి మద్దతు లభిస్తోంది. కిందటి ఏడాది ప్రతిష్ఠాత్మకమైన 'నార్మన్ ఇ.బోర్లాగ్' పురస్కారం నాకు లభించింది. నోబెల్ బహుమతి గ్రహీత, హరిత విప్లవం ప్రధాన రూపశిల్పి డాక్టర్ నార్మన్ బోర్లాగ్ జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేశారు. ఆహారం, పోషకాహార భద్రత, ఆకలి నిర్మూలన రంగాల్లో విశేష కృషి చేసిన నలభై ఏళ్లలోపు వయసుగల శాస్త్రవేత్తలకు ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. దీన్ని భారతదేశం నుంచి అందుకున్న మూడో వ్యక్తిని నేను. ఇది ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాను. అణగారిన ప్రజలకు ఏదో విధంగా సాయపడాలన్నదే నా ప్రయత్నం. నాణ్యమైన విత్తనాల ద్వారా రైతులకు సాధికారత కల్పించాలి. ఇది కేవలం వారి జీవనోపాధికి, మన ఆహార వ్యవస్థను పటిష్టం చెయ్యడానికీ మాత్రమే కాదు, రైతుల ఆదాయం గణనీయంగా పెరగడానికి కూడా దోహదపడాలి. దీనికోసం గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. భవిష్యత్తులో వరి పరిశోధనలు, వ్యవసాయ పద్ధతుల్లో నవ్యావిష్కరణలు చిన్నకారు, పేద రైతులకు సాయపడేలా ఉండాలి ఇవన్నీ నా కలలు. అవి సాకారం కావడానికి మరింత కృషి చేస్తాను."

రోజూ నడిస్తే...

రోజుకు కనీసం ఏడు కిలోమీటర్లు నడిస్తే ఆరోగ్యానికి మంచిదంటున్నారు హార్వర్డ్ యూనివర్శిటీ పరిశోధకులు. ఉదయాన్నే వరగడపున మాత్రమే నడిస్తే మరిన్ని ఫలితాలుంటాయట. వెయ్యిమందిని తీసుకుని ఉదయంపూట కనీసం ఇరవై నిముషాలు వాకింగ్ చేయిస్తే.. వారిలో దగ్గు, జలుబు, సిక్‌గా ఉండటం లాంటి లక్షణాలు 43 శాతం తగ్గాయి.



- శరీరాన్ని కదిలించటం, కాళ్లు కదపడం వల్ల లాభమే కానీ నష్టం ఉండదు. ముఖ్యంగా ఉదయం పూట వాకింగ్ చేయటం వల్ల మంచి గాలి పీల్చుకోవచ్చు. ఇతరులతో మాట్లాడటం వల్ల మానసికంగా చురుగ్గా ఉంటారు.
- ఉదయం పూట నడక క్రమశిక్షణతో పాటు పాజిటివ్ మూడ్ కలుగుతుంది. ముఖ్యంగా బ్లడ్‌లో షుగర్‌లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి. మెటబాలిజమ్ బూస్ట్ అవుతుంది.
- నడవటం వల్ల బరువు తగ్గుతారు. రక్తపోటు తగ్గుతుంది. దీనివల్ల గుండెకు మంచిది. శ్వాస బాగా ఆడుతుంది. తద్వారా హాయిగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది.
- కండరాలు గట్టిపడతాయి. ఉదయం పూట కాబట్టి సూర్యరశ్మి పడటం వల్ల డి- విటమిన్ వస్తుంది. ఎముకలు గట్టిపడతాయి.
- జీర్ణశక్తి మెరుగుపడుతుంది. వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 11 జనవరి 2024
cinema@andhrajyothy.com

కంగువ కంప్లీట్



సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ కథానాయిక. బాబీడియోల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం అప్డేట్‌ను సూర్య అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'కంగువ'లో నా చివరి షాట్ పూర్తయింది. ఒక ముగింపు, మరెన్నో గొప్ప ప్రారంభాలకు పునాది వేస్తుంది. వెండితెరపై 'కంగువ'ను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. గొప్ప దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించిన శివకు నా ధన్యవాదాలు' అని సూర్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూర్య స్టిల్‌ను మేకర్స్ షేర్ చేశారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

సంక్రాంతికి మరో సూపర్‌హిట్ ఖాయం

నాగార్జున



'తెలుగువారికి సంక్రాంతి అంటే సినిమా పండుగ. ప్రేక్షకులు గతంలో నా సంక్రాంతి సినిమాలను గొప్ప హిట్ చేశారు. ఇప్పుడు 'నా సామిరంగ' చిత్రాన్ని కూడా అదే రీతిలో ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ సారి పండుగకు కిష్టయ్య వస్తున్నాడు. 'నా సామిరంగ' అంటూ బాక్సాఫీసును కొట్టబోతున్నాడు' అని నాగార్జున అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ దర్శకుడు. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు వస్తున్నాయి. అన్నింటినీ ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నాను. నాన్నగారి ఆజ్ఞగా భావించి 'నా సామిరంగ' చిత్రం చేశాను. కీరవాణి అద్భుతమైన పాటలు ఇచ్చారు. మూడు నెలల్లో ఈ సినిమాను పూర్తి చేయడం ఒక రికార్డు' అని తెలిపారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి నేను నాగార్జున గారికి అభిమానిని. ఈలలు వేస్తూ థియేటర్లలో ఆయన సినిమాలు చూశాను. కీరవాణి, చంద్రబోస్ గారు మా టీంకు అండగా నిలిచారు' అని తెలిపారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'నాగార్జున గారితో కలసి నటించడం మరచిపోలేని అనుభవం. అక్కినేని అభిమానులందరూ ఈ సారి థియేటర్లలో పండుగ చేసుకోవడం ఖాయం' అన్నారు. విజయ్ బిన్నీ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైంలో మంచి క్వాలిటీతో సినిమాను పూర్తి చేశాం. నా సాంగ్స్ చూసి దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నాగార్జున గారికి రుణపడి ఉంటాను. యూనిట్‌లో ప్రతి ఒక్కరి సహకారంతో సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించగలిగాను' అన్నారు. కీరవాణి మాట్లాడుతూ 'కొత్త ప్రతిభను గుర్తించి అవకాశాలు ఇవ్వడంలో నాగార్జున ముందుంటారు. 'నా సామిరంగ'తో విజయ్ దర్శకుడిగా హిట్ అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి నాగార్జున గారు నన్ను ఆహ్వానించడమే గొప్ప గౌరవం అని చంద్రబోస్ తెలిపారు. నాగార్జున గారి లాంటి స్టార్‌తో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని ఆశికా రంగనాథ్ చెప్పారు.

ఫిబ్రవరిలో వస్తున్న భైరవకోన



సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పకులు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకొని గంభీరంగా కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచింది. అతీంద్రియ శక్తులకు సంబంధించిన అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇదని మేకర్స్ తెలిపారు. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: ఛోటా కె. ప్రసాద్.

దేవకీ నందన వాసుదేవ



'ఈ కథకి 'దేవకీ నందన వాసుదేవ' సరైన టైటిల్. ఈ కథకోసం రెండేళ్లు వర్క్ చేశాను. నేను రాసిన కథల్లో ఆద్యంతం వినోదభరితమైన కథ ఇదే. దీనిపై అశోక్ పేరు రాసుంది. అందుకే అతని దగ్గరకు చేరింది. కొత్త నిర్మాత బాలకృష్ణ ఇష్టంతో సినిమా నిర్మిస్తున్నారు. నాకంటే బాగా తీయగలడనే నమ్మకంతో అర్జున్‌కి ఈ కథ ఇచ్చాను. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రాగారి మాటలు ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్. అద్భుతమైన సంభాషణలు అందించారాయన. భీమ్స్ మంచి పాటలు ఇచ్చారు. పాత్రలకు తగ్గట్టు ఆర్టిస్టులు సెట్ అయ్యారు. ఇంత మాస్ పాత్రను అశోక్ ఎలా చేస్తాడా అనుకున్నాను. రషస్ చూశాక షాక్ అయ్యాను. చాలా సర్‌ప్రైజ్ ఇచ్చాడు' అని ప్రశాంత్ వర్మ అన్నారు. ఆయన కథతో అశోక్ గల్లా కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రానికి 'దేవకీ నందన వాసుదేవ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. వారణాసి మానస కథానాయిక. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ చిత్రం టీజర్‌ని బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ వర్మ మాట్లాడారు. 'ప్రశాంత్‌వర్మ అద్భుతమైన కథ, సాయిమాధవ్‌గారి సంభాషణలు, అర్జున్ దర్శకత్వ ప్రతిభ ఇవన్నీ ఈ సినిమాను నెక్స్ట్ లెవల్లో నిలబెట్టాయి. ఆ ప్రభావం రేపు థియేటర్లలో చూస్తారు.' అని అశోక్ గల్లా నమ్మకంగా చెప్పారు. బాలకృష్ణ రాజీ పడకుండా సినిమాను నిర్మిస్తున్నారని, సాయిమాధవ్ మాటలు, భీమ్స్ పాటలు అలరిస్తాయని దర్శకుడు చెప్పారు. కృష్ణగారి కుటుంబం నుంచి వచ్చిన అశోక్ తప్పకుండా సూపర్‌స్టార్ అవుతాడని సాయిమాధవ్ బుర్రా నమ్మకం వెలిబుచారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు.



అంజమ్మ అందరికీ నచ్చేస్తుంది


'నేను భాష గురించి ఆలోచించను. పాత్ర గురించి మాత్రమే ఆలోచిస్తాను. నచ్చితే బెంగాలీ సినిమా అయినా చేసేస్తాను. హీరోయిన్ అనిపించుకోవడం కంటే మంచి నటి అనిపించుకోవడమే నాకిష్టం. హీరోయిన్ అని ట్యాగ్ తగిలిస్తే ఆనందపడిపోయే టైప్ కాదు నేను. కథలో ప్రాధాన్యం ఉండాలి. 'వీరసింహారెడ్డి' సినిమా చూస్తే బాలకృష్ణగారి తర్వాత అంతా నేనే కనిపిస్తా. అది కదా కావాల్సింది..!' అంటూ చెప్పుకొచ్చారు వరలక్ష్మి శరత్‌కుమార్. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా అందులో కీలకపాత్ర పోషించిన వరలక్ష్మి శరత్‌కుమార్ విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ప్రశాంత్‌వర్మ ఈ కథ చెప్పినప్పుడు కచ్చితంగా చేయాల్సిన కథ అనిపించింది. ఈ సినిమాలో నా పాత్రపేరు అంజమ్మ. నేనూ, తేజా అక్కాతమ్ముళ్లం. మాపై తీసిన సరదా సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఇది సూపర్‌హీరో కాన్సెప్ట్‌లో తెరకెక్కిన సినిమా. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ వుండే యాక్షన్ సీక్వెన్స్ అది. ప్రశాంత్‌వర్మ ఎంత అద్భుతంగా ఈ కథ చెప్పాడో, అంత అద్భుతంగా తీశాడు. చిన్న సినిమాగా మొదలైన ఈసినిమా.. ఇంతింతై, వటుడింతై అన్నట్టు ఇంత పెద్ద స్కేల్‌లో గ్రాండ్‌గా రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకుల్లో కూడా పాజిటివ్ బజ్ ఉంది.
- నిర్మాత నిరంజన్‌రెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాలి. 'హను-మాన్' అద్భుతంగా నిర్మించారు. దర్శకుడి విజన్‌ని అర్థం చేసుకునే నిర్మాత దొరకడం టీమ్ అదృష్టం. సినిమా ఒప్పుకున్న రోజున చిన్న సినిమా అనుకున్నాను. తొలిరోజు సెట్‌లోకి అడుగుపెట్టగానే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్స్ కనిపించాయి. అప్పుడర్థమైంది ఇది చిన్న సినిమా కాదు అని. ఏ విషయంలోనూ నిర్మాత రాజీ పడలేదు.
- క్రాక్, వీరసింహారెడ్డి, కోటబొమ్మాళీ చిత్రాల్లోని నా పాత్రల్లో గ్రే షేడ్స్ ఉంటాయి. కానీ ఇందులో ఆ షేడ్ ఉండదు. ఇది పాజిటివ్ పాత్ర. అయినా ప్రేక్షకులకు బాగా నచ్చేస్తుంది. అంజమ్మ పాత్ర చాలా విభిన్నమైనది. కచ్చితంగా నాకు మంచి పేరు తెచ్చిపెడుతుంది.
- చిరంజీవిగారు అభినందించడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. అలాగే 'కోటబొమ్మాళీ' చూసి నాన్న తెగ మెచ్చుకున్నారు. మంచి పాత్రలు దొరకడం.. అందరూ మెచ్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. తెలుగులో లభిస్తున్న ఆదరణ నాకు ఏ భాషలోనూ లభించలేదు. అందుకే హైదరాబాద్‌కి షిఫ్ట్ అయిపోయాను. ఇక్కడే ఉంటున్నాను. ప్రస్తుతం సుదీప్‌గారి 'మ్యాక్స్', ధనుష్ 'డి50'లో నటిస్తున్నాను. ఓ తెలుగు సినిమాలో అద్భుతమైన పాత్ర చేస్తున్నాను. ఆ వివరాలు త్వరలో తెలియజేస్తా.

వచ్చింది సెల్ఫీ కోసం కాదు



సినీతారలు కంటపడితే చాలు 'ప్లీజ్ ఓ సెల్ఫీ' అంటూ అభిమానులు ఎగబడడం, వారిని నిరుత్సాహపరచడం ఇష్టం లేకో, లేదా తమకు పొగరు అనుకుంటారనే భయంతోనో చాలామంది సెలబ్రిటీలు ఫొటోలు దిగటం చూస్తూనే ఉన్నాం. కానీ డ్రీమ్‌గర్ల్ హేమమాలిని లాంటి అతికొద్ది మాత్రం అందుకు మినహాయింపు అని చెప్పాలి. ఇటీవలే ముంబైలో జరిగిన ప్రముఖ రచయిత గుల్జార్ బయోగ్రఫీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ అభిమాని హేమమాలినీని సెల్ఫీ ఇవ్వాలని అడగ్గా అందుకు ఆమె చిరాకుపడ్డారు. 'నీకు సెల్ఫీ ఇవ్వడానికి కాదు ఇక్కడకు వచ్చింది' అని కోప్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. సెల్ఫీ అడిగితే ఇంత పొగరుగా ప్రవర్తించాల్సిన అవసరం లేదని కొంతమంది నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.




వినోదాన్ని పంచే మెకానిక్



మణిసాయితేజ, రేఖ నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకుడు. కథ, కథనం, మాటలు, పాటలు కూడా ఆయనే రాయడం విశేషం. ఎం.నాగ మునెయ్య(మున్నా) నిర్మాత. ఈ నెల 26న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఆడియో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత లక్ష్మీభూపాల, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ అతిథులుగా హాజరై సినిమా విజయం సాధించి, నిర్మాతకు లాభాల తెచ్చిపెట్టాలని ఆకాంక్షిచారు. ఈ సినిమా ఆడియోను టి సిరీస్ వంటి ప్రఖ్యాతసంస్థ తీసుకోవడం, వారి చార్ట్‌బాస్టర్‌లో ఈ సినిమా పాటలు దూసుకుపోవడం చాలా ఆనందాన్నిచ్చింది, ముఖ్యంగా సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్యకు రుణపడి ఉంటానని నిర్మాత అన్నారు. 'దర్శకుడు ముని పర్‌ఫెక్షన్, విజన్ ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. అన్నీ తానే అయి ఈ చిత్రాన్ని పూర్తిచేశాడు. హీరోహీరోయిన్ల జంట యువతరాన్ని అలరిస్తుంది' అని ఆయన అన్నారు. వినోద్ యాజమాన్య పాటల విషయంలో తన సొంత సినిమా అన్నట్టుగా పని చేశాడని, వినోదంతో పాటు చక్కని సందేశం కూడా ఈ సినిమాలో ఉంటుందని దర్శకుడు చెప్పారు. అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు హీరోహీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

జీవితానికి తెరరూపం ది గోట్ లైఫ్



90వ దశకంలో జీవనోపాధి వెతుక్కుంటూ కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథ ఆధారంగా రూపొందిన చిత్రం 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). మలయాళ స్టార్‌హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధానపాత్ర పోషించారు. హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్ కీలక పాత్రధారులు. బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా దర్శకుడు బ్లెస్సీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజువల్ రొమాన్స్ సంస్థ నిర్మించిన ఈ పాన్ ఇండియా సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని పృథ్వీరాజ్ ఫస్టులుక్ పోస్టర్‌ని ప్రముఖహీరో ప్రభాస్ రిలీజ్ చేశారు. 'నా స్నేహితుడు ప్రభాస్ చేతులమీదుగా 'ది గోట్ లైఫ్' ఫస్టులుక్ విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకోసం ఐదేళ్లు కష్టపడ్డాను. మానసికంగా, శారీరకంగా నజీబ్ కేరక్టర్‌లా మారిపోయాను. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. పూర్తిస్థాయి ఏడారిలో రూపొందిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుందీ సినిమా' అని పృథ్వీరాజ్ తెలిపారు. కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సునీల్ కేఎస్, సంగీతం: ఏఆర్ రెహమాన్, సౌండ్ డిజైన్: రసూల్ పూకుట్టి.



భువిపై రంగుల హరివిల్లులు

కన్నుల పండువగా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీ ఫైనల్స్


ముగ్గుల పోటీ విజేత హేమలతకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి, నటి అనన్య


ప్రథమ బహుమతి సాధించిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన శనిగారపు హేమలత వేసిన ముగ్గు

- ప్రథమ బహుమతి అందుకున్న ఆదిలాబాద్ జిల్లావాసి శనిగారపు హేమలత
- వరంగల్, ఖమ్మం, మెదక్ మహిళలకు సంయుక్తంగా ద్వితీయ బహుమతి
- వారికి బహుమతులు అందించిన ఎమ్మెల్యే యశస్విని, సినీ నటి అనన్య నాగళ్ల

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. రంగుల హరివిల్లులు భూమికి దిగివచ్చాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు, చెరుకుగడలు.. సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ బుధవారం జరిగాయి. అమీర్‌పేట గురుగోవింద్ సింగ్ మునిసిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్స్‌కు ముఖ్య అతిథులుగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, సినీ నటి అనన్య నాగళ్ల పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గులు వేయడం మర్చిపోతున్న రోజుల్లో.. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రశంసించారు. మహిళల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని ఝాన్సీరెడ్డి అన్నారు. ముత్యాలముగ్గులు మన సంస్కృతిని కళ్లముందు ఉంచాయని.. తన చిన్ననాటి రోజులను గుర్తుకుతెచ్చాయని అనన్య నాగళ్ల అన్నారు. ఈ ముగ్గుల పోటీలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించాయని హైదరాబాద్ సర్కిల్ కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కనిమొళి పేర్కొన్నారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రజని, ఆంధ్రమహిళా సభ విశ్రాంత చైర్‌పర్సన్ గీత భాస్కర్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన శనిగారపు హేమలత ప్రథమ బహుమతి సాధించి రూ.30 వేల చెక్కు అందుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన మానేటి కవిత, ఖమ్మం జిల్లాకు చెందిన మారోజు నీరజ, మెదక్ జిల్లాకు చెందిన వజ్జ దివ్య రెండో బహుమతి సాధించి రూ.10 వేల చెక్కులను అందుకున్నారు. కన్సొలేషన్ బహుమతులు పొందిన ఆరుగురికీ 3 వేల చెక్కులతో పాటు 'హనుమండ్ల ఝాన్సీ- రాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్' తరఫున రూ.12 వేల నగదును అందించారు. ముగ్గులంటే తనకు చిన్నప్పటి నుంచి ఇష్టమని.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల్లో 15 ఏళ్లుగా పాల్గొంటున్నానని విజేత హేమలత తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, 'ఆంధ్రజ్యోతి' అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం ఆర్.ఆర్ నాయుడు, 'ఆంధ్రజ్యోతి' తెలంగాణ బ్యూరో చీఫ్ మురళీకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మారోజు నీరజ- ఖమ్మం జిల్లా ద్వితీయ బహుమతి గ్రహీత


వజ్జ దివ్య- మెదక్ జిల్లా ద్వితీయ బహుమతి గ్రహీత


మానేటి కవిత- వరంగల్ జిల్లా ద్వితీయ బహుమతి గ్రహీత


ముగ్గులను పరిశీలిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రామాయంపేట, జనవరి 10: మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల భవానీ రైస్‌మిల్లులో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ మిల్లులో రేషన్ బియ్యాన్ని నిల్వచేసి, అమ్ముకుంటున్నట్టు సమాచారం రావడంతో విజిలెన్స్ ఏసీపీ ద్రోణాచార్య, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ బ్రహ్మం తమ సిబ్బందితో కలిసి సోదాలు చేశారు. ఈ సందర్భంగా 544 బస్తాల్లో నిల్వచేసిన 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రాణం తీసిన చికెన్ ముక్క!

- భోజనం తింటుండగా గొంతులో ఇరుక్కున్న ముక్క
- ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి


జితేందర్

షాద్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భోజనం తింటుండగా గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జితేందర్ కుమార్ వర్మ(46).. ఎలికట్టలోని తన స్నేహితుడు ధర్మేందర్ తివారితో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పని పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్లి చికెన్ కూర వండుకొని స్నేహితుడితో కలిసి భోజనం చేస్తూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. ధర్మేందర్ స్థానికుల సహాయంతో జితేందర్‌ను షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికెన్ ముక్క గొంతులో ఇరుక్కుపోవడంలో వల్లనే జితేందర్ మరణించడని పోస్టుమార్టం నివేదికలో తేలింది.

పాలమూరు, జడ్చర్లలో భూములు కబ్జా

- అసైన్డ్ భూములను తిరిగి లాక్కున్నారు
- ఓఆర్‌సీల పేరిట పేదలను దగా చేశారు
- ఈ భూ దందాపై సమగ్ర దర్యాప్తు జరిపించండి
- రెవెన్యూ మంత్రిని కలిసిన యెన్నం, అనిరుధ్

మహబూబ్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను అక్రమంగా లాక్కున్న అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని స్థానిక ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కబ్జాకు గురైన భూములకు సంబంధించిన వివరాలను బాధితులతో కలిసి ఐదు రోజుల క్రితం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి అందించారు. "జడ్చర్ల నియోజకవర్గంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల్లో దళితులు, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్, ఇనామ్ భూములపై కొంతమంది కన్నేశారు. ఆ భూములు తమవేనంటూ ఓఆర్‌సీ(ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్లు)లను సృష్టించి వాటిని వెనక్కి తీసుకున్నారు. తర్వాత ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. రియల్ వ్యాపారులు అందులో వెంచర్లు ఏర్పాటు చేశారు. రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల మండలాల్లో ఈ అక్రమాలు జరిగాయి. రాజాపూర్ మండలంలో సుమారు 270 ఎకరాల వరకు భూములను లాక్కున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలువురు నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కలిసి చేసిన ఈ భూదందాపై తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలి" అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మంత్రి పొంగులేటిని కోరారు. అలాగే.. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ దాదాపు వేయి ఎకరాలకుపైగా భూములు అన్యాక్రాంతమైనట్లుగా ఫిర్యాదులు వచ్చాయని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ మంత్రికి వివరించారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలో, అర్బన్, రూరల్ మండలాల్లో భూముల కబ్జాలు యథేచ్ఛగా సాగాయని, ఈ ఆక్రమణలపై విచారణ జరిపి, వాటిని వెనక్కి తీసుకోవాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కాగా, భూముల కబ్జాపై విచారణకు ఆదేశిస్తామని రెవెన్యూ మంత్రి హామీ ఇచ్చారు.

పట్టాలు తప్పిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్

నాంపల్లి స్టేషన్‌లో ఆగుతుండగా ఘటన.. 'డెడ్ ఎండ్' గోడను బలంగా ఢీ కొట్టిన రైలు

- భారీ కుదుపుతో పక్కకు జరిగిన మూడు బోగీలు
- ఆరుగురికి గాయాలు.. లాలాగూడ ఆస్పత్రిలో చికిత్స
- రూ.50 వేల చొప్పున పరిహారం


నాంపల్లి స్టేషన్‌లో గోడను ఢీకొట్టిన రైలు.. ఆ కుదుపుతో పట్టాలు తప్పిన బోగీలు



హైదరాబాద్/ మంగళ్‌హాట్/ సికింద్రాబాద్/రైల్వేస్టేషన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12759) పట్టాలు తప్పింది. రైలు స్టేషన్‌లో ఆగే క్రమంలో డెడ్ ఎండ్ గోడను బలంగా ఢీ కొనడంతో మూడు బోగీలు ట్రాక్ నుంచి పక్కకు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. రైలు వేగం తక్కువగా ఉండడం, రైల్లో ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. తాంబారం నుంచి ఎగ్మోర్, చెన్నై మీదుగా హైదరాబాద్ వచ్చే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం 30 నిమిషాల ఆలస్యంగా 8.40 గంటలకు నాంపల్లి రైల్వే స్టేషన్‌లోని 5వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చింది. అయితే, డెడ్ ఎండ్‌కు అతి సమీపంలోకి వచ్చాక ఒకేసారి బ్రేకులు వేయడంతో రైలు ఆగకుండా వెళ్లి.. డెడ్‌ఎండ్ గోడను బలంగా ఢీకొట్టింది. దీంతో రైలులోని మూడు బోగీలు(ఎస్2, ఎస్3,ఎస్6) పట్టాలు తప్పాయి. ఆ కుదుపుతో రైలు దిగేందుకు సిద్ధంగా ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా కిందపడ్డారు. వీరిలో ఆరుగురు ప్రయాణికులకు గాయాలు కావడంతో రైల్వే అధికారులు వెంటనే వారిని లాలగూడ రైల్వే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్టేషన్‌లో ఆగే క్రమంలో రైలు వేగం తక్కువగా ఉండడంతోపాటు సికింద్రాబాద్ స్టేషన్‌లోనే చాలా మంది ప్రయాణికులు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లోకో పైలట్ తప్పిదంతోనే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. క్షతగాత్రులకు రైల్వే అధికారులు రూ.50 వేల చొప్పున నగదు సాయం అందజేశారు. విధి నిర్వహణలో ఉన్న టీటీకి సైతం గాయాలైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని సీపీఆర్వో రాకేశ్ తెలిపారు. ప్రమాదంపై సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ విచారణ చేపడతారని, నివేదిక వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనుంజయులు ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. పట్టాలు తప్పిన మూడు కోచ్‌లను రీరైలింగ్ చేయడంతోపాటు ట్రాక్‌ను పునరుద్ధరించారు. పూర్తిస్థాయి మరమ్మతుల అనంతరం నిర్ణీత సమయంలోనే నాంపల్లి నుంచి తాంబారానికి రైలు బయలుదేరి వెళ్లిందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాగా, ప్రమాదం నేపథ్యంలో హైదరాబాద్ నుంచి మేడ్చల్, మేడ్చల్ నుంచి హైదరాబాద్ వచ్చే ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేశారు. మిగతా రైళ్లన్నీ యథావిధిగా నడిచాయి.

దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

ఘట్‌కేసర్: బ్రేక్ లైనర్లు పట్టేయటంతో పొగలు చెలరేగి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సికింద్రాబాద్ నుంచి పాట్నా వెళ్తున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎన్ఎఫ్‌సీనగర్ వద్దకు రాగానే ఎస్-1బోగీలో పొగలు వ్యాపించాయి. ప్రయాణికులు అధికారులకు సమాచారం అందించడంతో.. ట్రైన్‌ను అక్కడే నిలిపివేశారు. అక్కడికి చేరుకున్న రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇలాంటివి సాధారణంగా జరుగుతుంటాయని రైల్వే అధికారులు వెల్లడించారు.

మూతపడిన టెక్స్‌టైల్ పార్కు

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం
- ఉపాధి కోల్పోనున్న వేలాది మంది కార్మికులు
- తిరిగి ప్రారంభించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా


సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం మరింత ముదురుతోంది. ఉత్పత్తి చేసిన పాలిస్టర్ బట్టకు మార్కెట్‌లో గిరాకీ లేకపోవడంతో, మీటరుకు రూ.2 నష్టానికి బట్టను అమ్ముకోలేక సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కును ఈ నెల 2న యజమానులు మూసివేశారు. పరిశ్రమలు మూతపడి 8 రోజులు అవుతున్నా ప్రభుత్వంగానీ, అధికారులుగానీ స్పందించలేదు. మరోవైపు 35 వేల మరమగ్గాలతో కుటీర పరిశ్రమగా రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న సిరిసిల్లలో ఈ నెల 15 నుంచి పాలిస్టర్ బట్ట ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లు పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం ప్రకటించింది. టెక్స్‌టైల్ పార్కులోని 115 ఆధునిక మరమగ్గాల కార్ఖానాలు మూతపడడంతో 2 వేలమంది వరకు ఉపాధిని కోల్పోయారు. సంక్షోభ సమయంలో యజమానుల నిర్ణయంతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 20 వేల మంది కార్మికులు ఉపాధిని కోల్పోనున్నారు. దీంతో... సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మూసివేసిన యూనిట్లను వెంటనే తెరిచి ఉత్పత్తులు ప్రారంభించాలని సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు ఎదుట వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. 8 రోజులుగా పనులు లేక కార్మికులు ఉపాధి కోల్పోయారని, ప్రత్యామ్నాయ ఉపాధిని చూపాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో సమావేశమైన కార్మికులు పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ నిరవధిక బంద్ నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని, కార్మికులకు పని కల్పించాలని కోరారు. మార్కెట్ పరిస్థితి అనుకూలంగా లేని పక్షంలో కనీసం ఒక షిఫ్ట్ పని కల్పించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు.

జనసేనానితో అంబటి రాయుడు భేటీ

- పవన్ ఆలోచనలు నచ్చాయని వెల్లడి
- వైసీపీ ఐడియాలజీతో ఇమడలేక బయటకు వచ్చానన్న ప్రముఖ క్రికెటర్

అమరావతి, జనవరి10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. బుధవారం ఉదయం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన పవన్ కల్యాణ్‌తో గంటన్నర పాటు చర్చించారు. తాజా రాజకీయాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు ఆయన వినాయకుని వెండి ప్రతిమను అందించారు. భేటీ అనంతరం అంబటి రాయుడు ఎక్స్ వేదికగా స్పందించారు. "వైసీపీతో ప్రయాణం చేయలేను. నా ఐడియాలజీ వేరు. వైసీపీ ఐడియాలజీ వేరు. అందుకే బయటకు వచ్చేశాను" అని పేర్కొన్నారు. అంతే కాదు.. వైసీపీతో ప్రయాణం చేయడం వల్ల తన ఆలోచనలు నెరవేరేలా కనిపించడం లేదన్నారు. తన కుటుంబ సభ్యులు, స్నేహితుల సూచనల మేరకు పవన్‌కల్యాణ్‌ను కలిసినట్టు తెలిపారు.

ఆలయ ప్రతిష్ఠ వేళ మసీదుల్లోనూ దీపాలు పెట్టండి

» బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖి

బెంగళూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): దేశంలోని 140 కోట్ల మంది ప్రజల డీఎన్ఏ ఒకటేనని, హిందువులు, ముస్లింలు సోదరులని బీజేపీ జాతీయ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖి పేర్కొన్నారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి మూర్తులను ప్రతిష్ఠించే వేళ మసీదులు, దర్గాలలో కనీసం ఐదు దీపాలను ఈ నెల 22న సాయంత్రం వెలిగించాలని ఆయన ముస్లింలకు పిలుపునిచ్చారు. ఇది హిందూ-ముస్లింల మధ్య సామరస్యాన్ని ఎన్నో రెట్లు పెంచుతుందని తెలిపారు. బీజేపీ మైనార్టీ మోర్చా కార్యకర్తలు మసీదులు, దర్గాల కమిటీ పెద్దలను ఇందుకు ఒప్పించే ప్రయత్నం చేస్తారని, అయితే ఎక్కడా బలవంతం ఉండదని అన్నారు.

నా కొడుకును నేను చంపలేదు

» నిద్రలేచి చూసేసరికి ప్రాణాలు కోల్పోయాడు: సుచన



బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భర్త మీద కోపంతో కన్నకొడుకును చంపుకొన్న 'ఏఐ మైండ్‌ల్యాబ్స్' సీఈవో సుచనా సేథ్.. అసలు తనకు కొడుకును చంపే ఉద్దేశమే లేదని, అతడు అకస్మాత్తుగా చనిపోయాడని పోలీసులకు తెలిపినట్టు సమాచారం. కర్ణాటకలో అరెస్టయిన ఆమెను.. ట్రాన్సిట్ వారంట్‌పై గోవాకు తీసుకొచ్చిన పోలీసులు రెండు గంటలపాటు ప్రశ్నించారు. ఆదివారంనాడు (7వ తేదీన).. తన భర్త తమ కుమారుణ్ని కలవకూడదనే ఉద్దేశంతోనే శనివారం గోవాకు వచ్చినట్టు ఆమె పోలీసులకు తెలిపింది. తన కుమారుణ్ని తాను ఎంతగానో ప్రేమిస్తానని.. అతణ్ని చంపే ఉద్దేశమే లేదని.. తాను నిద్ర లేచేసరికి అతడు చనిపోయి కనిపించాడని వారికి చెప్పింది. అయితే, బాలుడి మృతదేహానికి పోస్టుమార్టమ్ చేసిన వైద్యుడు కుమార్ నాయక్.. ఊపిరాడకపోవడం వల్లే అతడి మరణం సంభవించినట్టు వెల్లడించారు. అయితే.. బాలుడి గొంతు నులివిన, పెనుగులాడిన ఆధారాలేవీ లేవని, దిండు లేదా దుప్పటిని ముఖంపై అదిమిపెట్టి ఊపిరాడకుండా చేయడం వల్లే అతడు చనిపోయి ఉండొచ్చని అన్నారు.

ప్రపంచానికే భారత్ ఆశా కిరణం: ప్రధాని మోదీ



గాంధీనగర్, జనవరి 10 : ప్రపంచ దేశాలు అనిశ్చితితో అవస్థలు పడుతున్న వేళ భారతదేశం ప్రపంచానికి ఓ ఆశా కిరణంగా అవతరించిందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ దేశాలను ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లే శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన తొలి మూడు దేశాల్లో భారత్ అతి త్వరలో చోటు దక్కించుకుంటుందని పేరొందిన అనేక రేటింగ్ సంస్థలు చెబుతున్నాయని తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాలకు భారత్ మిత్ర దేశం(విశ్వ మిత్ర)గా మారిందని చెప్పారు. గాంధీనగర్‌లో 10వ విడత 'వైబ్రెంట్ గుజరాత్ అంతర్జాతీయ సదస్సు'ను మోదీ బుధవారం ప్రారంభించారు. యూఏఈ అధ్యక్షుడు షేఖ్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సదస్సులో పలు అంతర్జాతీయ సంస్థల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే 25 ఏళ్లు దేశానికి అమృతకాలమని, ఈ సమయంలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాగా, దేశ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ప్రధాని మోదీనే అని అని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు. నేటి తరం గొప్ప అంతర్జాతీయ నాయకుడు కూడా మోదీనే అని కొనియాడారు.

బిల్కిస్ బానో కేసు దోషుల్లో 9 మంది మిస్సింగ్?

న్యూఢిల్లీ, జనవరి 10: బిల్కిస్ బానో కేసులో సుప్రీం కోర్టు తాజాగా జారీ చేసిన ఆదేశాల మేరకు 11 మంది దోషులు తిరిగి జైల్లో లొంగిపోవాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఎవరూ లొంగిపోలేదని తెలుస్తోంది. దోషుల్లో తొమ్మిది మంది కనిపించకుండా పోయినట్టు మీడియా కథనాలు వెలువడుతున్నాయి. దోషులు రెండువారాల్లోగా సరెండర్ కావాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలపై ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని దాహోద్ ఎస్పీ బలరాం మీనా తెలిపారు. అయితే దోషులందరూ అజ్ఞాతంలోకి వెళ్లినట్టు చెప్పలేమని, వారిలో కొందరు బంధువుల ఇళ్లకు వెళ్లినట్టు తెలిసిందన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా సోమవారం ఉదయం నుంచే దోషుల గ్రామాల్లో బలగాలను మోహరించినట్టు చెప్పారు. ఈ కేసులోని దోషులందరూ రాంధిక్‌పుర్, సింగ్వాడ్ గ్రామాలకు చెందిన వారు కాగా 2002లో జరిగిన గోధ్రా అల్లర్లకు ముందు బిల్కిస్, ఆమె కుటుంబం రాంధిక్‌పుర్‌లో ఉండేది. కాగా గత ఆదివారం వరకు దాదాపు దోషులందరూ ఊర్లో కనిపించారని ఇరుగుపొరుగు వారు, దుకాణదారులు చెబుతున్నారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత వారంతా ఇళ్లకు తాళాలు వేసి వెళ్లినట్టు పేర్కొంటున్నారు.

క్యూబాలో 500% పెరిగిన పెట్రోలు ధరలు

హవానా, జనవరి 10: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న క్యూబాలో పెట్రోలు ధరలు అమాంతం పెరిగాయి. లీటరు పెట్రోలు ధర ఇప్పటి వరకు అక్కడ 25 పెసోలు ఉండగా ఇప్పుడది 132 పెసోల (భారత రూపాయిలలో సుమారు రూ. 450)కు పెరిగింది. ఇక ప్రీమియమ్ పెట్రోలు ధర 30 పెసోల నుంచి 156 పెసోలకు పెరిగింది. ఈ ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు క్యూబా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. క్యూబాలో గతంలో పెట్రోలును సబ్సిడీ ధరలకు అమ్మేవారు. కరోనా మహమ్మారితో అక్కడి ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. దాంతోపాటు అమెరికా ఆర్థిక ఆంక్షలు కఠినతరం చేయడంతో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్రవ్యోల్బణ రేటును అదుపులోకి తెచ్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు క్యూబా ప్రభుత్వం పేర్కొంది.

న్యాయాధికారుల వేతన సవరణ అమలుకు కమిటీ

న్యూఢిల్లీ, జనవరి 10: దేశవ్యాప్తంగా న్యాయాధికారుల సర్వీసు నిబంధనలు ఒకే విధంగా ఉండేలా చూడడానికి ప్రతి హైకోర్టులోనూ ఒక కమిటీని నియమించాలంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు జనవరి 4న ఇచ్చిన తీర్పును బుధవారం అప్‌లోడ్ చేశారు. ఆ తీర్పులో... 'ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ఈ కమిటీని డిస్ట్రిక్ట్ జ్యుడీషియరీ సర్వీస్ కండిషన్స్ కమిటీ (సీఎస్‌సీడీజే)గా పిలుస్తారు. న్యాయాధికారుల జీతాలు, పెన్షన్లు, ఇతర పదవీ విరమణ లాభాల గురించి ఇప్పటికే రెండవ జాతీయ జ్యుడీషియరీ పే కమిషన్ (ఎస్ఎన్‌జేపీసీ) ఉత్తర్వులు జారీ చేసింది. అవి సక్రమంగా అమలు అయ్యేలా చూడడమే సీఎస్‌సీడీజే బాధ్యత' అని ధర్మాసనం పేర్కొంది.

ఆలయ ప్రారంభానికి మేం..రాం!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ రామ మందిరాన్ని ఎప్పుడో ఒక రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయన్నారు. మందిర నిర్మాణం అసంపూర్తిగా ఉండగానే బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎన్నికల్లో ప్రయోజనాల కోసం దాన్ని ప్రారంభిస్తున్నాయని ఆరోపించారు. 2019లో సుప్రీంకోర్టు తీర్పుకు తాము కట్టుబడి ఉన్నామని, శ్రీరాముడిని పూజించే లక్షలాది మంది మనోభావాలను తాము గౌరవిస్తామని తెలిపారు. రామాలయ ప్రారంభానికి వెళ్లకూడదన్న తన నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ విచారించాల్సి వస్తుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ పేర్కొన్నారు. శ్రీరాముడి అస్తిత్వాన్ని నిరాకరించే కాంగ్రెస్ తాజా నిర్ణయం ఆశ్చర్యం కలిగించలేదని బీజేపీ నేత నళిన్ కోహ్లీ వ్యాఖ్యానించారు. కాగా, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు కూడా రామ మందిర ప్రారంభోత్సవానికి వెళ్లబోమని స్పష్టం చేశాయి. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ తనకు ఆహ్వానం అవసరం లేదని, ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు వెళతానని చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన (యూబీటీ)కు ఇంకా ఆహ్వానం అందలేదు. రామ మందిర ప్రారంభోత్సవానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, 4వేల సాధుసంతులు, 50 మంది విదేశీయులను ఆహ్వానించారు.

శాస్త్ర వ్యతిరేకులం కాకూడదనే

అయోధ్యలో 22న జరుగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తాము హాజరు కావడంలేదని ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠ్ పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద సరస్వతి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వచ్చేందుకు పూరీ గోవర్ధన మఠం పీఠాధిపతి నిశ్చలానంద సరస్వతి నిరాకరించిన కొద్ది రోజులకే ఆయన ఈ ప్రకటన చేశారు. తనతో పాటు జగద్గురువు ఆది



శంకరాచార్యుల వారు దేశంలో నెలకొల్పిన నాలుగు ప్రముఖ పీఠాల అధిపతులు, మత పెద్దలు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాబోరని స్పష్టం చేశారు. "ఈ వేడుకను శాస్త్రాలకు విరుద్ధంగా, హిందూ గ్రంథాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆలయ నిర్మాణం ఇంకా అసంపూర్తిగా ఉన్నప్పుడు ప్రాణప్రతిష్ఠ చేయడమే అసలు సమస్య" అని ఆయన తన అధికారిక "ఎక్స్" ఖాతాలో పోస్టు చేశారు. ఇదో అజ్ఞానపూరితమైన చర్యగా అభివర్ణించారు. ఈ నిర్ణయాన్ని మోదీ పట్ల ద్వేషంగా భావించరాదని, 'శాస్త్ర వ్యతిరేకులం' కాకూడదని భావించి నలుగురు పీఠాధిపతులు తీసుకున్న నిర్ణయమని అవిముక్తేశ్వరానంద పేర్కొన్నారు.

ప్రాణప్రతిష్ఠలో మహిళలకు చోటేదీ: దుర్గావాహిని

రామాలయ ప్రతిష్ఠాపనలో తమను భాగస్వాములను చేయాలని అయోధ్యలోని మహిళా సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు... నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి 22న ఏం చేయాలో అందరికీ చెప్పాలని వీహెచ్‌పీ మహిళా విభాగమైన దుర్గా వాహిని సభ్యులకు సూచించారు. అయితే ఆ రోజు చేయాల్సిన పనులేవిటో చెప్పలేదు. దీనిపై అయోధ్యలో దుర్గావాహిని అధ్యక్షురాలు వరిక్తా బసు మాట్లాడుతూ... "మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇది మాకు చాలా అవమానంగా ఉంది" అన్నారు.

22నే బిడ్డల్ని కంటాం

కొత్తచెరువు, జనవరి 10: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు వేద పండితులు నిర్ణయించిన సుముహూర్తం ఈ నెల 22వ తేదీ. ఆ అద్భుతమైన ముహూర్తంలో బిడ్డలను కనేందుకు ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ రోజున సిజేరియన్ చేయించుకునేందుకూ వెనుకాడటం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో సిజేరియన్లకు ఇప్పటికే రిజర్వు చేసుకున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు డిమాండ్ పెరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ నెల 22వ తేదీన ప్రసవం కోసం ఏకంగా 45 మంది తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకున్నారు. కదిరి, హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఆ తేదీన ప్రసవం కోసం రిజిస్ట్రేషన్లు జరిగాయి. సరిగ్గా రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు నిర్ణయించిన 12.29.08 గంటలకు తమకు సిజేరియన్ చేయాలని కూడా కొందరు కోరినట్లు సమాచారం. ఆరోజు ఎక్కువ ప్రసవాలు ఉండటంతో కొందరు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు గైనకాలజిస్టులను ప్రత్యేకంగా రప్పించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



'సీట్ల'పై చర్చలు ముమ్మరం

» ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతోనూ ఖర్గే సంప్రదింపులు

న్యూఢిల్లీ, జనవరి 10: సీట్ల సర్దుబాటు చర్చలు ప్రారంభించాక ఇండియా కూటమిలోని అన్ని పార్టీల నేతలతోనూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆ పార్టీ వెల్లడించింది. కూటమికి సంబంధించిన కీలక విషయాలపై త్వరలో నిర్ణయం వెలువడనుందని ఏఐసీసీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ బుధవారం చెప్పారు. కూటమిలోని అన్ని పార్టీలతోనూ చర్చలు ప్రారంభమయ్యాయని, కొన్ని పార్టీలతో చర్చలు ప్రాథమిక దశలో ఉండగా, మరికొన్ని పార్టీలతో చర్చలు పురోగతిలో ఉన్నాయన్నారు. 'బిహార్‌లో జేడీయూతో, బెంగాల్‌లో టీఎంసీతో ఒకటి రెండు రోజుల్లో సీట్ల సర్దుబాటు చర్చలు జరిపే అవకాశం ఉంది' అన్నారు. మహారాష్ట్ర, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో సీట్ల పంపకాలపై కూటమిలోని పార్టీల నుంచి కాంగ్రెస్ గట్టి సవాళ్లను ఎదుర్కొంటోంది. ఢిల్లీలో 7 లోక్‌సభ స్థానాలు ఉండగా, కాంగ్రెస్‌కు 3 సీట్లు ఇస్తామని ఆప్ ప్రకటించినట్టు తెలిసింది. పంజాబ్‌లో 13 స్థానాలుండగా, కాంగ్రెస్‌కు 6 స్థానాలు ఇచ్చేందుకు ఆప్ సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలు ఉండగా, అత్యధిక స్థానాల్లో శివసేన(యూబీటీ) పోటీ చేసే అవకాశం ఉంది.

మణిపూర్‌లో రాహుల్‌యాత్రపై హైడ్రామా

మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు జిల్లాలో చరిత్రాత్మక పోలో గ్రౌండ్ హట్టా కాంజేబంగ్‌లో జనవరి 14న రాహుల్ భారత్ జోడో న్యాయయాత్ర ప్రారంభించడంపై హైడ్రామా నెలకొంది. ఈ యాత్ర సందర్భంగా అక్కడ ర్యాలీ నిర్వహించాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలకు గండి పడింది. భద్రతా కారణాల దృష్ట్యా తొలుత ప్రభుత్వం యాత్రకు నిరాకరించింది. అయితే, కాంగ్రెస్ అభ్యర్థన మేరకు ఎట్టకేలకు ర్యాలీ లేకుండా అతికొద్ది మందితో హట్టా కాంజేబంగ్ మైదానం నుంచే యాత్ర ప్రారంభానికి ఓకే చెప్పింది.

అసలైన శివసేన షిండేదే

» ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయటం లేదు

» మహారాష్ట్ర స్పీకర్ నార్వేకర్ ప్రకటన

» ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారు: ఉద్ధవ్

ముంబై, జనవరి 10: మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన చీలిక వర్గం అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు మరో ఎదురుదెబ్బ తగిలింది. శివసేన రెండు చీలికవర్గాల్లో ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్‌షిండే సారథ్యంలోని వర్గమే అసలైన శివసేన అని ఆ రాష్ట్ర స్పీకర్ రాహుల్ నార్వేకర్ బుధవారం ప్రకటించారు. ఇరువర్గాల్లోని ఏ ఎమ్మెల్యేపైనా అనర్హత వేటు వేయటం లేదని తెలిపారు. తద్వారా షిండే వర్గంలోని 16 మంది ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న ఉద్ధవ్ ఠాక్రే విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తన నిర్ణయంలోని ముఖ్యమైన అంశాలను నార్వేకర్ 105 నిమిషాలపాటు చదివి వినిపించారు. పార్టీలో అసమ్మతి లేదా క్రమశిక్షణా రాహిత్యంపై ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ప్రయోగించటం ఏ పార్టీ నాయకత్వానికి కూడా సాధ్యం కాదని స్పష్టం చేశారు. పార్టీలో రెండు చీలిక వర్గాలు ఉనికిలోకి వచ్చిన 2022 జూన్ 21వ తేదీ నాటి నుంచే ఉద్ధవ్ వర్గం విప్‌గా ఉన్న సునీల్‌ప్రభు ఆ పదవిని కోల్పోయారని, అధికారిక విప్ హోదా షిండే వర్గానికి చెందిన భరత్ గోగవాలెకు దక్కిందని స్పీకర్ తెలిపారు. వైరి వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఇరువర్గాలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తున్నానని, ఎవరినీ అనర్హులుగా ప్రకటించటం లేదన్నారు. ఎన్నికల సంఘానికి శివసేన సమర్పించిన 1999 నాటి పార్టీ నియమావళి ప్రకారం.. పార్టీలో జాతీయ కార్యవర్గమే అత్యున్నత నిర్ణాయక వేదిక అని, పార్టీ నుంచి ఎవరినైనా తొలగించే అధికారం శివసేన ప్రముఖ్‌కు (అధ్యక్షుడికి) లేదని, కాబట్టి, షిండేను పార్టీ నుంచి ఉద్ధవ్ తొలగించలేరని పేర్కొన్నారు. పార్టీలో అధ్యక్షుడి మాటే అత్యున్నతం అని పేర్కొంటూ 2018లో శివసేన నియమావళిలో చేసిన సవరణను పరిగణనలోకి తీసుకోవాలన్న ఉద్ధవ్ వర్గం విజ్ఞప్తిని నిరాకరించినట్లు స్పీకర్ వెల్లడించారు. 2022 జూన్‌లో పార్టీ చీలినప్పుడు, మొత్తం 54 మంది పార్టీ ఎమ్మెల్యేల్లో 37 మంది షిండే వెంట ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్పీకర్ నిర్ణయంతో షిండే వర్గం సంబరాలు జరుపుకొంది. 'ప్రజాస్వామ్యంలో అంకెలు (ఎమ్మెల్యేల సంఖ్య) కీలకం. అవి మా వద్ద ఉన్నాయి' అని షిండే పేర్కొన్నారు.



నార్వేకర్

కాగా, స్పీకర్ నిర్ణయంపై ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ప్రజాస్వామ్యం హత్యకు గురైందని, న్యాయం కోసం తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపారు. ఈ కేసులో సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన మార్గదర్శకాలను వెలువరించినప్పటికీ.. వాటిని స్పీకర్ పట్టించుకోలేదన్నారు. అసలు విషయం ఎమ్మెల్యేల అనర్హత గురించి కాగా, స్పీకర్ దానిని పట్టించుకోనేలేదని చెప్పారు. మహారాష్ట్ర ప్రజలు.. ఈ ద్రోహుల శివసేనను ఎన్నటికీ అంగీకరించరన్నారు. ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టుకు వెళ్లాలని శరద్‌పవార్ సూచించారు.

టార్గెట్ 400



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ లక్ష్యమిదే!

» 2019లో ఓడిన 164 సీట్లపై గురి

» జాతీయ ప్రధాన కార్యదర్శులతో జేపీ నడ్డా వ్యూహాత్మక చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 10: లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు చోట్ల ఘనవిజయం సాధించిన బీజేపీ.. ఇక అసలు టార్గెట్‌పై గురిపెట్టింది. 543 స్థానాల లోక్‌సభలో ఈ దఫా 400 సీట్లు గెలవాలన్న బృహత్తర లక్ష్యం పెట్టుకుంది. ముఖ్యంగా గత ఎన్నికల్లో ఓడిపోయిన, తక్కువ మెజారిటీతో గెలిచిన 164 లోక్‌సభ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. గత రెండేళ్లుగా కేంద్ర మంత్రులను, పార్టీ నేతలను ఆయా నియోజకవర్గాలకు పంపించి.. క్షేత్ర స్థాయి వాస్తవాలను తెలుసుకుంది. పార్టీ అభ్యర్థులు గెలిచే అవకాశం లేని చోట్ల విపక్ష ఎంపీలను, నాయకులను చేర్చుకోవడం ద్వారా బలపడాలని నిశ్చయించింది. ఇందు కోసం ప్రత్యేకంగా చేరికల కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే నేతృత్వం వహిస్తారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్, మన్‌సుఖ్ మాండవీయ కూడా పాల్గొన్నారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ వర్చువల్‌గా హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కీలక బాధ్యతలను ప్రధాన కార్యదర్శులకు అప్పగించారు. ఎన్నికలకు పార్టీ తరఫున విజన్ డాక్యుమెంట్ రూపొందించే బాధ్యతను రాధామోహన్‌దాస్ అగర్వాల్‌కు అప్పగించారు. ఎన్నికల ప్రచారం, పబ్లిసిటీ సంబంధమైన అంశాలను సునీల్ బన్సల్, ఇతర ప్రధాన కార్యదర్శులు చూస్తారు. ప్రచార ప్రణాళికకు సంబంధించి కేంద్ర మంత్రులు, సీనియర్ నేతలు, రాష్ట్ర శాఖలతో సమన్వయం చేసుకునే బాధ్యతను కైలాస్ విజయవర్గీయ, బండి సంజయ్‌కుమార్, తరుణ్ చుగ్‌లకు కట్టబెట్టారు.

అధిక స్థానాల్లో బరిలోకి..

అత్యధిక స్థానాల్లో పోటీచేయడంతో పాటు 50% ఓట్లు సాధించాలని బీజేపీ నాయకత్వం ఇంకో లక్ష్యం పెట్టుకుంది. గత ఎన్నికల్లో 543 స్థానాలకు గాను బీజేపీ 436 చోట్ల పోటీచేసింది. 303 స్థానాల్లో విజయం సాధించింది. కాగా, 1984 తర్వాత ఏ పార్టీ కూడా 400 మార్కును దాటలేదు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం ప్రధాని రాజీవ్‌గాంధీ సారథ్యంలో జరిగిన ఎన్నికల్లో సానుభూతి పవనాలు వీయడంతో కాంగ్రెస్ 514 సీట్లకు గాను 404 చోట్ల విజయం సాధించింది.

హమాస్..మాకొద్దంటే వద్దు..!

తేల్చి చెబుతున్న గాజా వాసులు.. అరబ్ బారోమీటర్ సర్వేలో వెల్లడి



ఆహారం కోసం గాజావాసుల పాట్లు

ఇంతకాలం హమాస్ సర్కారుకు మద్దతుగా నిలిచిన గాజావాసుల్లో ఆ ఉగ్ర సంస్థపై విశ్వాసం సన్నగిల్లుతోంది. హమాస్ పాలన తమకు వద్దంటే వద్దని వారు తేల్చిచెబుతున్నారు. వెస్ట్‌బ్యాంక్, గాజా కేంద్రాలుగా పనిచేస్తున్న 'అరబ్ బారోమీటర్' అనే పరిశోధన సంస్థ నిర్వహించిన సర్వే ఫలితాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. అక్టోబరు 7 ఇజ్రాయెల్‌పై హమాస్ ముప్పేట దాడి జరిపినప్పుడు కూడా గాజా వాసుల అభిప్రాయాలను ఈ సంస్థ తెలుసుకుంది. అప్పట్లో హమాస్ దాడులను 72% మంది గాజావాసులు సమర్థించారు. అయితే, ఇటీవల మరోమారు సర్వే నిర్వహించగా.. హమాస్ మద్దతుదారుల సంఖ్య 44శాతానికి పడిపోయింది. గాజాలో ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమయ్యాక.. పౌరులను హమాస్ పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఆపరేషన్ 'అసెస్‌మెంట్ మిషన్': బ్లింకన్

గాజా పౌరులను తిరిగి ఉత్తరాదికి తరలించేందుకు ఆపరేషన్ 'అసెస్‌మెంట్ మిషన్'ను ప్రారంభిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఆపరేషన్‌ను ఐరాస నేతృత్వంలో చేపడతామన్నారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే.. గాజాలో అమెరికా రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, పౌరులు ఉత్తరాదికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. గాజాలో శాంతి నెలకొనేలా అమెరికా చర్యలు తీసుకుంటోందని వివరించారు.

(సెంట్రల్ డెస్క్)

కాళేశ్వరంపై కొనసాగుతున్న దర్యాప్తు

రెండో రోజూ ముమ్మరంగా తనిఖీలు.. ఫైళ్లు, హార్డ్‌డిస్కులు పరిశీలించిన అధికారులు

» మరోమారు మేడిగడ్డ బ్యారేజీ సందర్శన

» కుంగుబాటుపై నమోదైన ఎఫ్ఐఆర్ ప్రతి సేకరణ

» కాళేశ్వరం ఈఎన్సీ క్యాంప్ ఆఫీసులో ముగిసిన తనిఖీలు.. ఫైల్స్, డాక్యుమెంట్లు హైదరాబాద్‌కు

» అవినీతిపై సమాచారం ఉంటే అధికారులకు అందించాలి : ప్రజలకు మంత్రి పొన్నం పిలుపు

» కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి బినామీ అని ఆరోపణ

మహదేవపూర్‌రూరల్/మహదేవపూర్/తిమ్మాపూర్/కరీంనగర్ అర్బన్/హైదరాబాద్, జనవరి 10: కాళేశ్వరం ప్రాజెక్టు కు సంబంధించిన కీలక ఫైళ్ల తనిఖీ రెండోరోజూ కొనసాగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవా రం పలు ఫైళ్లను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలోని పలు కీలక ఫైళ్లతోపాటు కంప్యూటర్ల హార్డ్‌డిస్కులలోని డాటాను పరిశీలించారు. ఉదయం నుంచి సబ్‌డివిజన్ కార్యాలయంలోనే ఉండి తనిఖీలు జరిపిన అధికారులు సాయంత్రం మరోమారు మేడిగడ్డ బ్యారేజీ కార్యాలయానికి వెళ్లి సోదాలు చేశారు. బ్యారేజీ, పంప్‌హౌస్ నిర్మాణాల్లో అవకతవకలకు సంబంధించిన ఫైళ్ల కోసం వారు అన్వేషిస్తున్నట్లు తెలిసింది. బ్యారేజీ కుంగిన అంశానికి సంబంధించి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలపైనా ఆరాతీసి ఎఫ్ఐఆర్ కాపీని సేకరించినట్లు సమాచారం. తనిఖీలకు సంబంధించి వివరాల్ని బహిర్గతం చేయడంలేదు. విచారణలో పూర్తి గోప్యత పాటిస్తున్నారు. బ్యారేజీ, పంప్‌హౌస్ నిర్మాణాల తీరుపై లోతై న విచారణ జరుగుతోందని, పూర్తయ్యే సరికి మరోరోజు పట్టే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. మరోవైపు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో కాళేశ్వరం ఈఎన్సీ క్యాంప్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు బుధవారం ముగిశాయి. కాళేశ్వరం, మేడిగడ్డకు సంబంధించిన పనుల డాక్యుమెంట్లను, ఫైళ్లను అధికారులు పరిశీలించి అవసరమైన వాటిని సీజ్ చేసి తమ వెంట హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. తనిఖీలప్పుడు ఉద్యోగులనే లోపలికి అనుమతించారు. మీడియాకు ఏ సమాచారం అందించలేదు.



కాళేశ్వరం ఈఎన్సీ క్యాంప్ ఆఫీసులో సీజ్ చేసిన ఫైళ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్న సిబ్బంది

బీఆర్ఎస్‌కు దడ పుట్టింది: పొన్నం

కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ అనగానే బీఆర్ఎస్‌కు దడ పుట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టులో అవినీతిపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని, ఇప్పటికే జ్యుడీషియల్ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని గుర్తు చేశారు. ప్రాజెక్టులో అక్రమాలకు సంబంధించి సమాచారం ఏమైనా ఉంటే ప్రజలు విజిలెన్స్ అధికారులకు అందించాలని కోరారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా బీఆర్ఎస్‌ను కాపాడేందుకు బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఆయన కేసీఆర్‌కు బినామీ అని ఆరోపించారు. సరితకు జెన్‌కో ఉద్యోగం విషయంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్ సచ్చీలుడే అయితే, తన మీద వచ్చిన ఆరోపణలపై పోలీసులకు ఫిర్యాదు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. జెన్‌కోతోపాటు ఇతర ప్రభుత్వశాఖల్లో అక్రమంగా ఉద్యోగం పొందినవారు వెంటనే ఉద్యోగాలు వదిలిపెట్టి వెళ్లాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ అక్రమాలపై చర్యలు చేపడతామని తెలిపారు. మేడిగడ్డ కుంగుబాటు, అక్రమాల పై ప్రభుత్వం విచారణకు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో అన్నారు.

'అవినీతి'పై చర్యలకు సిద్ధం..!

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ రాకుండా శక్తిమంతమైన కౌంటర్లు వేసే దర్యాప్తు అధికారుల కొరత కొనసాగుతోంది. దీనికి తోడు.. శాంతిభద్రతలతో ఏమాత్రం సంబంధం లేని టీఎస్ఎస్‌పీ, సీపీఎల్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లను డిప్యూటేషన్‌పై పని చేయిస్తున్నారు. అవినీతి అధికారులపై పక్కా సమాచారం అందినా.. పకడ్బందీగా రెక్కీ వేయించేందుకు కూడా హోంగార్డులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో.. ఏసీబీలో పూర్తిస్థాయి సిబ్బందిని భర్తీ చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ శాఖకు సరిపడా వాహనాలను సమకూర్చేందుకు సిద్ధమయ్యారు. శాంతిభద్రతల విభాగంలో.. దర్యాప్తు నైపుణ్యం ఉన్న కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు.. సిటీ టాస్క్‌ఫోర్స్‌లో సమర్థంగా పనిచేసినవారిని ఏసీబీలో నియమించాలని నిర్ణయించారు. గతంలో ఏసీబీలో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, డీఎస్పీ స్థాయి అధికారుల చిట్టాను సిద్ధం చేసి, వారిని తిరిగి ఈ విభాగంలో నియమించే దిశలో చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. విజిలెన్స్ విషయంలోనూ ఇలాంటి కసరత్తే జరుగుతోంది. ఖాళీల లెక్క తీసి, పూర్తిస్థాయి సిబ్బంది నియామకాన్ని జరుపుతున్నారు. దీంతో.. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తు ఇప్పుడు వేగం పుంజుకుంది. దాంతో.. కీలక వ్యక్తుల అరెస్టులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గొర్రెల పంపిణీల్లో గోల్‌మాల్, ఫైళ్ల మాయంపై..

గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు మొదలైంది. పశుసంవర్ధక శాఖలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు, మరికొందరు రూ.2.10 కోట్లకు పైగా గోల్‌మాల్ చేశారంటూ బాధితులు సైబరాబాద్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కేసు తీవ్రత నేపథ్యంలో ఇటీవలే ఏసీబీ రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణ చేపట్టిన ఏసీబీ త్వరలోనే గోల్‌మాల్ వ్యవహారంలో వాస్తవాలు నిగ్గుతేల్చే పనిలోపడింది. సైబరాబాద్‌లో అందిన ఫిర్యాదే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అక్రమాలను వెలికితీసేదిశలో అడుగులు వేస్తోంది. ఈ కేసుతోపాటు పశుసంవర్ధక శాఖలో ఫైళ్లు మాయం కావడంపైనా ఏసీబీ దృష్టి సారించనుంది.

మేడిగడ్డపై సమాంతర దర్యాప్తు!

ప్రస్తుతం విజిలెన్స్ విచారణ జరుపుతున్న మేడిగడ్డ బ్యారేజ్ వ్యవహారంలోనూ త్వరలోనే ఏసీబీ దర్యాప్తు చేపట్టనుంది. ఈ కేసులో భాగంగా స్వాధీనం చేసుకున్న ఫైళ్లను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. విజిలెన్స్ నివేదిక, ప్రభుత్వ పరిశీలన అనంతరం తదుపరి ఆదేశాల మేరకు ఏసీబీ రంగంలోకి దిగనుంది.



గద్దర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి

రాష్ట్ర సాధనలో గద్దర్‌ది కీలక పాత్ర: భట్టి

అల్వాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తన పాట, ఆట ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమికను పోషించిన వ్యక్తి ప్రజాగాయకుడు గద్దర్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర సాధనకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. బుధవారం భట్టి విక్రమార్క అల్వాల్ మహాబోధి పాఠశాల ఆవరణలో ఉన్న గద్దర్ ఘాట్‌ను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గద్దరు నివాసానికి వెళ్లి ఆయన సతీమణి విమలా గద్దర్‌తో పాటు కూతురు వెన్నెల, కుమారుడు సూర్యంతో ప్రత్యేకంగా మాట్లాడారు. కుటుంబానికి అండాగా ఉంటామని భరోసా ఇచ్చారు. గద్దర్ బతికి ఉన్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని తపించారని అన్నారు.

ఈ నెలాఖరుకల్లా రైతుబంధు: తుమ్మల

కూసుమంచి, జనవరి 10: ఈనెలాఖరు కల్లా అన్నదాతల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమవుతాయని, ఇప్పటికే రాష్ట్రంలో 30లక్షలమంది రైతులకు పెట్టుబడి సాయం అందిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచిలో జరిగిన కాంగ్రెస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళానికి రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ తలతాకట్టు పెట్టయినా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన జరుగుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, దానిని కచ్చితంగా బయటపెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రభుత్వం విజిలెన్స్ అప్రమత్తం చేసి ఫైళ్లను స్వాధీనం చేసుకుందన్నారు.

ఒంటరిగా కన్నీరు పెట్టుకున్నా..: పొంగులేటి

» నా వాళ్లను గత ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని వ్యాఖ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 10: "గతేడాది ఇదే సమయంలో నాతో పాటు.. నా వెంట నడిచిన, నన్ను నమ్ముకున్న వారందరినీ గత ప్రభుత్వం ఇబ్బందులు పెట్టింది. అయినా బాధను దిగమింగి కార్యకర్తలకు ధైర్యం చెప్పి వారికి అండగా నిలిచా.. ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నా.. అదంతా కార్యకర్తల ఎదుట చెబితే వారు ఎక్కడ ధైర్యం కోల్పోతారోనని ఒంటరిగా కన్నీరు పెట్టుకున్న రోజులున్నాయి.." అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలో జరిగిన ఆత్మీయ, అభినందన నిరుద్యోగుల సభకు హాజరైన ఆయన భావోద్వేగానికి గురయ్యారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులు వివక్షకు గురయ్యారని, వారంతా కష్టపడి పని చేసి ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

» కార్మిక శాఖ నూతన కమిషనర్ కృష్ణ ఆదిత్య

చిక్కడపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ నూతన కమిషనర్ ఎస్.కృష్ణ ఆదిత్య తెలిపారు. బుధవారం ఆయన ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక భవనంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాదేశాల మేరకు పనిచేస్తానని, కార్మికుల హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తుల అటాచ్‌కు కసరత్తు

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రీ-లాంచ్ ప్రాజెక్టుల పేరుతో వేల మంది వినియోగదారుల నుంచి రూ.వందల కోట్లు కొల్లగొట్టిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు హైదరాబాద్ సీసీఎస్ కసరత్తు చేస్తోంది. 3వేల మందికి పైగా బాధితులున్న భారీ ఆర్థిక మోసం కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సీసీఎస్ పోలీసులు ఈ కేసు నిందితులు ఏపీ, తెలంగాణల్లో కొనుగోలు చేసిన భూములు, ప్రారంభించిన ప్రాజెక్టులు, వెంచర్ల చిట్టాను సేకరించారు. వీటిని అటాచ్ చేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. సీసీఎస్ కూడా వీలైనంత త్వరగా ఈ కేసులో చార్జ్‌షీట్‌ను ఫైల్ చేసి, కోర్టు అనుమతితో ఆస్తులను అమ్మి, బాధితులకు ఆ సొమ్ము అందేలా చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇదే తరహాలో జరిగిన అగ్రిగోల్డ్ కేసును దర్యాప్తు చేసిన ఏపీ సీఐడీ బృందం సలహాలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

సాగర్, శ్రీశైలంను అప్పగించండి!

» తెలుగు రాష్ట్రాలను కోరనున్న కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులతోపాటు 15 కాంపోనెంట్లను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చేతికి అప్పగించాలని కేంద్ర జలశక్తి శాఖ రెండు తెలుగు రాష్ట్రాలను కోరనుంది. దీనిపై చర్చించేందుకుగాను కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీ ఈ నెల 15న న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమావేశం కానున్నారు. ఈ భేటీకి హాజరు కావాల్సిందిగా కోరుతూ బుధవారం తెలుగు రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం లేఖ రాసింది. రెండు ప్రాజెక్టులు, 15 కాంపోనెంట్లను బోర్డు చేతికి అప్పగించడం, నాగార్జునసాగర్ డ్యామ్ ప్రస్తుత పరిస్థితి, శ్రీశైలం, సాగర్ డ్యామ్‌ల ఆపరేషనల్ ప్రొటోకాల్, సకాలంలో కృష్ణా బోర్డుకు నిధుల విడుదల తదితర అంశాలపై భేటీలో చర్చించనున్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులను సహించం: సజ్జనార్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తోన్న ఆర్టీసీ సిబ్బందిపై విచక్షణరహితంగా దాడులకు దిగడం అసమంజసమని టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లో మంగళవారం బైకర్ నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమయ్యారని అయినా తన తప్పేం లేదన్నట్టు తిరిగి పల్లెవెలుగు డ్రైవర్‌పై దాడి చేశారని పేర్కొన్నారు. డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ విచక్షణరహితంగా కొట్టారని దీనికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను సజ్జనార్ ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఇలాంటి ఘటనలు సిబ్బందిలో ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇలాంటి దాడులను సహించేది లేదని స్పష్టం చేశారు.

నేవీ రేడార్ నిర్మాణానికి పచ్చజెండా

పూడూరులో ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం

రిజర్వ్ ఫారెస్టులో 2,934 ఎకరాలు ఇస్తామన్న సీఎం.. అంతకుముందు రేవంత్‌తో నేవీ ఆఫీసర్లు భేటీ

2,500 కోట్లతో రేడార్‌ను నిర్మించనున్న నౌకాదళం.. త్వరలోనే రేడార్ నిర్మాణ పనులు : సీఎంవో

పరిగి/హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలోని పూడూరులో భారత నౌకాదళం(నేవీ) నిర్మించతలపెట్టిన అత్యంత తక్కువ ఫ్రీక్వెన్సీ(ఈఎల్ఎఫ్) రేడార్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారు. రేడార్ నిర్మాణానికి పూడూరులో రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న 2,934 ఎకరాల భూములను ఇవ్వడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారమందించేందుకు సానుకూలత ప్రకటించారు. దీంతో, 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్మాణానికి ముందడుగు పడినట్లైంది. విశాఖపట్నంలోని ఈస్టర్న్ నావల్ కమాండ్ రూ.2,500 కోట్లతో ఈ రేడార్‌ను ఏర్పాటు చేయనుంది. పరిగి నియోజకవర్గంలోని దామగుండం ప్రాంతంలో పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా అటవీ ప్రాంతంలో ఇండియన్ నేవీ ప్రాజెక్టులోని లో ఫ్రీక్వెన్సీ రేడార్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్టు సీఎంవో కార్యాలయం తెలిపింది. బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేవీ కమాండర్ కార్తీక్ శంకర్ బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌తో భేటీ అయింది. ఈ సందర్భంగా లో ఫ్రీక్వెన్సీ రేడార్ స్టేషన్ గురించి కమాండర్ కార్తీక్ సీఎంకు వివరించారు. ఈ కేంద్రం ఏర్పాటుతో పరిగి ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఫిబ్రవరిలో నేవీ అధికారులు రేడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేయబోతున్నారని రామ్మోహన్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నేవీ అధికారులు

కొత్త విద్యుత్తు విధానం

(మొదటిపేజీ తరువాయి)

పెంచడానికి, మరిన్ని విద్యుత్తు సంస్థలను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న సంస్థల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో పాటు విద్యుత్తు దుర్వినియోగాన్ని అరికట్టాలని, నాణ్యతను పెంచాలని సూచించారు. నిరంతర విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అవాంతరాలు రాకుండా ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు.

కరెంటు కొనుగోళ్ల లెక్కలు తేల్చండి..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి ఇప్పటి దాకా డిస్కమ్‌లకు, విద్యుత్తు ఉత్పత్తి సంస్థలకు మధ్య జరిగిన ఒప్పందాలు, వాటిలోని అంశాలకు సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అధిక ధరకు కరెంట్ కొనుగోళ్ల వల్ల విద్యుత్తు సంస్థలకు కలిగిన నష్టాలను వెలికి తీయాలన్నారు. ఛత్తీస్‌గఢ్‌తోపాటు పవర్‌గ్రిడ్‌తో జరిగిన ఒప్పందాలు, స్వల్ప, మధ్యకాలిక కరెంట్ కొనుగోళ్లతో జరిగిన నష్టం, ఒక్కో యూనిట్‌ను ఎంత ధరకు కొన్నారు? అప్పట్లో మార్కెట్‌లో ఎంత ధరకు కరెంట్ అందుబాటులో ఉంది? వంటి వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. కాగా, రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి, వివిధ విద్యుత్తు కంపెనీల నుంచి కరెంటు కొనుగోళ్లు, విద్యుత్తు వినియోగం, డిస్కమ్‌ల పనితీరు, ఆర్థిక పరిస్థితిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. గృహజ్యోతి పథకం కింద గృహావసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తే ఏటా రూ.4 వేల కోట్ల దాకా భారం పడుతుందని నివేదించారు. దీంతో వివిధ రాష్ట్రాల్లో గృహ వినియోగదారులకు ఉచితంగా కరెంట్ ఇవ్వడానికి అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. అధ్యయనం అనంతరం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బహిరంగ మార్కెట్లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్తు లభిస్తుందో, ఆ కంపెనీల నుంచే కొనుగోలు చేయాలని నిర్దేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ , సీఎం ఓఎస్డీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై సమీక్ష వాయిదా..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో పాటు వివిధ ప్రాజెక్టులపై బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన సమీక్ష గురువారానికి వాయిదా పడింది. సమీక్ష కోసం అధికారులు సచివాలయానికి రాగా.. విద్యుత్తు రంగంపై సీఎం సుదీర్ఘ చర్చలో ఉండిపోయారు. దీంతో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులపై సమీక్ష గురువారం ఉంటుందని అధికారులకు సీఎం కార్యాలయం సమాచారం ఇచ్చింది.



సచివాలయంలో అమెజాన్ ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.
చిత్రంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

13 దేశాల ప్రతినిధులకు సీఎం ఆతిథ్యం

కుతుబ్ షాహీ టూంబ్ వద్ద విందు

తెలంగాణలో పెట్టుబడులు పెట్టి పారిశ్రామికంగా అభివృద్ధికి తోడ్పడాలని సీఎం రేవంత్ రెడ్డి పదమూడు దేశాలకు చెందిన ప్రతినిధుల బృందాన్ని కోరారు. వారికి సీఎం బుధవారం రాత్రి కుతుబ్ షాహీ టూంబ్ వద్ద ఆతిథ్యం ఇచ్చారు. అమెరికా, ఇరాన్, తుర్కియే, యూఏఈ, యూకే, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. వారికి స్వాగతం పలికిన సీఎం తెలంగాణలో తమ ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి నేతల ఆశయాలను, మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ స్ఫూర్తితో సమానత్వం, పారదర్శకతతో తమ ప్రభుత్వం పని చేస్తుందని విదేశీ ప్రతినిధుల బృందానికి స్పష్టం చేశారు. ఆరు హామీలతో సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించనుందని తెలిపారు. యువత భవిష్యత్తుకు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతి కుమారి, జయేష్ రంజన్, హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి స్నేహజ తదితరులు పాల్గొన్నారు.



తన వాహనానికి రాహుల్ యాత్ర స్టిక్కర్ అతికించిన సీఎం రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత వాహనానికి రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర స్టిక్కర్‌ను స్వయంగా అతికించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఈ నెల 14 నుంచి ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ న్యాయ యాత్ర ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. దానికి మద్దతుగా బుధవారం తన నివాసం వద్ద సొంత వాహనానికి సీఎం స్వయంగా స్టిక్కర్‌ను అతికించారు. తద్వారా రాష్ట్రంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు రాహుల్ న్యాయ యాత్ర స్టిక్కర్‌ను తమ వాహనాలకు అతికించి మద్దతు తెలియజేయాలంటూ సంకేతం ఇచ్చారు.

తొలి హామీని నిలబెట్టుకున్న మంత్రి కోమటిరెడ్డి

» 100 కోట్లతో నల్లగొండలో రోడ్ల విస్తరణ

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన తొలి హామీని నిలబెట్టుకున్నారు. నల్లగొండలో ప్రమాదకరంగా ఉన్న నాలుగు రహదారుల విస్తరణ ఫైల్ మీద మంత్రి బుధవారం సంతకం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 22 ద్వారా పరిపాలనా పరమైన ఉత్తర్వులిచ్చింది. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో కిలోమీటరు రహదారి, అలాగే నల్లగొండ నుంచి ముషంపల్లి వరకు 12 కి.మీ, ముషంపల్లి నుంచి కన్నెకల్ వయా ధర్మపురం వరకు 6.2 కి.మీ, ముకుందాపురం నుంచి తిప్పర్తి వరకు 8.6 కి.మీ రోడ్లను రెండు వరుసలుగా అభివృద్ధి చేయనున్నారు.

ఆదిలాబాద్ ఎంపీ కాంగ్రెస్ టికెట్ ఐఆర్ఎస్ అధికారికి?

» ప్రకాశ్ రాథోడ్‌తో మంత్రి సీతక్క భేటీ



నిర్మల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క.. ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీస్) అధికారి ప్రకాశ్ రాథోడ్‌తో బుధవారం భేటి అయ్యారు. నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క..నిర్మల్‌లోని ప్రకాశ్ రాథోడ్ నివాసానికి వెళ్లి మరీ ఆయన్ను కలిశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ఈ భేటీ తీవ్ర చర్చనీయాంశమైంది. గిరిజన లంబాడా సామాజిక వర్గానికి చెందిన ప్రకాశ్ రాథోడ్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. రాజకీయాల పట్ల తనకు ఉన్న ఆసక్తిని ఆయన ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానానికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క ఆయనతో సమావేశమయ్యారని చర్చ జరుగుతోంది.

6 హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం: సీతక్క

రాజకీయం అంటే ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యే ఉండాలని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణంతో ప్రభుత్వానికి ఆదరణ పెరిగిందన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాల ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

జనరల్ అభిప్రాయం, ముఖ్యమంత్రి రిమార్కులను పంపించమని ప్రభుత్వాన్ని గవర్నర్ కార్యాలయం కోరింది. పేపర్ లీకేజీ వంటి అంశాలపై సిట్ దర్యాప్తు కొనసాగుతుండడంతో ప్రభుత్వ అభిప్రాయాన్ని గవర్నర్ కోరారు. తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ ప్రభుత్వం ఈ నెల 9న గవర్నర్‌కు ఫైల్ పంపించింది. దాన్ని పరిశీలించిన గవర్నర్ 10న రాజీనామాలను ఆమోదించారు. బయట ప్రచారం జరుగుతున్నట్టు ఈ రాజీనామాల్లో ఎలాంటి జాప్యం జరగలేదని గవర్నర్ కార్యాలయం స్పష్టం చేసింది. ప్రభుత్వం నుంచి అభిప్రాయం వచ్చిన ఒక్క రోజులోనే నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. నిరుద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు వివరించింది. కాగా, గత ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగాల నియామకాల్లో తీవ్ర గందరగోళం ఏర్పడిన విషయం తెలిసిందే. ముఖ్యంగా గ్రూపు-1 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ప్రశ్నపత్రం లీకైంది. ఇదే కాకుండా ఇతర పోస్టుల పరీక్షల పేపర్లు కూడా లీకైనట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాంతో గ్రూపు-1 పరీక్షతో పాటు ఇతర పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలను కూడా రద్దు చేయాల్సి వచ్చింది. మరికొన్ని పోస్టుల పరీక్షలను వాయిదా వేశారు. దాంతో నియామకాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఈ విషయంపై నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులు రాజీనామా చేయాలంటూ ఒత్తిడి పెరిగింది. దీంతో చైర్మన్, మరో ముగ్గురు సభ్యులు తమ రాజీనామాలు సమర్పించారు.

చైర్మన్‌గా ఐఏఎస్ లేదా ఐపీఎస్!

టీఎస్‌పీఎస్సీ కొత్త చైర్మన్‌గా ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఉద్యోగ నియామకాలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఏడాది కాలంలో నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం టీఎస్‌పీఎస్సీ పగ్గాలను గట్టి అధికారులను అప్పగించాలని భావిస్తోంది. ఐపీఎస్ లేదా ఐఏఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. సాధారణంగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ లేదా సభ్యుల పదవిలో ఒకసారి నియామకం అయితే ఆరేళ్ల పాటు కొనసాగడానికి అవకాశం ఉంటుంది. ఈ పదవుల్లో కొనసాగడానికి గరిష్ఠ వయసు 62 ఏళ్లు. ప్రస్తుతం రాష్ట్ర సర్వీసులో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ఒక సమర్థ అధికారిని ఈ పోస్టు కోసం ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ బాధ్యతలు చేపట్టాలంటే ఇప్పుడున్న పోస్టుకు (ఐఏఎస్ లేదా ఐపీఎస్ ఏదైనా) రాజీనామా చేయాల్సి ఉంటుంది. టీఎస్‌పీఎస్సీలో చైర్మన్, మరో 10 మంది సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం అరుణ కుమారి, సుమిత్ర అనే మరో ఇద్దరు సభ్యులు ఉన్నారు. వీరు రాజీనామా చేయకుండా కొనసాగితే కొత్తగా మిగతా 8 మంది సభ్యులను, చైర్మన్‌ను ప్రభుత్వం నియమించడానికి అవకాశం ఉంది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల్లో 50 శాతం పోస్టులకు సివిల్ సర్వీసెస్‌లో పనిచేసిన వారిని, మిగిలిన 50 శాతానికి సైన్స్, టెక్నాలజీ, అకడమిక్ తదితర రంగ నిపుణులను పరిగణనలోకి తీసుకోనున్నారు. సివిల్ సర్వీసెస్‌లో కనీసం పదేళ్ల పాటు పనిచేసి ఉండాలనే నిబంధన ఉంది. ఈ పోస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన వారి జాబితాను గవర్నర్‌కు పంపిస్తే, గవర్నర్ ఆమోదం తెలిపే విధానం అమలులో ఉంది.

యూపీఎస్సీ తరహాలో...

టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ మాదిరిగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లిన సందర్భంలో యూపీఎస్సీ చైర్మన్‌తో సమావేశమై చర్చించారు. అధికారులు కూడా కేరళ సహా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి వచ్చారు. దేశంలో ప్రతీఏడాది షెడ్యూల్ ప్రకారం ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు ఉద్యోగాలను యూపీఎస్సీ భర్తీ చేస్తోంది. ఈ నియామకాల విషయంలో పెద్దగా వివాదాలు కానీ, గందరగోళ పరిస్థితి కానీ తలెత్తడం లేదు. దాంతో యూపీఎస్సీ విధానాలను రాష్ట్రంలో అమలుపరచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు ఆ స్థాయి సమర్థత కలిగిన అధికారులను నియమించాలని భావిస్తోంది.

త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీ

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. ప్రజలు ఆశించిన విధంగా మార్పు తెచ్చి చూపిస్తాం' అని శ్రీధర్ బాబు అన్నారు. పరిశ్రమ రంగంలోనూ మార్పు వస్తుందని, మళ్లీ నూతనోత్తేజం తీసుకొస్తామని తెలిపారు. ప్లాన్ 2050 గురించి సీఎం రేవంత్ రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. హైదరాబాద్ ఈ ప్రపంచానికి కొవిడ్ వ్యాక్సిన్ ఇచ్చేలా అభివృద్ధి చెందిందని, అభివృద్ధి చెందిన దేశాలు హైదరాబాద్‌ను ఫార్మా పరిశ్రమ హబ్‌గా గుర్తిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో విస్సెల్ తయారై ఇజ్రాయెల్‌కు ఎగుమతి అవుతోందంటే పారిశ్రామిక రంగం ఎంత అభివృద్ధి చెందిందో తెలుస్తుందన్నారు. పరిశ్రమలకు నూతనోత్తేజాన్ని తీసుకురాబోతున్నామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. చైనాకు మించి మనమూ అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అర్బన్ క్లస్టర్.. రీజినల్ క్లస్టర్.. సెమీ అర్బన్ క్లస్టర్.. ఇలా మూడు పద్ధతుల్లో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించబోతున్నామన్నారు. డ్రైపోర్ట్‌పై త్వరలో కీలక నిర్ణయం తీసుకోనున్నామని, నల్గొండతోపాటు కనెక్ట్ టు ఓల్డ్ ముంబై హైవే ప్రాంతాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. అదానీ కంపెనీ వ్యవహారంలో కొందరు కావాలని కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల పారిశ్రామికవేత్తలకు అవకాశం రావాలన్నది కాంగ్రెస్ ఉద్దేశమని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ధ్వజమెత్తారు.

ఏరోస్పేస్ రంగానికి స్వర్గధామంగా..

ఏరో స్పేస్ రంగానికి తెలంగాణ స్వర్గధామమని, దేశంలోనే ఇక్కడ శక్తివంతమైన ఏరో స్పేస్ ఏకోసిస్టమ్ ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. శంషాబాద్‌లోని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సెంటర్‌లో భారతీయ నేవీ కోసం అదానీ సంస్థ దేశీయంగా తయారు చేసిన ద్రిష్టి 10 స్టార్ లైనర్ మానవరహిత ఏరియల్ వాహనం (యూఏవీ) ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీధర్ బాబు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏరో స్పేస్, విమానయాన, అంతరిక్ష పరిశ్రమల రంగానికి రాష్ట్రం ముఖ్యమైన కేంద్రమని తెలిపారు. రక్షణ పరికరాల తయారీ కేంద్రం ఏర్పాటుకు అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకుని కేవలం 10 నెలల్లో యూఏవీల తయారీ కోసం మొదటి కార్బన్ ఏరోస్ట్రక్చర్‌ను నెలకొల్పిందని తెలిపారు. అదానీ నెలకొల్పే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, చీఫ్ ఆఫ్ నావెల్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్, భారతీయ ఆర్మీ ఏవియేషన్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ అజయ్‌కుమార్ సూరి, అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రెసిడెంట్, సీఈవో ఆశిష్ రాజ్ వన్షి, అదానీ ఎయిర్‌పోర్ట్స్ ప్రమోటర్, డైరెక్టర్ జీత్ అదానీ పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు.. స్కూలు పిల్లలే టార్గెట్

» యథేచ్ఛగా పాఠశాలల వద్దే సరఫరా

» కొత్తూర్‌లో విద్యార్థుల ప్రవర్తనపై టీచర్ల ఫిర్యాదు

» ముగ్గురికి బేడీలు..8 కిలోల చాక్లెట్లు సీజ్

శంషాబాద్/కొత్తూరు/హైదరాబాద్‌సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వాళ్లంతా స్కూలుకెళ్లే పిల్లలు..! కానీ, బడికొచ్చాక వారి ప్రవర్తనలో తేడాలుంటున్నాయి! కొందరు తూగుతూ.. తూలుతూ నిద్రలో జారుకుంటుంటే.. ఇంకొందరు వింతగా ప్రవర్తిస్తున్నారు..! నవ్వుతూ.. మత్తులో మునిగితేలుతున్నారు..! ఈ తేడాలను గమనించిన ఉపాధ్యాయులకు ఏమీ పాలుపోలేదు..! వారి దగ్గరకు వెళ్లి గమనించినా.. ఆల్కహాల్ లాంటి వాసనలేమీ లేవు. దాంతో.. విద్యాశాఖ అధికారులు, పోలీసులకు విషయం చెప్పారు. ఈ తతంగంపై నిఘా పెట్టిన శంషాబాద్ జోన్ ఎస్వోటీ పోలీసులు.. పిల్లలు తినే చాక్లెట్లలో గంజాయి ఉంటోందని, ఒక క్రమ పద్ధతిలో వారికి 'మత్తు'ను అలవాటు చేసి, కస్టమర్లను పెంచుకునే ఉద్దేశంతో ఒడిసాకు చెందిన ఓ ముఠా భారీ కుట్రను పన్నిందని గుర్తించారు. ముగ్గురు నిందితులకు బేడీలు వేసి, రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలను వెల్లడించారు. కొత్తూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొందరు విద్యార్థుల ప్రవర్తనలో తేడా రావడం.. వారు వింతగా ప్రవర్తిస్తుండడంతో హెడ్‌మాస్టర్ అంగూర్‌నాయక్ తమకు ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఆ తర్వాత ఎస్వోటీ, శాంతి భద్రతల పోలీసులు అలా వింతగా ప్రవర్తిస్తున్న విద్యార్థులపై నిఘా పెట్టినట్లు వివరించారు. "వింతగా ప్రవర్తిస్తున్న విద్యార్థులంతా చార్మినార్ గోల్డ్ అనే పేరుతో ఉన్న చాక్లెట్లు తింటున్నట్లు గుర్తించాం. ఒడిసాకు చెందిన వీరేంద్ర బొహ్రా, సోమనాథ్ బెహరా, సూర్యమణి సాహు అనే వ్యక్తులు నిర్వహిస్తున్న కిరాణా షాపులు, పాన్‌షాపుల్లో ఈ చాక్లెట్లను విక్రయిస్తున్నారు. దాంతో.. మంగళవారం జేపీ దర్గా రోడ్‌లో ఉన్న ఓ కిరాణా దుకాణంలో ఎస్వోటీ పోలీసులు తనిఖీలు చేశారు. అక్కడ గంజాయి చాక్లెట్లుండడాన్ని గుర్తించారు. 8 కిలోల గంజాయి చాక్లెట్లను సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాం" అని వివరించారు. గంజాయి చాక్లెట్లను నిందితులు రూ.10 నుంచి రూ.15కు ఒకటి చొప్పున విక్రయిస్తున్నారని, ఒడిసా నుంచి ఈ తరహా చాక్లెట్లను తెప్పిస్తున్నారని వెల్లడించారు. తొలుత విద్యార్థులకు గంజాయి చాక్లెట్లను అలవాటు చేసి.. ఆ తర్వాత ధరలు పెంచి విక్రయించాలనేది ఈ ముఠా ప్లాన్ అని తెలిపారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసి, నిందితుల వెనక ఉన్నవారినీ అరెస్టు చేస్తామన్నారు. డ్రగ్స్, గంజాయి విక్రేతలను పీడీ చట్టం కింద జైలుకు పంపుతామని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు.

ఏసీబీ వలలో అవినీతి చేపలు!

- నిర్మల్ జిల్లాలో కడెం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్..
- మంచిర్యాలలో పంచాయతీ రాజ్ ఏఈ, కార్యదర్శి పట్టివేత

ఖానాపూర్, బెల్లంపల్లి, జనవరి 10: నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో ఏసీబీకి అవినీతి చేపలు చిక్కాయి. వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు రైతు నుంచి లంచం తీసుకుంటుండగా నిర్మల్ జిల్లా కడెం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లను ఏసీబీ అధికారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన రైతు లసిట్టి రాజన్న తన 35 గుంటల భూమిని పట్టా చేసుకునేందుకు ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. పట్టా చేసేందుకు తహసీల్దార్ రాజేశ్వరి రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.9 వేలకు బేరం కుదుర్చుకున్నారు. రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అనంతరం డబ్బులు ఇవ్వడానికి సంబంధించి తహసీల్దార్‌ను బాధితుడు అడగ్గా డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్యకు ఇవ్వాలని సూచించారు. దీంతో చిన్నయ్యకు రైతు బుధవారం కార్యాలయంలో డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ను అరెస్టు చేశారు. కాగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పంచాయతీరాజ్ ఏఈ, కార్యదర్శి బుధవారం ఏసీబీకి పట్టుబడ్డారు. కొన్ని నెలల క్రితం పెర్కపల్లికి చెందిన రామగోని అశోక్ గౌడ్ గ్రామంలో క్రీడా మైదానంలో చేసిన మట్టి పనులకు రూ.1.50 లక్షల బిల్లు పెట్టాడు. బిల్లు ఇచ్చేందుకు ఏఈ పరంజ్యోతి రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో అశోక్‌గౌడ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏఈ ఉండగా అశోక్‌గౌడ్ వచ్చాడు. డబ్బులను పంచాయతీ కార్యదర్శి వీరబాబు ద్వారా ఏఈకి ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.

సంక్రాంతికి మరో 5 ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరో అయిదు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. కాచిగూడ- తిరుపతి, తిరుపతి- సికింద్రాబాద్, నాందేడ్- కాకినాడ టౌన్ మధ్య ఈ రైళ్లు నడుస్తాయని తెలిపారు.

ముస్లింల పట్ల మోదీ సర్కార్ ద్వేషం: అసదుద్దీన్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు ఉన్నత విద్యనభ్యసించి ప్రధాన జీవన స్రవంతిలో కలువడాన్ని మోదీ ప్రభుత్వం అంగీకరించడం లేదని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా మోదీ ప్రభుత్వానికి ముస్లింలపై ఉన్న ద్వేషం ప్రతి ఒక్కరికీ అర్థమవుతోందని ఆయన పేర్కొన్నారు. జాతీయ సంస్థ పేరుతో ముస్లిం యూనివర్సిటీకి మైనారిటీ హోదాను మోదీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందన్నారు.

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా చొక్కారావు?

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శిగా బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్న నియమితులైనట్లు సమాచారం. ఇటీవలే ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా మావోయిస్టులు తమ కార్యకలాపాలను సాగిస్తూ విస్తరణకు పాటుపడుతున్నారు. ఇప్పుడు తెలంగాణలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ఛత్తీస్‌గఢ్‌లో కొవిడ్ బారిన పడి 2021 జూన్ 21న మృతి చెందారు. ఆ స్థానంలో బడే చొక్కారావును ఎంపిక చేసినట్లు తెలిసింది.


ఐఈడీ పేలి మూడో తరగతి బాలికకు గాయాలు

- మావోయిస్టుల శిబిరంలో ఐదు రోజులుగా చికిత్స

చర్ల, జనవరి 10: మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందుపాతర పేలి మూడో తరగతి చదువుతున్న ఓ బాలిక, ఆమె తల్లి గాయపడ్డారు. అయితే, గాయాలపాలైన ఆ చిన్నారిని తమ శిబిరానికి తీసుకెళ్లిన మావోయిస్టులు ఐదు రోజులుగా చికిత్స అందిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా చేర్పాల్ రహదారిపై పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఐఈడీ మందుపాతర అమర్చారు. సునీత అనే బాలిక, ఆమె తల్లితో కలిసి ఆ రహదారిపై నడిచి వెళుతుండగా బాంబు పేలడంతో ఇరువురు గాయపడ్డారు. దీనిని గమనించిన మావోయిస్టులు సునీతను తమతో తీసుకెళ్లారు. సునీత ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని సమాచారం. ఇక, స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీత తల్లి పరిస్థితి కూడా నిలకడగా ఉందని తెలుస్తోంది.

మనోహర్‌రావుపై శాఖాపరమైన విచారణ!

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఎండీ బి.మనోహర్‌రావుపై సస్పెన్షన్ కొనసాగుతోందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అలాగే ఆయనపై శాఖాపరమైన విచారణకు సైతం ఆదేశించామని వెల్లడించింది. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న కోర్టు మూడు వారాల్లో శాఖాపరమైన విచారణను పూర్తిచేయాలని ఆదేశించింది. సస్పెన్షన్‌పై ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో పిటిషన్‌ను ముగిస్తున్నట్లు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అమల్లో ఉన్న కోడ్‌ను ఉల్లంఘించి అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో మనోహర్‌రావు తిరుమల వెళ్లారని ఆరోపణలు రావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. దీంతో తనను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేసే అధికారం ఈసీకి లేదని మనోహర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో సస్పెన్షన్‌పై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం తాజాగా తన నిర్ణయాన్ని వెల్లడించింది.



ప్రజాస్వామ్య పరిరక్షణకు 'జనగణమన అభియాన్'

పంజాగుట్ట, హైదరాబాద్ జనవరి10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలు, మత సామరస్యం ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా జనగణమన అభియాన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పౌర సమాజ ప్రతినిధులు ప్రకటించారు. 95870 40998 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. భారత్ జోడో అభియాన్ ద్వారా జనవరి 31 వరకు సోషల్ మీడియాతోపాటు సభలు, సమావేశాల ద్వారా ఈ ప్రచారం కొనసాగుతుందున్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జనగణమన అభియాన్ పౌర సమాజ ప్రజా చైతన్య ప్రచారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పౌరసమాజ ప్రతినిధులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ రమా మేల్కొటే, భారత్ జోడో అభియాన్ ప్రతినిధి జాహిద్ ఖాద్రీ, కిరణ్‌కుమార్ విస్సా, ముస్లిం సంఘాల జేఏసీ ప్రతినిధి సలీం పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న మతపరమైన ద్వేష పూరిత రాజకీయాలతో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ముప్పు పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. అందరికీ సమాన హక్కులు, సామాజిక న్యాయం ఆధారంగా దేశం ఉండాలని విశ్వసించే వారంతా తమ ప్రచారంలో పాల్గొనేలా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

'ఊయల'లో 15రోజుల పాప

- ప్రభుత్వాస్పత్రిలో వదిలివెళ్లిన గుర్తుతెలియని మహిళలు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 10: తల్లి ఒడిలో ఆడుకోవాల్సిన చిన్నారి అనాథలా మారింది. దాదాపు 15 రోజుల వయసున్న ఆ ఆడ శిశువును గుర్తు తెలియని మహిళలు ప్రభుత్వాస్పత్రిలో ఊయలలో వదిలి వెళ్లారు. ఖమ్మం జిల్లా సర్వజన ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పుట్టిన బిడ్డలను వద్దనుకున్న వారు తమ శిశువును అధికారుల సంరక్షణలో వదిలి వెళ్లేందుకు ప్రభుత్వాస్పత్రిలో ఆ ఊయలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ప్రకారం.. తెల్లవారుజామున ముగ్గురు మహిళలు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఊయల వద్దకు వచ్చి పసిపాపను ఊయలలో వదిలేసి వెళ్లిపోయారు. శిశువును గమనించిన ఆస్పత్రి సిబ్బంది అధికారులకు సమాచారమిచ్చారు. ఆస్పత్రి సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు చిన్నారిని అక్కున చేర్చుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి శిశువు పూర్తి ఆరోగ్యంతో ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. వారు చిన్నారిని శిశుగృహానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఐసీడీఎస్ అధికారులు ఫిర్యాదు చేశారు.

2 ఎమ్మెల్సీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ల జారీ

- 18 వరకు నామినేషన్ల స్వీకరణ .. ఒకటి బీసీ, మరోటి ఓసీకి ఇచ్చే చాన్స్
- గవర్నర్ కోటాలో ఒకటి కోదండరాంకు.. మరో సీటుకు జాఫర్ పేరు పరిశీలన!

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ సీట్లకు ఉప ఎన్నికల నోటిఫికేషన్లను అసెంబ్లీ కార్యాలయం గురువారం విడుదల చేయనుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ సూచన మేరకు రెండు సీట్లకూ విడివిడిగానే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నోటిఫికేషన్లనూ విడివిడిగానే జారీ చేయనున్నారు. ఈ నెల 29న పోలింగ్ జరగనుంది. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ నోటీస్ బోర్డులో రెండు నోటిఫికేషన్లనూ అంటించనున్నారు. ఈ నెల 18 వరకూ నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థిని.. పది మంది ఎమ్మెల్యేలు ప్రతిపాదించాల్సి ఉండడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకే ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. అయితే రెండు సీట్లకూ విడివిడిగా ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సభలో సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న అధికార కాంగ్రెస్‌కే రెండు ఎమ్మెల్సీ సీట్లూ దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.

మైనార్టీకి సీటు గవర్నర్ కోటాలోనే!

ఎన్నికలు జరగనున్న రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లకు పార్టీ అభ్యర్థులను, గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు పేర్లను ఒకటిరెండు రోజుల్లో అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీల్లో ఒక సీటును టీజేఎస్ అధినేత కోదండరాంకు ఖరారైంది. మరో సీటును మైనార్టీ వర్గానికి కేటాయిస్తున్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, విద్యావేత్త జాఫర్ జావెద్ పేరును రెండో సీటుకు ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఆయనతో పాటుగా సాహిత్య, సామాజిక రంగాల్లో సేవలు అందించిన పలువురు ముస్లిం వ్యక్తుల పేర్లూ పరిశీలనలో ఉన్నాయి. ఇక ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీకిగాను బీసీ సామాజిక వర్గం నుంచి మహేష్ కుమార్‌గౌడ్, రెడ్డి సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి చిన్నారెడ్డి, బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కార వేణుగోపాల్, ఎస్సీ సామాజిక వర్గం నుంచి అద్దంకి దయాకర్‌ల పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే అద్దంకి దయాకర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి పోటీకి దింపాలన్న ఆలోచనా అధిష్ఠానం చేస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగానూ చిన్నారెడ్డి పేరు పరిశీలనలో ఉంది. వీరితో పాటుగా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్, ఉపాధ్యక్షుడు పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితర నేతలూ తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మొత్తమ్మీద సామాజిక సమీకరణలు చూసుకుని రెండు స్థానాలకు అధిష్ఠానం అభ్యర్థులను నియమించనుంది.

అక్రమబద్ధీకరణపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)



రాజేంద్రనగర్ మండలాల పరిధిలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములున్నాయి. జీవో 59ని వాడుకుని ఆ భూములను దక్కించుకోవడానికి కొందరు అక్రమార్కులు ప్రణాళిక రచించారు. గత ప్రభుత్వంలోని ఓ కీలక మంత్రితో పాటు ఓ ఎమ్మెల్యే అండదండలతో.. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నారు. ఆ వెంటనే ప్రముఖ నిర్మాణ సంస్థలకు గంపగుత్తగా అగ్రిమెంట్ సేల్ జీపీఏ చేసేశారు. గోపనపల్లిలోని సర్వే నంబర్ 74లో జర్నలిస్టు కాలనీకి ఆనుకొని ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కూడా కొందరు వ్యక్తులు అక్రమంగా క్రమబద్ధీకరించుకోవడంపై డిసెంబర్ 11న 'ఫలితాలకు ముందు భూమేత' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో అప్పట్లోనే దానిపై రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. అప్పట్నుంచీ 59 జీవో కింద జరిగిన క్రమబద్ధీకరణలపై విచారణ ప్రక్రియ సాగుతోంది. తాజాగా వెలుగు చూసిన దందాపైన కూడా విచారణ జరిపి.. ఈ రెండు, మూడు రోజుల్లోనే విచారణ తుది నివేదికను ప్రభుత్వానికి అందించే అవకాశాలున్నట్లు సమాచారం.

వారి ప్రమేయం ఉందా?

శేరిలింగంపల్లిలో విలువైన ప్రభుత్వ భూములను జీవో 59 కింద కొందరు వ్యక్తులకు ఎకరాలకు ఎకరాలు క్రమబద్ధీకరణ చేయడం వెనుక అప్పటి కలెక్టర్, రెవెన్యూ స్థాయిలో ఉన్నతాధికారుల ప్రమేయమున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌లు, ఆర్‌ఐలు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఎంత ఒత్తిడి చేసినా.. ఏ నిర్మాణాలూ లేని ప్రభుత్వ భూములను 59 కింద ఎలా క్రమబద్ధీకరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. ఆ జీవో కింద క్రమబద్ధీకరణకు ఎవరైనా దరఖాస్తు చేస్తే, సదరు స్థలాన్ని స్థానిక తహసీల్దార్‌తో పాటు పక్క మండలానికి చెందిన మరో తహసీల్దార్ ఉమ్మడిగా సర్వే చేసి ఉన్నతాధికారికి నివేదిక ఇవ్వాలి. ఈ క్రమంలోనే.. శేరిలింగంపల్లి మండలం పరిధిలో 59 జీవో కింద విలువైన స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి స్థానిక తహసీల్దార్‌తో పాటు గండిపేట మండలానికి చెందిన తహసీల్దార్‌తో కూడిన అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారికి నివేదికను అందించింది. 2014లో 58, 59 జీవో దరఖాస్తులకు సంబంధించి తహసీల్దార్లతో కూడిన అధికారుల బృందం నిర్ధారించిన తర్వాత.. ఆర్డీవో స్థాయిలోనే క్లియరెన్స్ ఉండేది. కానీ 2020 తర్వాత 58, 59 దరఖాస్తులను తహసీల్దార్లతో కూడిన అధికారుల బృందం నిర్ధారించాక.. ఆయా దరఖాస్తులు నేరుగా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తున్నాయి. నిర్ణయాధికారం కలెక్టర్‌దే. ఈ నేపథ్యంలోనే.. శేరిలింగంపల్లి మండలంలోని గోపనపల్లి, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, రాయదుర్గంపాన్‌మక్తా, రాయదుర్గం నౌకలాసా, కొండాపూర్, కొత్తగూడ, గుట్టలబేగంపేట, నల్లగండ్ల, శేరిలింగంపల్లి, చందానగర్, గఫూర్‌నగర్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను అక్రమార్కులకు కట్టబెట్టడానికి శేరిలింగంపల్లి, గండిపేట తహసీల్దార్ల బృందం అనుకూలమైన నివేదికను అందించారా? లేక అనుకూలంగా ఇచ్చేలా వారిపై ఒత్తిడి తీసుకొచ్చారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమబద్ధీకరణకు అప్పటి కలెక్టర్ ఎలా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు? కలెక్టర్‌కు తెలియకుండానే వేల కోట్ల విలువైన భూములు పరాధీనమయ్యాయా? అనే ప్రశ్నలూ ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై ఇప్పటికే అదనపు కలెక్టర్‌తో విచారణ జరుగుతున్న నేపథ్యంలో.. పూర్తి వివరాలు త్వరలో వెలుగులోకి రానున్నాయి.

బీఆర్ఎస్ భూదందాలపై సమగ్ర విచారణ

టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భూదందాలు, అడ్డగోలు అక్రమాలు జరిగాయని.. కల్వకుంట్ల కుటుంబంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు అయిన కాడికి దోచుకున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. అలాంటి దందాలు ఎంత అడ్డగోలుగా జరిగాయో చెప్పడానికి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'భూంఫట్ స్వాహా' వార్తే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ భూదందాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా ఉందని.. సమగ్ర విచారణ జరపడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను ఇప్పటికే బదిలీ చేశామని.. ధరణిపైన కమిటీ వేశామని గుర్తుచేశారు.

సూర్యాపేట మునిసిపాలిటీలో ముసలం

చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసానికి సిద్ధం

మంచిర్యాల మునిసిపాలిటీలోనూ ఇదే తీరు

సూర్యాపేట టౌన్, జనవరి 10: సూర్యాపేట మునిసిపాలిటీలో ముసలం పుట్టింది. మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ పుట్ట మధుకు అవిశ్వాసం సెగ తగిలింది. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన వీరిద్దరిపై ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. అవిశ్వాసం తీర్మానం కోరుతూ 32 మంది కౌన్సిలర్లు సంతకం చేసిన లేఖను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావుకు బుధవారం అందజేశారు. మునిసిపాలిటీలోని మొత్తం 48 మంది కౌన్సిలర్లలో ఒకరు ఇప్పటికే తమ పదవికి రాజీనామా చేయగా అవిశ్వాసం నెగ్గాలంటే 25 మంది మద్దతు తప్పనిసరి. కలెక్టర్‌కు అందజేసిన తీర్మానంలో 32 మంది సంతకాలు చేశారు. సంతకం చేసిన వారిలో బీఆర్ఎస్ నుంచి 15 మంది, కాంగ్రెస్ నుంచి 9 మంది, నలుగురు బీఎస్పీ, నలుగురు బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండగా ప్రభుత్వం మారడంతో అసమ్మతి నేతలు తిరుగుబావుట ఎగరేశారని అంటున్నారు. వీరంతా హైదరాబాద్ వేదికగా క్యాంప్ రాజకీయాలకు తెరలేపినట్టు తెలిసింది.

మంచిర్యాల మునిసిపల్ చైర్మన్ రాజీనామా

మంచిర్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మునిసపల్ చైర్మన్ పెంట రాజయ్య తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. మునిసిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లకు గాను బీఆర్ఎస్ నుంచి 26 మంది, కాంగ్రెస్ నుంచి 10 మంది గెలుపొందారు. ఇటీవల 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 26కు చేరగా వీరంతా చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ డిసెంబరు 15న కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. దీనిపై గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. కానీ, రాజయ్య బుధవారమే పదవికి రాజీనామా చేశారు. వైస్ చైర్మన్ ముకేష్ గౌడ్ మంగళవారమే తన రాజీనామా ప్రకటించారు.

రెండు కాదు.. మూడు పులులు!

- విషపు ఆవును తిన్న మరో పులి
- ట్రాప్ కెమెరాలో వీడియో రికార్డు
- ఇప్పటికే రెండు పులుల మృతి
- మూడోది కూడా మరణించిందా..?
- ఇతర పులుల కోసమూ అడవుల జల్లెడ



ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పెద్దపులుల మృత్యువాత ఘటన తర్వాత అటవీశాఖ మిగిలిన వాటి కోసం అన్వేషణ ప్రారంభించింది. ఈ ప్రాంతంలో చురుగ్గా సంచరించే ఎస్-6, దాని పిల్లల ఆచూకీ వారం రోజులుగా కన్పించకుండా పోవటంతో అవి సురక్షితంగా ఉన్నాయా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారుల్లో ఆందోళన కన్పిస్తోంది. మంగళవారం రాత్రి నుంచి పెద్ద సంఖ్యలో అటవీ సిబ్బంది కాగజ్‌నగర్ దరిగాం నుంచి అటు వాంకిడి, ఇటు సిర్పూరు వరకు గతంలో పులుల కదలికలున్న ప్రాంతాలన్నింటినీ జల్లెడ పడుతున్నారు. సోమవారం కనుగొన్న ఎస్9 మగ పులితోపాటు మొత్తం మూడు పులులు విషపూరితమైన ఆవు మాంసాన్ని భుజించాయి. ఈ దృశ్యాలు కెమెరాల్లో రికార్డు అయ్యాయని అటవీశాఖకు చెందిన విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. వీటిలో ఇప్పటికే రెండు పులులు మృతిచెందడంతో మరో పులి ఏమై ఉంటుందన్న కోణంలో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆ పులి కూడా ఇదే మాంసాన్ని భుజించటం వల్ల చనిపోయిందా..? లేదా సురక్షితంగా ఉందా అనే విషయాన్ని తేల్చేందుకు ఎనిమల్ ట్రాకర్స్‌తోపాటు ఫారెస్టు రేంజర్లు, బీట్ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా, మిగితా పులుల కోసం తాగునీటి వనరులు, గతంలో సంచరించిన ప్రదేశాల్లో గాలిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి మిగతా పులులకు సంబంధించిన పాదముద్రలు(పగ్‌మార్క్స్) లభ్యం కాకపోవటంతో సిబ్బందికి వాటి జాడ గుర్తించడం కష్టతరంగా మారినట్లు తెలుస్తోంది.

విషం పెట్టి.. వీడియో తీసి..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులులు మృత్యువాత కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్టు సమాచారం. వాంకిడి మండలం సర్కపల్లికి చెందిన నలుగురు చనిపోయిన ఆవుపై విషం చల్లి వీడియో తీసినట్టు తెలిసింది. ఆవుపై విషం చల్లిన తర్వాత వీరంతా పులి రాక కోసం కాసేపు వేచి చూశారు. కొద్దిసేపటి తర్వాత పులి తన పిల్లలతో వచ్చి చనిపోయిన ఆవును తిన్నది. ఈ దృశ్యాలను కూడా వారు సెల్‌ఫోన్‌తో చిత్రీకరించారు. వరుసగా రెండు పులులు చనిపోవటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేగటంతో సర్కపల్లి అటవీ ప్రాంతానికి సంబంధించిన సీసీ ఫుటేజీలను పరిశీలించి నలుగురు అనుమానితులను తమదైన శైలిలో విచారణ జరుపగా, విషం పోసిన డబ్బాను అధికారులకు చూపించినట్టు తెలిసింది.

దేశంలో ఎవరూ కేసీఆర్‌లా కష్టపడలే

(మొదటిపేజీ తరువాయి)



తెలంగాణ భవన్‌లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కేటీఆర్

దృష్టిపెట్టడంతో పార్టీకి తక్కువ సమయం కేటాయించాల్సి వచ్చిందన్నారు. ఇకపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకుని పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తామని చెప్పారు. పార్టీని ఏక తాటిపైకి తెచ్చేందుకు నాయకులు, ముఖ్య కార్యకర్తలకు త్వరలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ శ్రేణులు ఎవరైనా తెలంగాణ భవన్‌కు రావొచ్చని, తనతోపాటు సీనియర్ నాయకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో బీఆర్ఎస్ సీనియర్ నేతలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, కడియం శ్రీహరి, బండ ప్రకాశ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి వంద రోజుల సమయం ఇద్దామనుకున్నాం. వారేమో ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునేందుకు గవర్నర్ ప్రసంగం, శ్వేత పత్రాల ద్వారా కేసీఆర్ ప్రభుత్వాన్ని నిందించే ప్రయత్నం మొదలు పెట్టారు. అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని చూస్తే ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తాం. ప్రజలను వంచించాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి అసలు సినిమా ముందుంది" అని కేటీఆర్ అన్నారు.

లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీ బలోపేతం..


ఎన్నికల వరకు ప్రజలు తమతోనే ఉన్నారనే ధీమాలో ఉన్నామని, ఉద్యమాల గడ్డ అయిన వరంగల్ జిల్లాలోనూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే బీఆర్ఎస్ నేతలు ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందని కేటీఆర్ అన్నారు. జయశంకర్ సార్ పుట్టిన నేల అయిన వరంగల్‌లో 2014, 2019లో ఎంపీ సీటును బీఆర్ఎస్ గెలిచిందని, ఈసారి కూడా గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. లోపాలను సమీక్షించుకుని, పార్లమెంటు ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారంటీలు కాదని, 420 హామీలనే విషయాన్ని కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేస్తూనే ఉండాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను రాజకీయ అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోందని, వాటిపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోందని చెప్పారు. పేదల గొంతుకకు బీఆర్ఎస్ అండగా ఉండాలన్నారు. జిల్లాలను రద్దు చేస్తామని సీఎం రేవంత్ అవగాహన లేకుండా చెబుతున్నారని, అలా చేస్తే ప్రజలు ఊరుకోరని అన్నారు. నెల రోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైందని కేటీఆర్ వెల్లడించారు.

కేసులకు భయపడొద్దు..

అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ తప్పుడు కేసులు పెడుతోందని, వాటికి భయపడాల్సిన పని లేదని, బీఆర్ఎస్‌కు పటిష్ఠమైన లీగల్ సెల్ ఉందని నాయకులు, కార్యక్తలకు కేటీఆర్ తెలిపారు. కేసులు పెడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు సకాలంలో స్పందించి పోరాడాలన్నారు. కేసుల తీవ్రతను బట్టి రాష్ట్ర నాయకత్వం స్పందిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్‌ను ఉఫ్‌మని ఊదేస్తామని కొందరు నాయకులు అంటున్నారని.. 29 ఏళ్లుగా ఎంతో మంది అలా ప్రయత్నించి విఫలమయ్యారని చెప్పారు. బీఆర్ఎస్‌లో ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు అందరూ ఉన్నారని, ఈ పార్టీని లేకుండా చేయడం ఎవరి తరం కాదని కేటీఆర్ అన్నారు.

చంద్రబాబుకు భారీ ఊరట!

ఐఆర్ఆర్, మద్యం, ఇసుక కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు



అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రాష్ట్ర రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), ఉచిత ఇసుక పాలసీ, మద్యం పాలసీకి సంబంధించి సీఐడీ నమోదు చేసిన మూడు కేసుల్లోనూ ఉన్నత న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వారం రోజుల్లో సంబంధిత దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని చంద్రబాబుకు సూచించింది. దర్యాప్తు అధికారి సంతృప్తి మేరకు ఇద్దరి పూచీకత్తుతో రూ.లక్ష విలువ కలిగిన బాండు సమర్పించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు నిమిత్తం అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని చంద్రబాబుకు స్పష్టం చేసింది. అయితే ఆయన హాజరు కోరుతూ కనీసం 48 గంటల ముందు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు అధికారికి తేల్చిచెప్పింది. దర్యాప్తునకు సహకరించాలని, కేసుతో సంబంధం ఉన్నవారిని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ప్రలోభపెట్టవద్దని, బెదిరించవద్దని చంద్రబాబును ఆదేశించింది. కేసులకు సంబంధించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం తీర్పు వెలువరించారు. మరోవైపు మద్యం కేసులో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ శ్రీనరేశ్‌కు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేశారు.

ఇవీ కేసులు..

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ డిజైనింగ్‌తో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపకల్పనలో అక్రమాలు జరిగాయంటూ మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2022లో సీఐడీ కేసు నమోదు చేసింది. అయితే ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ వ్యవహారంలో తప్పు జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమిక ఆధారాలు చూపించాల్సి ఉందని న్యాయమూర్తి అన్నారు. గతంలో వేరే పార్టీ అధికారంలో ఉందని ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకుండా అనుమానించలేమని స్పష్టం చేశారు. ఇక చంద్రబాబుపై రెండో కేసును.. ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో సర్కారు ఖజానాకు నష్టం జరిగిందనే ఆరోపణలతో గనులశాఖ డైరెక్టర్, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసింది. అయితే ప్రభుత్వ విధాన నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించడంలో అధికార యంత్రాంగం విఫలమైతే.. అందుకు విధాన రూపకర్తలను బాధ్యులను చేయడానికి వీల్లేదన్నారు. కాగా, మద్యం కంపెనీలకు అనుచిత లబ్ధిచేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నారంటూ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ నమోదు చేసిన మరో కేసులోనూ చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరైంది. న్యాయశాఖ ఇచ్చిన సలహా మేరకే ఎస్పీవై ఆగ్రోస్‌కు లైసెన్స్ ఫీజును వాయిదాల విధానంలో చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు స్పష్టమవుతోందని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ఫీజు చెల్లింపులో అప్పటి సీఎం నేరుగా తీసుకున్నట్లు కనిపించడం లేదన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 11 జనవరి 2024

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకేజీపీ)- 'మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్‌ఆర్‌ఎం)', 'మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)', 'మాస్టర్ ఇన్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎంఎంఎస్‌టీ)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు.
● వెబ్‌సైట్: iitkgp.ac.in



ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంహెచ్‌ఆర్‌ఎం

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా వింటర్, సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ, మెడిసిన్ తదితర ప్రొఫెషనల్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. క్యాట్ 2023 అర్హత తప్పనిసరి. ఇందులో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 80; ఓబీసీ అభ్యర్థులకు 72; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 53.33 శాతం పర్సంటైల్ ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి క్యుములేటివ్ స్కోర్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 25
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** ముంబై, బెంగళూరు సెంటర్లలో మార్చి 15 నుంచి 17 వరకు; కోల్‌కతా, ఢిల్లీ సెంటర్లలో మార్చి 22 నుంచి 24 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25 నుంచి మే 5 వరకు

ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని వినోద్ గుప్త స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లకుగాను మొత్తం 91 క్రెడిట్స్ నిర్దేశించారు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి.

- **విభాగాలు:** బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ స్ట్రాటజీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, జనరల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.
- **అర్హత:** ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సైన్స్/ఎకనామిక్స్/కామర్స్ స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు 60 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్ 2023లో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 90; ఓబీసీ అభ్యర్థులకు 81; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం పర్సంటైల్ ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి క్యుములేటివ్ స్కోర్ ఆఫ్ అప్లికేషన్ రేటింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.
- **వెయిటేజీ:** అప్లికేషన్ రేటింగ్‌కు 20 శాతం; క్యాట్ 2023 లో వీఏఆర్‌సీ సెక్షన్ స్కోర్‌కు 20, డీఐఎల్‌ఆర్ సెక్షన్ స్కోర్‌కు 10, క్యూఏ స్కోర్‌కు 10 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు
- **ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు:** మొదటి షెడ్యూల్ మార్చి 2 నుంచి 4 వరకు; రెండో షెడ్యూల్ మార్చి 9 నుంచి 11 వరకు; మూడో షెడ్యూల్ మార్చి 22 నుంచి 24 వరకు
- **ఫలితాలు విడుదల:** మే 1 నుంచి 5 వరకు

ఎంఎంఎస్‌టీ

ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. మెడికల్ సైన్సెస్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వినియోగానికి సంబంధించి శిక్షణ ఇస్తారు. సైన్స్-ఇంజనీరింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ సబ్జెక్టులు, ఎలక్టివ్ సబ్జెక్టులు, సెమినార్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.


- **ప్రోగ్రామ్‌లోని అంశాలు:** ప్రివెంటివ్ అండ్ ప్రొమోటివ్ హెల్త్ కేర్ సిస్టం, బయో మార్కర్స్ అండ్ అప్లికేషన్ ఇన్ అంకాలజీ, బయో మెటీరియల్స్, క్యాన్సర్ రీసెర్చ్, మైక్రో ఫ్లూయిడ్స్ అండ్ పాయింట్ ఆఫ్ కేర్ డయాగ్నస్టిక్స్, బయో ఎంఈఎంఎస్ అండ్ సెన్సర్స్, వూండ్ హీలింగ్ రీసెర్చ్ అండ్ టిష్యూ ఇంజనీరింగ్, మెడికల్ ఇమేజింగ్ అండ్ ఇమేజ్ అనాలిసిస్, టెలీ మెడిసిన్ అండ్ టెలీ సర్జరీ, ప్రోటోమిక్స్ అండ్ మెటబాలిక్స్, రీ ప్రొడక్టివ్ హెల్త్, రెస్పిరేటరీ హెల్త్, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, రీహాబిలిటేషన్ ఇంజనీరింగ్, హెల్త్‌కేర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం, హెర్బల్ మెడిసిన్, మెషిన్ లెర్నింగ్ అండ్ కంప్యూటర్ అసిస్టెడ్ టెక్నాలజీ ఇన్ మెడికల్ ఇమేజింగ్, బయోస్టాటిస్టిక్స్, రీజనరేటివ్ మెడిసిన్, ఇమ్యూనాలజీ, కార్డియోవాస్క్యులర్ రీసెర్చ్.
- **అర్హత:** మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ సబ్జెక్టును అదనంగా చదివి ఉండాలి.
- **సీబీటీ వివరాలు:** ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 75 ప్రశ్నలను ఎంబీబీఎస్ సిలబస్ నుంచి; మిగిలిన 45 ప్రశ్నలను ఇంటర్ స్థాయి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్ నుంచి ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.
- **అసిస్టెంట్‌షిప్:** నిబంధనల ప్రకారం సెమిస్టర్ వర్క్‌లు పూర్తిచేస్తూ అకడమిక్ ప్రతిభ కనబరచినవారికి నెలకు రూ.25,000 అసిస్టెంట్‌షిప్ ఇస్తారు. ఇందుకుగాను అభ్యర్థులు సంస్థ ఆధ్వర్యంలోని బీసీ.రాయ్ టెక్నాలజీ హాస్పిటల్‌లో వారానికి పది గంటలు క్లినికల్ సర్వీస్ చేయాల్సి ఉంటుంది.
- **దరఖాస్తుకు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1800; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 17 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో ఎగ్జామ్ సెంటర్లు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **సీబీటీ తేదీలు:** మార్చి 17 నుంచి

ఐఐటీబీ మోనాష్‌లో పీహెచ్‌డీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే, మోనాష్ యూనివర్సిటీ(ఆస్ట్రేలియా) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటీబీ-మోనాష్ రీసెర్చ్ అకాడమీ' పీహెచ్‌డీ 2024 జూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడు నుంచి నాలుగేళ్ల వరకు ఉంటుంది. ఎంచుకొన్న పరిశోధనాంశాన్ని అనుసరించి అభ్యర్థులు కనీసం మూడు నుంచి ఆర్నెల్లు/ఏడాది వరకు మోనాష్ యూనివర్సిటీలో చదవాల్సి ఉంటుంది.

రీసెర్చ్ థీమ్స్

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటేషనల్ మోడలింగ్
- క్లీన్ ఎనర్జీ
- హెల్త్ సైన్సెస్
- స్మార్ట్ మెటీరియల్స్
- సస్టయినబుల్ సొసైటీస్ అండ్ మేనేజ్‌మెంట్
- సర్క్యులర్ ఎకానమీ
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ+ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారు కూడా అర్హులే. గేట్ స్కోరు లేని పక్షంలో రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. మోనాష్ యూనివర్సిటీ నిర్దేశించిన విధంగా ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి సంబంధించిన అర్హతలు ఉండాలి. ఐఈఎల్‌టీఎస్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, గేట్ స్కోరు/అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

ముఖ్య సమాచారం

- **స్కాలర్‌షిప్:** మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.4,20,000; తరవాత ఏడాదికి రూ.4,68,000 ఇస్తారు. ఆస్ట్రేలియాలో చదివేటప్పుడు ఏడాదికి 29,000 ఆస్ట్రేలియన్ డాలర్ల గ్రాంట్ ఇస్తారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** http://iitbmonash.org

ఇండియాలో ఎదుగుతున్న ఆన్‌లైన్ లెర్నింగ్


ఆన్‌లైన్ లెర్నింగ్‌పై విశ్వసనీయత ఇండియాలో రాన్రాను పెరుగుతోంది. లీడింగ్ టెస్ట్ ప్రిపరేషన్ వేదిక 'ఫిజిక్స్ వాలా' నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇరవై ఏడు లక్షల మంది విద్యార్థులు, సంస్థకు చెందిన యూట్యూబ్ చానల్స్ చందాదారులు నాలుగు కోట్ల మంది నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించారు. 2022 నుంచి రెండేళ్ళ పాటు ఈ సర్వే జరిగింది. కొవిడ్ అనంతర కాలంలో ఆన్‌లైన్ లెర్నింగ్‌కు జనాదరణ బాగుందని ఫిజిక్స్ వాలా తేల్చింది. ఒక్క పెయిడ్ కోర్సుల్లోనే 182 శాతం మేర ఎదుగుదల ఉందని గణాంకాలతో తేటతెల్లం చేసింది. ఆన్‌లైన్ కోర్సులపై అమితాసక్తికి ఇదే సాక్ష్యం. యాప్ డౌన్‌లోడ్స్‌లో 38 శాతం ఎదుగుదల ఉంది. పిన్‌కోడ్ ఉన్న గ్రామాలు, పట్టణాలతో సమీక్షించినప్పుడు 98 శాతం వరకు ఫిజిక్స్ వాలా చేరుకుంది. ఫిజిక్స్ వాలా చందాదారులు ఇప్పుడు నాలుగు కోట్లు. ఒక్క ఏడాదిలో దీని 81 యూట్యూబ్ చానల్స్ ద్వారా ఒక లక్ష మేర కంటెంట్ అప్‌లోడ్ అయ్యింది. రోజుకు వీక్షణ సమయం సైతం యాభై నుంచి అరవై అయిదు నిమిషాలకు పెరిగింది. హిందీ మీడియమ్‌లో బ్యాచ్‌లకు సంబంధించి ఎదుగుదల 300 శాతంగా నమోదైంది. తెలుగు సహా ప్రాంతీయ భాషల్లో పెరుగుదల అయిదింతలైంది.



టీఎస్‌పీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.



పిట్ ఇండియా చట్టం-1784: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను రెండు రకాలుగా విభజించారు.

1) బోర్డ్ ఆఫ్ కంట్రోల్: పరిపాలనా వ్యవహారాలను పరివేక్షిస్తుంది. దీనిలో ఆరుగురు సభ్యులు ఉంటారు.
2) కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్: వీరు వ్యాపార, వాణిజ్య అవసరాలను నియంత్రిస్తారు.

బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యవస్థల ఏర్పాటు దేశంలో పార్లమెంటేతర నియంత్రణనే కాక ద్వంద్వ పాలనకు కూడా పునాది వేసింది. 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా గవర్నర్ జనరల్‌కు సలహా ఇవ్వడానికి కౌన్సిల్ ఆఫ్ ఫోర్ అనే నలుగురు సభ్యుల కార్యనిర్వాహక మండలి ఉండేది. పిట్స్ ఇండియా చట్టం ద్వారా సభ్యులను ముగ్గురికి తగ్గించారు. ఈ చట్టం ద్వారానే దేశంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలు అనే పదం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. పిట్స్ ఇండియా చట్టం అనంతరం 1793, 1813, 1833, 1853 చార్టర్ చట్టాలు చేశారు.

చార్టర్ చట్టం-1793: 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసిన తరవాత బ్రిటిష్ పార్లమెంటు ప్రతి 20 సంవత్సరాలకు ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో కొనసాగడానికి సంబంధించిన అనుమతిని పునఃపరిశీలించాలని భావించింది. కానీ రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాల దృష్ట్యా 1784లో పిట్స్ ఇండియా చట్టాన్ని చేశారు. అనంతరం(1773 నుంచి 1853 వరకు) బ్రిటిష్ పార్లమెంటు ఈస్టిండియా కంపెనీని క్రమబద్ధీకరించడం, నియంత్రించడానికి ప్రతి 20 సంవత్సరాలకు ఒక చట్టాన్ని చేసింది.

చట్టంలోని ముఖ్యాంశాలు

1) ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి భారతదేశంలో 20 సంవత్సరాలు వ్యాపారం చేసుకునే అవకాశాన్ని పొడిగించారు.
2) కంపెనీ వ్యవహారాల వార్షిక నివేదికను బ్రిటన్ పార్లమెంటుకు సమర్పించాలి.
3) గవర్నర్ జనరల్‌కు కౌన్సిల్ తీర్మానాలపై వీటో అధికారాన్ని కల్పించారు.
4) కంపెనీకి వచ్చే లాభాల నుంచే ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించాలి.
5) మున్సిపాలిటీలకు చట్టబద్ధత కల్పించారు.
6) భారతీయులకు సంబంధించిన వారి ఆస్తులు, వివాహం, వారసత్వం, మతం మొదలైన అంశాల్లో బ్రిటిష్ పార్లమెంటు చేసే చట్టాలతోపాటు గవర్నర్ జనరల్ రూపొందించిన నియమాలకు సమానమైన విలువ ఉంటుంది.

చార్టర్ చట్టం-1813: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతి ఇచ్చారు. ఈస్టిండియా కంపెనీలో భారతీయులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించారు. భారతదేశ వ్యాపారంపై ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం (చైనాతో తేయాకు వ్యాపారం మినహా)పోయింది. ప్రతి బ్రిటిష్ పౌరునికి ఇండియాలో వ్యాపార స్వేచ్ఛ కల్పించారు. క్రైస్తవ మిషనరీలు ఇండియాకు వచ్చాయి. స్థానిక సంస్థలకు పన్నులు విధించే అధికారాన్ని కల్పించారు. ఇండియాలో విద్యావ్యాప్తికి ఒక లక్ష రూపాయలు కేటాయించారు.

1858 నవంబరు 1న మొదటి విక్టోరియా రాణి చేసిన చారిత్రాత్మక ప్రకటన - 'భారత ప్రజల అభ్యుదయమే మాకు బలం, వారి కృతజ్ఞతే మాకు పారితోషికం, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మాకు, మా ఉద్యోగులకు, భారత ప్రజలకు సేవ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఇచ్చుగాక'.

చార్టర్ చట్టం-1833: ఈస్టిండియా కంపెనీకి మరో 20 సంవత్సరాలు వ్యాపార అనుమతి ఇచ్చారు. బెంగాల్ గవర్నర్ జనరల్ పదవిని, భారత గవర్నర్ జనరల్‌గా పదోన్నతులు కల్పించారు. మొదటి భారత గవర్నర్ జనరల్- విలియం బెంటింక్. సివిల్ సర్వీస్ పరీక్షల్లో భారతీయులకు ప్రవేశం కల్పించారు. కానీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యతిరేకత వల్ల దీని అమలు ఆగిపోయింది. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగుకి పెంచారు. గవర్నర్ కౌన్సిల్‌లో ఒక న్యాయ నిపుణుడైన సభ్యుడిని ఏర్పాటు చేశారు. న్యాయ సభ్యునిగా నియమించిన మొదటి వ్యక్తి- లార్డ్ మెకాలే. ఈయనే భారత 'లా కమిషన్ చైర్మన్'గా నియమితులయ్యారు.

చార్టర్ చట్టం-1853: బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతిని పొడిగించలేదు. ఇండియాలో సివిల్ సర్వీసులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. శాసన నిర్మాణంలో భారతీయులకు అవకాశం కల్పించారు. కానీ తుది నిర్ణయం గవర్నర్‌దే. గవర్నర్ జనరల్ విధులను రెండుగా విభజించారు. అవి- 1) శాసన నిర్మాణ విధులు 2) కార్య నిర్వాహక విధులు. అలాగే లా కమిషన్ సిఫార్సులను ప్రకటించారు. అవి- 1) 1859- సివిల్ వివాదాల చట్టం అమలులోకి వచ్చింది(సీపీసీ) 2) 1860- భారత పీనల్‌కోడ్ అమలులోకి వచ్చింది(ఐపీసీ) 3) 1861- క్రిమినల్ చట్టం అమలులోకి వచ్చింది(సీఆర్‌పీసీ). కానీ కంపెనీ హక్కులను పొడిగించే అంశాన్ని ప్రస్తావించలేదు.

భారత రాజ్యాంగచట్టం-1858: ఈ చట్టం ద్వారా దేశంలో ఈస్టిండియా కంపెనీ పాలన అంతమై నేరుగా బ్రిటిష్ పాలన ప్రారంభమైంది. ఈ చట్టంలో బ్రిటిష్ రాణి భారతదేశానికి కూడా మహారాణియే అని ప్రకటించడం ద్వారా దేశంలోని సంస్థానాలు కూడా బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని ఒప్పుకోవాల్సి వచ్చింది. భారత గవర్నర్ జనరల్‌ను వైస్రాయ్‌గా మార్చారు. మొదటి వైస్రాయ్ 'లార్డ్ కానింగ్'(చివరి భారత గవర్నర్ జనరల్). 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో గవర్నర్ జనరల్- కానింగ్. బ్రిటన్ మహారాణి భారతదేశానికి కూడా మహారాణియే. బ్రిటిష్ ప్రభుత్వంలో భారత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటు జరిగింది. మొదటి భారత వ్యవహారాల మంత్రి, భారత కార్యదర్శి- రిచర్డ్ స్టాన్లీ. భారతదేశం తొలిసారిగా బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలోకి వెళ్లింది. 1858 నవంబరు 1న మొదటి విక్టోరియా రాణి ఒక చారిత్రాత్మక ప్రకటన చేసింది. 'భారత ప్రజల అభ్యుదయమే మాకు బలం, వారి కృతజ్ఞతే మాకు పారితోషికం, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మాకు, మా ఉద్యోగులకు, భారత ప్రజలకు సేవ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఇచ్చు గాక'. భారత వ్యవహారాల మంత్రిత్వపు శాఖ భారత కౌన్సిల్ సభ్యుల సలహా మేరకు పనిచేస్తుంది. ఈ చట్టం ప్రకారం భారతదేశ పాలనా వ్యవస్థ మౌలిక స్థాయిలో ఏర్పడింది.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

లిటిల్స్




మీకు తెలుసా?

- నల్లగా, పొడవైన ముక్కు ఉండే ఈ కోడిలాంటి పక్షిని 'నార్తర్న్ బాల్డ్ ఐబిస్' అని పిలుస్తారు. దక్షిణ ఆఫ్రికాలోని ఎడారుల్లో, కొండల్లో, పచ్చిక బయళ్లలో ఇవి కనిపిస్తాయి.
- 135 సెంమీ పొడవు ఉండే ఈ పక్షి వింగ్ స్పాన్ 125 సెం.మీ. వీటి సంతతి మిడిల్ ఈస్ట్, యూరప్‌లో కూడా ఉన్నాయి. ఎక్కువగా నేలమీద నడవటంతో పాటు ఇవి చెట్లమీద ఎగురుతూ ఉంటాయి.
- 1758 సంవత్సరంలో ఈ పక్షి గురించి స్వీడిష్ పరిశోధకులు రాశారు.
- వీటి తలభాగంతో పాటు కాళ్లు కూడా పింక్ రంగులో ఉంటాయి. ఇవి చెట్లమీద, గుంపు పొదల్లో గూళ్లు పెడతాయి.




- ఇవి కాలనీలను ఏర్పరచుకుంటాయి. మూడేళ్లు పడినప్పటి నుంచి గుడ్లు పెడతాయి. కనీసం రెండు నుంచి నాలుగు గుడ్లు పెడతాయి. తెల్లని గుడ్లు. ప్రతి గుడ్డు 50 గ్రాముల బరువు ఉంటుంది. పొదగటానికి 28 రోజులు పడుతుంది.
- బరువు కేజీ నుంచి కేజీన్నర వరకూ ఉంటాయి. ఇవి ఒంటరిగా తిరుగుతుంటాయి. అందుకే వీటిని వేటాడటం వేటగాళ్లకు సులువు.
- వీటిని జూలో కూడా పెంచుతున్నారు. మనుషులతో స్నేహంగా ఉంటుందిది.
- చిన్న పక్షులు, పురుగులు, కీటకాలు, పండ్లు తిని బతుకుతాయి.
- సిరియాలో వీటి సంతతి లేదు. మొరాకోలో మాత్రం 500 పక్షులు ఉన్నాయి.
- ఒకచోట నుంచి మరొక చోటకు పోవటానికి ఇష్టపడవు. గుంపుగా కూడా జీవిస్తాయి. ప్రతి గుంపులో 50 పక్షులు ఉంటాయి. ఇవి కోపంగా ఉన్నప్పుడు జుట్టు నిక్కబొడుచుకుంటుంది. విమానంలా రివ్వున దూసుకెళ్తాయి.
- దక్షిణ ఆఫ్రికాలో వీటి సంఖ్య 4600 వరకూ ఉన్నాయి. ఈ జాతి కనీసం పది నుంచి పదిహేనేళ్ల వరకూ జీవిస్తాయి.

దారి కనుక్కోండి




10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



రంగులు వేయండి



డైలీ సుడోకు - 201

	4		6					
		9		4				8
	1			5	9	3		4
		4					6	9
8	6					1		
4		6	7	8			2	
1				3		7		
					5		9	

సుడోకు - 200 సమాధానం

9	5	1	8	2	4	6	7	3
3	2	6	9	7	1	8	4	5
4	7	8	5	6	3	1	2	9
1	6	4	3	9	2	7	5	8
2	8	5	1	4	7	3	9	6
7	3	9	6	5	8	4	1	2
8	4	3	2	1	9	5	6	7
5	9	7	4	8	6	2	3	1
6	1	2	7	3	5	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.